అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 3-2-2024

సమగ్ర తెలుగు దినపత్రిక


సంపుటి : 9 సంచిక : 346 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు వెల : 6.50



ఓట్ల వేటలో అంకెల గారడీ...

- బడ్జెట్‌లో నిర్మలమ్మ మాయాజాలం
- తొమ్మిది నెలలు నత్తనడక... ఆపై కుందేలు పరుగు
- చివరి త్రైమాసికంలోనే అధిక ఖర్చు
- ఎన్నికల ప్రయత్నాల్లో తలమునకలు

వివరాలు 3లో



సీబీఐ సోదాలు..

- హక్కుల కార్యకర్త హర్ష మందర్ ఇల్లు, కార్యాలయంలో దాడులు

న్యూఢిల్లీ : మాజీ ఐఏఎస్ అధికారి, హక్కుల కార్యకర్త హర్ష మందర్ ఇల్లు, కార్యాలయంలో సీబీఐ సోదాలు జరిపింది. సీబీఐ నుంచి వచ్చిన నలుగురు వ్యక్తుల బృందం ఉదయం 8 గంటల నుంచి ఈ దాడులు కొనసాగించింది. ఢిల్లీలోని ...11లో



విజయ్ రాజకీయ ప్రవేశం

- 'తమిళ వెట్రి కళగం' పార్టీ ఏర్పాటు
- 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి..

చెన్నై : ప్రముఖ తమిళ నటుడు విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్టు శుక్రవారం ప్రకటించారు. 'తమిళ వెట్రి కజగం' అనే పార్టీ ఏర్పాటు చేస్తున్నామని, ...11లో

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి

- రాష్ట్రానికి బీజేపీ ద్రోహం చేసింది
- విభజన హామీల అమలు ఊసేలేదు : సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి
- ఏచూరి, ఖర్గే, శరద్ పవార్, తిరుచ్చి శివను కలిసి కాంగ్రెస్ బృందం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు బీజేపీ ద్రోహం చేసిందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు కేవీపీ రామచంద్రరావు, రఘువీరా రెడ్డి, జెడి శీలం, గిడుగు రుద్రరాజు, తులసి రెడ్డి, మస్తాన్ వలీ, సుంకర పద్మశ్రీ తదితరులు శుక్రవారం నాడిక్కడ ఏచూరిని కలిశారు. ఈ సందర్భంగా ...11లో

దద్దరిల్లిన పార్లమెంట్

లోక్‌సభలో ఇండియా ఫోరం ఎంపీల వాకౌట్



రాజ్యసభలో మాట్లాడుతున్న ఖర్గే

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో జార్ఖండ్ అంశంపై వాడివేడిగా చర్చ జరిగింది. ప్రతిపక్షాల నినాదాలతో పార్లమెంట్ దద్దరిల్లింది. శుక్రవారం ఉదయం ఉభయ సభలు ప్రారంభమైన తరువాత హేమంత్ సోరెన్ అరెస్టు అంశాన్ని ఇండియా ఫోరం నేతలు లేవనెత్తారు. కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ఆ పార్టీ నాయకుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. "బీహార్‌లో నితీశ్ కుమార్ రాజీనామా చేసిన 12 గంటల్లోనే కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. జార్ఖండ్‌లో మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్నా చంపాయ్ సోరెన్ ప్రమాణ స్వీకారాన్ని జాప్యం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రోద్బలంతోనే హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేశారు. రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం ముక్కలు చేస్తోంది" అని విమర్శించారు. ఖర్గే వ్యాఖ్యలను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తోసిపుచ్చారు. "జార్ఖండ్‌లో వెలుగుచూసిన భూ కుంభకోణం కారణంగా ఆయన సీఎం పదవికి రాజీనామా చేయాల్సివచ్చింది. పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిన వ్యక్తికి కాంగ్రెస్ మద్దతు తెలుపుతున్నది. ఇది ఆ పార్టీ వైఖరికి నిదర్శనం" అని విమర్శించారు. మరోవైపు లోక్‌సభలోనూ ఈ అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర చర్చ జరిగింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ ధోరణికి నిరసనగా ఉభయ సభల నుంచి ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. "జార్ఖండ్‌లో నేడు ఏం జరుగుతుందో చూశాం. ఇది ప్రజాస్వామ్యంపై బీజేపీ చేస్తున్న దాడి. అయినప్పటికీ, దాని గురించి మాట్లాడే అవకాశం మాకు ఇవ్వకపోవడం విచారకరం" అని కాంగ్రెస్ లోక్‌సభ ఉపనేత గౌరవ్ గొగోయ్ అన్నారు. "ప్రభుత్వం ఏర్పడటం, కూలడం జరుగుతూనే ఉంటుంది. అయితే ...11లో

కూలగొడతామంటే కట్టేసి కొడతారు

కేసీఆర్ పాపాల భైరవుడు.. ఆయన మళ్లీ సీఎం కాలేరు

ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని పడగొడతామంటే ప్రజలు ఊరుకుంటారా?



- బీఆర్ఎస్‌కు ఎంపీ సీట్లు.. మోడీకి అమ్ముకోవడానికే
- ఈ ప్రాంతానికి ఏమీ ఇవ్వని మోడీకి ఓటెందుకు వేయాలి..?
- మరోపక్షం రోజుల్లో 15వేల కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ
- ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటాం.. : తెలంగాణ పునర్నిర్మాణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

ఇంద్రవెల్లి గడ్డ నుంచే ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తాం : ముఖ్యమంత్రి

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

"మరో ఆరు నెలల్లో ఈ ప్రభుత్వం పడిపోతుందని అక్కడక్కడ కొందరు మాట్లాడుతున్నారు.. నీ అయ్య జాగిరా.. ఎవడ్రా పడగొట్టేది.. వేలాది మంది యువకులు ఇక్కడ ఉన్నారు.. పడగొడతామన్న వారిని ఊర్లలో వేపచెట్టుకు కట్టేసి కొడతారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని పడగొడతా మంటే వారు ఊరుకుంటారా.. నీ కాందాన్ మొత్తం వచ్చినా బొర్లేసి తొక్కుతారు.. కేసీఆర్.. నిత్యానంద స్వామిలాగా ఒక దీవి కొనుక్కొని అక్కడ సీఎంగా ఉండాలి..లేదంటే ఆయన ఫామ్‌హౌస్‌కైనా సీఎం కావాలి.. తప్పితే ఈ రాష్ట్రానికి ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కాలేరు.. రైతులు, ఆదివాసీలు, దళితులు, నిరుద్యోగులను నిలువునా ముంచిన పాపాల భైరవుడు కేసీఆర్" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.



ఇంద్రవెల్లిలో జరిగిన పునర్నిర్మాణ సభకు హాజరైన ప్రజలు

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి శుక్రవారం తెలంగాణ పునర్నిర్మాణం పేరిట కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. సభకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఇంద్రవెల్లి నుంచే లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. ఇక్కడ్నుంచే ఇందిరమ్మ రాజ్య స్థాపనకు శ్రీకారం చుడుతున్నట్టు తెలిపారు. అంతకుముందు కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయాన్ని దర్శించుకున్నారు. అక్కడ రూ.7కోట్లతో చేపడుతున్న ...3లో

జార్ఖండ్ సీఎంగా చంపాయ్ ప్రమాణం

హైదరాబాద్‌కు ఎమ్మెల్యేలు

- మేం జోక్యం చేసుకోలేం.. హైకోర్టుకు వెళ్లండి : హేమంత్ సోరెన్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు



ప్రమాణస్వీకారం చేస్తున్న చంపాయ్ సోరెన్..



బేగంపేట విమానాశ్రయంలో ఎమ్మెల్యేలు

రాంచీ : జార్ఖండ్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభం ముగిసింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంపాయ్ సోరెన్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. రాంచీలోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సిపి. రాధాకృష్ణన్ ఆయనతో ప్రమాణం చేయించారు. కాంగ్రెస్ నేత అలంగీర్ ఆలం, ఆర్‌జెడి ఎమ్మెల్యే సత్యానంద్ భోక్తాలు మంత్రులుగా ప్రమాణం చేశారు.

మనీలాండరింగ్ ఆరోపణలతో మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఈడీ బుధవారం రాత్రి అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో 24 గంటలకుపైగా రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం నెలకొంది. ఆ తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై కొన్ని గంటల పాటు సందిగ్ధత నెలకొంది. చివరకు గురువారం అర్ధరాత్రి ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆమోదించారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, హేమంత్ సోరెన్ ప్రభుత్వంలో రవాణా మంత్రిగా పనిచేసిన చంపాయ్ సోరెన్ శుక్రవారం నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే ప్రభుత్వం అసెంబ్లీలో తన మెజారిటీని నిరూపించుకోవాల్సి వుంది.

చంపాయ్ సోరెన్‌కు జార్ఖండ్‌ముక్తి మోర్చా-కాంగ్రెస్-రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) కూటమికి చెందిన ...11లో



భువనగిరిలో నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

భవిష్యత్ మనదే..

కార్యకర్తలతో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

- మీరు నిజాం వారసులైతే.. మేము చాకలి ఐలమ్మ వారసులం : సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-భువనగిరి

భవిష్యత్ తమదేనని.. కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని, కేఆర్‌ఎంబీకి ప్రాజెక్టులిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం నల్లగొండ జిల్లాకు ద్రోహం చేస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ భువనగిరి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ బలంగా వుందని, కార్యకర్తలు భవిష్యత్ కోసం ఆలోచన చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం ఉందని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. పాలనలో నిజాయితీ చూపాలన్నారు. గ్రూప్-1 నోటిఫికేషన్ ఇవ్వండంటే సమాధానం లేదన్నారు. ఎన్నికల హామీలైన రైతు రుణమాఫీ, రూ.4 వేల పింఛన్ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ 420 హామీలపై బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు గ్రామాల్లో చర్చలు పెట్టాలని సూచించారు. అదానీ, కాంగ్రెస్ ఒక్కటే అని ఆరోపించారు. రాష్ట్ర అప్పులపై తప్పుడు ప్రచారం ...11లో

రైల్వే బడ్జెట్ కేటాయింపుల్లో భారీ వ్యత్యాసం

తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలుగురాష్ట్రాల మధ్య కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆర్థిక వివక్షను ప్రదర్శించింది. పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.9,138 కోట్లను కేటాయించగా, తెలంగాణ రాష్ట్రానికి కేవలం రూ.5,071 కోట్లు మాత్రమే కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు రైల్వే బడ్జెట్‌లో రూ.4,418 కోట్లు కేటాయిస్తే, ఈ సారి 14 శాతం అధికంగా నిధులు కేటాయించారని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. శుక్రవారంనాడిక్కడి రైల్ నిలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు అంశాలపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సూటిగా సమాధానాలు చెప్పలేదు. 'పాలసీ మేటర్...మాకు తెలీదు...మా దృష్టికి రాలేదు' అంటూ దాటవేత ధోరణి అవలంబించారు. బడ్జెట్ కేటాయింపుల కోసం తెలంగాణ నుంచి పంపిన ప్రతిపాదనలు చెప్పేందుకూ నిరాకరించారు. రైల్వే బడ్జెట్ కేటాయింపుల కోసం పలువురు పార్లమెంటు సభ్యులు నేరుగా రైల్వే జీఎమ్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించిన విషయం తెలిసిందే. ఆ డిమాండ్లను పరిగణనలోకి తీసుకున్నారో లేదో కూడా స్పష్టత ఇవ్వలేదు. ప్రయాణీకులే ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్లు ఎక్కట్లేదంటూ, సర్వీసుల నిలిపివేతను సమర్థించుకున్నారు. బడ్జెట్ ప్రతిపాదనలు తాము జోన్ మొత్తంగా పంపామని చెప్పిన ఆయన, వాటిలో కేంద్రం తిరస్కరించిన అంశాల వెల్లడిని దాటవేశారు. బడ్జెట్ పింక్‌బుక్‌లో పేర్కొన్న అంశాలనే విలేకరుల ...11లో

లోపల ఎస్...బయట నో!

ప్రాజెక్టుల అప్పగింతపై దాగుడుమూతలు

- ముక్కున వేలేసుకుంటున్న జనం
- విమర్శల పాలవుతున్న సాగునీటి శాఖ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింత విషయంలో తెలంగాణ సాగునీటి శాఖ దాగుడుమూతలు ఆడుతున్నది. తెలంగాణకు చెందిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణ, నీటి విడుదల, ఇతర అంశాలపై కేంద్ర జలశక్తి శాఖ ఆదేశాల మేరకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి అప్పగిస్తామని అటు ఢిల్లీలో, ఇటు హైదరాబాద్‌లోని ఉన్నతాధికారుల సమావేశంలో చెప్పి, బయట మీడియాలో లేదంటూ బుకాయించడం నవ్వులపాల్జేస్తున్నది. తెలంగాణ సాగునీటి ప్రయోజనాలను కాపాడటంలో చిత్తశుద్ధి ప్రశ్నార్థకమవుతున్నది. ఉన్నతాధికారుల సమావేశాల్లో ఒకలా, బయట మరోలా వచ్చేలా మాట్లాడటాన్ని పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నది తెలిసింది. సీఎంతోపాటు సంబంధిత శాఖ మంత్రి ఉన్నతాధికారులపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారనే ప్రచారం జరుగుతున్నది. సున్నితమైన అంశాల్లో అధికారులు పకడ్బందిగా వ్యవహరించకపోవడం పట్ల అధికారులను నీలదీసినట్టు తెలిసింది. సందట్లో సడేమియాలా కేంద్ర జలశక్తి శాఖ వ్యవహరిస్తున్నది. తన స్వార్థ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకునే ప్రయత్నం చేస్తున్నది. రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలను పరిష్కరించకుండా గత పదేండ్లుగా చోద్యం చూస్తున్నది. నవంబరు నెలాఖరులో నాగార్జునసాగర్‌పై ఏపీ పోలీసులు దాడి చేసిన ఘటన నేపథ్యంలో ప్రాజెక్టు రక్షణ, ...10లో

రేపు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై చర్చించనున్న క్యాబినెట్

- ప్రధాన అజెండాగా 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలు
- టీఎస్‌పీఎస్సీపైనా చర్చ



(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌ను ప్రతిపాదించిన తరుణంలో రాష్ట్ర మంత్రివర్గం ఆదివారం సమావేశం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ భేటీలో త్వరలో శాసనసభలో ప్రవేశపెట్టబోయే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ గురించి ప్రధానంగా చర్చించనున్నారు. గురువారం మోడీ సర్కార్ ప్రతిపాదించిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి ఆర్థిక సాయాలూ లేని సంగతి విదితమే. రాష్ట్ర విభజన హామీలు సైతం అటకెక్కాయి. ఈ నేపథ్యంలో ఆ బడ్జెట్ ఆధారంగా, అక్కడ కేటాయింపులపై అంచనా వేసుకుని రూపొందిస్తున్న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై ఎలా ముందుకెళ్లాలనే అంశంపై క్యాబినెట్ సీరియస్‌గా చర్చించనుంది. ఇప్పటికే అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలు, నిధుల కేటాయింపునకు సంబంధించిన వివరాలను సేకరించిన ఆర్థిక శాఖ వాటిని మంత్రివర్గానికి సమర్పించనుంది. ఆయా వివరాలపై లోతుగా చర్చించిన తర్వాత... ఓటాన్ అకౌంట్ పద్దుకు తుది రూపు ఎలా ఇవ్వాలనే అంశంపై క్యాబినెట్ ఒక నిర్ణయం ...11లో

8 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు..?

వివరాలు 11లో

నత్తనడకన.. రూ.44 కోట్ల పనులు..!

- అధికారుల బాధ్యతా రాహిత్యం..కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం !
- మేడారం నాటికి అందుబాటులోకొచ్చేనా?

వాజేడు-వెంకటాపురం రహదారి పనుల్లో నాణ్యతా లోపం..



నవతెలంగాణ-వెంకటాపురం

ములుగు జిల్లా వాజేడు మండలం వై జంక్షన్ నుంచి వెంకటాపురం మండలం ఎదిర వరకు రూ.44 కోట్లతో రహదారి పనులు చేపడుతున్నారు. ఇంజినీరింగ్ అధికారుల బాధ్యతా రాహిత్యం, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంతో పనుల్లో నాణ్యత లోపించి నట్టు ఆరోపణలొస్తున్నాయి. గత బీఆర్ఎస్ పాలనలో రోడ్డు పనులు దక్కించుకున్న వరంగల్‌కు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధి రోడ్డు పనులు ప్రారంభించినప్పటి నుంచి పనుల్లో నాణ్యత చేపట్టట్లేదని విమర్శలొస్తున్నాయి. అసంపూర్తి పనులతో వెంకటాపురం-వాజేడు మండలాల్లో ప్రధాన రహదారిపై గుంతలు, కంకరతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి.

జాతరలోపు పూర్తయ్యేనా..?

మేడారంలో ఫిబ్రవరి 21 నుంచి 24 తేదీ వరకు సమ్మక్క, సారలమ్మ మహాజాతర జరగనున్న నేపథ్యంలో భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాల సందర్శకులు ఈ రహదారినే ఉపయోగిస్తారు. ప్రస్తుతం రోడ్డంతా అసంపూర్తి పనులతో గుంతలు ఉండటంతో ప్రయాణం ఆలస్యం అవుతోంది. జాతర ప్రారంభం నాటికి ఈ మార్గాన్ని పూర్తి స్థాయిలో బాగుచేస్తే ప్రయాణికులు, సందర్శకులకు ఇక్కట్లు తప్పనున్నాయి. ఆ దిశగా ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాల్సి ఉంది. మంత్రి సీతక్క దృష్టి సారించి రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భద్రాచలం-చంద్రుపట్ల ఆర్అండ్‌బీ రహదారి రెండు మండలాల పరిధిలో 65 కి.మీ నుంచి 113 కి.మీ వరకు విస్తరించి ఉంది. ఇసుక క్వారీల నిర్వాహణ, అధిక లోడు వాహనాల రాకపోకలతో రోడ్డు ధ్వంసమైంది. రహదారి మరమ్మతులకు సంబంధిత శాఖ రూ.23.80 కోట్ల అంచనాను రూపొందించింది. ఐదు బిట్లుగా విభజించిన ఈ రహదారి పనులను వరంగల్‌కు చెందిన ఓ నిర్మాణ సంస్థ దక్కించుకుంది. పనుల్లో జాప్యం, గోదావరి వరదలతో ఈ మార్గం పూర్తిగా ధ్వంసమైంది. ఈ క్రమంలో ఆ శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి దాదాపు 46 కి.మీ మార్గాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించేందుకు రూ.44 కోట్లకు అనుమతి ఇచ్చినట్టు తెలిసింది. ఈ పనులను సైతం అదే గుత్తేదారుతో చేయించేందుకు ప్రణాళిక చేపట్టినా ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. జగన్నాథపురం వై జంక్షన్ నుంచి వెంకటాపురం, చొక్కాల నుంచి పాత్రాపురం శివారు వరకు దాదాపు 18 కి.మీ పనులు పూర్తయ్యాయి. ఇంజినీరింగ్ అధికారి పర్యవేక్షణ లేకపోవడం, గ్యాంగ్‌మెన్‌ల ఆధ్వర్యంలో పనులు కొనసాగడంతో గుత్తేదారు నాణ్యతా ప్రమాణాలను గాలికొదిలేసినట్టు తెలుస్తోంది. దాంతో కొత్తగా వేసిన రోడ్డు పొడై దాని కింద ఉన్న పాత రోడ్డు దర్శనమిస్తోంది. లోపాలను కప్పిపుచ్చుకునేందుకు ఓవర్ లోడ్ వాహనాల రాకపోకలను అధికారులు సాకుగా చూపుతున్నట్టు సమాచారం. మరోవైపు పాత్రాపురం నుంచి ఎదిర గుట్టల వరకు 28 కి.మీ మేర మార్గంలో అనేక చోట్ల తారు తొలగించి కంకర పరిచి వదిలేశారు. దాంతో పెద్ద మొత్తంలో దుమ్ము లేస్తూ వాహనాదారులను ఇబ్బందుకుల గురిచేస్తోంది.



వెంకటాపురం నుంచి వై జంక్షన్ వరకు రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నాసిరకంగా పోసిన తారునూ ఇటీవల మళ్ళీ తవ్వారు. కానీ

పగుళ్లతో ఇబ్బందులు

పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కొప్పుల రఘుపతి, జగన్నాథపురం



అసంపూర్తి పనుల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై తారు తొలగించి కంకర పోయడంతో దుమ్ము, దూళి అంతా మా ఇండ్లలోనే ఉంటోంది. పెద్ద పెద్ద

ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి

గుంతల వల్ల వాహనదారులూ ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తి రోడ్ల కారణంగా చాలా ప్రమాదాలు జరిగాయి.

వంకా రాములు, అంకన్నగూడెం

జీవన్‌ధాన్ తెలంగాణకు ..

- 'హయత్ ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ ఫ్రేమ్‌వర్క్' పురస్కారం

నవతెలంగాణ-సిటీబ్యూరో

మరణించిన వారి అవయవాలను సేకరించి అవయవ మార్పిడికి అసాధారణమైన కృషి చేయడం.. సంబంధిత అధికారుల విజయాలకుగాను అంతర్జాతీయ స్థాయిలో జీవన్‌ధాన్ తెలంగాణకు 'హయత్ ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ ఫ్రేమ్‌వర్క్' పురస్కారం లభించింది. జనవరి 27వ తేదీన హోటల్ కాన్రాడ్ దుబాయ్ మెయిన్ హాల్‌లో జరిగిన వార్షిక యూఏఈ ఆర్గాన్ డొనేషన్, ట్రాన్స్‌ప్లాంట్ కాంగ్రెస్- 2024 లో జీవన్‌ధాన్ తెలంగాణకు ఈ పురస్కారం ప్రధానం చేశారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్గాన్ డొనేషన్, ట్రాన్స్‌ప్లాంటేషన్ నేషనల్ కమిటీ చైర్మెన్ డాక్టర్ అలీ అబ్దుల్ కరీమ్ అల్ ఒబైద్లీ, మానవుల అవయవాలను విరాళం అండ్ మార్పిడిని నియంత్రించే నేషనల్ సెంటర్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఎక్స్‌పర్ట్ డైరెక్టర్ డాక్టర్ పొలా గోమెజ్, యూఏఈ ఆరోగ్య మంత్రిత్వ శాఖ చేతుల మీదుగా ప్రముఖ నిమ్స్ నెఫ్రోలాజిస్ట్ అండ్ జీవన్‌ధాన్ తెలంగాణ ఇన్‌చార్జి ప్రొఫెసర్ స్వర్ణలత పురస్కారం అందుకున్నారు.

జీవో 55ను వెంటనే రద్దు చేయాలి

- యూనివర్సిటీ సమస్యపై సీఎం ఎందుకు స్పందించరు?
- విద్యార్థుల నిరసన.. పరీక్షల బహిష్కరణ
- మద్దతు తెలిపిన బీఆర్ఎస్వీ



నవతెలంగాణ-రాజేంద్రనగర్

జీవో 55ను వెంటనే రద్దు చేయాలని, కుమారి ఆంటీ విషయంలో స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి.. యూనివర్సిటీ సమస్యపై ఎందుకు స్పందించడం లేదని అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రశ్నించారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు చేపట్టిన ధర్నా శుక్రవారం ఉద్రిక్తతకు దారితీసింది. రెండో సంవత్సరం పరీక్ష రాయడానికి వెళ్తున్న విద్యార్థులను అడ్డుకున్నారు. యూనివర్సిటీ భూముల విషయంలో ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ ఎలాంటి పరీక్షలూ రాయబోమని విద్యార్థులు బహిష్కరించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి పరిపాలన భవనానికి తాళం వేసి టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. తాము 25 రోజులుగా శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. రోడ్డుపై ఫుడ్ స్టాల్ ఏర్పాటు చేసిన కుమారి ఆంటీ విషయంలో వెంటనే స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి.. యూనివర్సిటీ విద్యార్థుల నిరసనపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పీహెచ్‌డీ చదువుతున్న తమపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందన్నారు. యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయిస్తే యూనివర్సిటీ ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

బీఆర్ఎస్వీ మద్దతు..

విద్యార్థుల నిరసనకు బీఆర్ఎస్వీ యూత్ స్టేట్ ప్రెసిడెంట్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ ప్రాంతాన్ని పూర్తిగా రియల్ ఎస్టేట్ హబ్‌గా మార్చడానికి సీఎం రేవంత్ రెడ్డి యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బయోడైవర్సిటీ పార్క్, విద్యార్థులు పరిశోధన చేయడానికి అవకాశం లేకుండా పోతుందని అన్నారు. హైకోర్టు భవనాన్ని ఇక్కడ కాకుండా వేరే ప్రాంతంలో నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు విద్యార్థుల నిరసనకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

హన్మకొండ జిల్లాలో జాబ్‌మేళాకు విశేష స్పందన

- 873 మందికి నియామక పత్రాలు



నవతెలంగాణ-హనుమకొండ

హనుమకొండ జిల్లాలోని ఇండోర్ స్టేడియం, జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఉపాధి దోహద శిక్షణ సంస్థ, టీఎస్ స్టెప్, హైదరాబాద్ ధృవ్ కన్సల్టింగ్ సర్వీసెస్, జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. నిరుద్యోగ యువత భారీగా తరలివచ్చింది. 5454మంది అభ్యర్థులు హాజరయ్యారు. హైదరాబాద్, వరంగల్‌కు చెందిన దాదాపు 65 ప్లస్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 873మందికి నియామక పత్రాలు అందజేశారు. 3,078మందితో షార్ట్ లిస్ట్ తయారు చేశారు. వివిధ కంపెనీలలో ఉపాధి పొందిన మొదటి 10 మంది అభ్యర్థులకు స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్) కుమారి రాధికా గుప్తా, అసిస్టెంట్ కలెక్టర్ కుమారి శ్రద్దాశుక్లా జాబ్‌మేళాను ప్రారంభించారు.





మానవాభివృద్ధికి జీవ వైవిధ్యాన్ని ప్రోత్సహించాలి

ప్రకృతి సంపదకు ప్రతి జీవినీ కాపాడాలి : పర్యావరణ ఆటవీ శాఖ మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ-గండిపేట్

మానవ అభివృద్ధి కోసం జీవ వైవిధ్యాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహిస్తూ ప్రకృతి సంపదను పెంచాలని దేవాదాయ, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మణికొండ మున్సిపల్ పరిధిలోని నెక్నాంపూర్ పెద్ద చెరువు వద్ద రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు, ధ్రువాస్ సంస్థ సహకారంతో చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవ వేడుకలకు ఆమె హాజరై మాట్లాడారు. చిత్తడి నేలలు జీవవైవిధ్యం, మానవ శ్రేయస్సు గురించి కమ్యూనిటీలు, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలన్నారు. మానవ అభివృద్ధికి భూమిపై ఉన్న ప్రతి జీవరాశిని కాపాడాపాలని తెలిపారు. నీటి నుంచి కాలుష్య కారకాలను ఫిల్టర్ చేయగల దీర్ఘకాలిక సామర్థ్యం చిత్తడి నేలలకు ఉంటాయన్నారు. వ్యర్థాలు, ప్లాస్టిక్, డ్రయినేజీ వేయకుండా చిత్తడి నేలలను రక్షించే బాధ్యత అందరూ తీసుకోవాలని సూచించారు. రామ్‌సర్ ఒప్పందంలో పేర్కొన్న ప్రమాణాలకు అనుగుణంగా దేశంలో 74 వెట్ ల్యాండ్ స్పాట్స్ ఉండగా.. తెలంగాణలో ప్రస్తుతానికి అమీన్‌పూర్‌లో వెట్ ల్యాండ్ స్పాట్‌ను గుర్తించినట్టు తెలిపారు. టూరిస్టులు సేదతీరడానికి వెట్ ల్యాండ్ స్పాట్ చాలా ఆహ్లాదకరంగా ఉంటాయని, అందుకే వాటిని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాంటేషన్ డ్రైవ్‌లో ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పోస్టర్ పోటీ, ప్రాజెక్టు ఎగ్జిబిషన్, జీవవైవిధ్యంపై ఫొటో ఎగ్జిబిషన్, పర్యావరణ జీవన శైలిపై ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో అధికారి వాణిప్రసాద్, జీవవైవిధ్య మండలి అధికారి ఖార్తాడె, కలెక్టర్ శశాంక, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, ధ్రువాస్ సంస్థ డైరెక్టర్ మధులిక, తదితరులు పాల్గొన్నారు.

తాగు, సాగు కోసం నీరు విడుదల చేయండి

సాగర్ ఎడమ కాలువకు, ఎస్ఎల్‌బీసీ, వరద కాల్వకు నీరు వదలాలి

- మంత్రి ఉత్తమ్‌కు రైతు సంఘం వినతి
- చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్పీ ఎస్ఈకి మంత్రి ఆదేశం



నవతెలంగాణ-మిర్యాలగూడ

తాగు, సాగు నీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ఎడమ కాల్వ, ఎస్ఎల్బీసీ, వరద కాలువకు నీటిని విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డికి శుక్రవారం హైదరాబాదులో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తీవ్ర వర్షాభావం కారణంగా తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. రానున్న వేసవి కాలంలో ఉమ్మడి జిల్లాలో తాగునీటి ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. భూగర్భ జలాలను పెంచేందుకు తక్షణమే చెరువులు, కుంటలు నింపాల్సిన అవసరం ఉందన్నారు. ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని కోరారు. చెరువులు కుంటలు నింపితే ఉమ్మడి జిల్లాలో భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు. స్పందించిన మంత్రి సంబంధిత ఎన్ఎస్పీ ఎస్ఈకి ఫోన్ చేసి నీటి విడుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రిని కలిసిన వారిలో సీపీఐ(ఎం) నల్లగొండ, సూర్యాపేట జిల్లాల కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, మల్లు నాగార్జున రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు వీరపల్లి వెంకటేశ్వర్లు, బండ శ్రీశైలం, పారేపల్లి శేఖర్‌రావు ఉన్నారు.

రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి

విద్యార్థుల సమస్యలడిగి తెలుసుకున్న పొన్నం ప్రభాకర్

- సమస్యల పరిష్కారానికి చొరవ



నవతెలంగాణ-మనోహరాబాద్

మెదక్ జిల్లా తూప్రాన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్కూల్‌లో ఉన్న సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తూప్రాన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 640 మంది విద్యార్థులు చదువుతున్నారు. స్కూల్లో ప్రతి తరగతి గది తిరుగుతూ విద్యార్థులతో ముచ్చటించారు. 10వ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందున మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఆవరణ శుభ్రంగా లేకపోవడం, విద్యార్థుల హాస్టల్ వసతి, క్లాస్ రూమ్ గదులు ఒకే రూమ్‌లో ఉండటంతో అధికారులను పిలిపించి మాట్లాడారు. ఆర్డీఓ జయచంద్రా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దిన్, తహసీల్దార్ విజయలక్ష్మిని పిలిపించి స్కూల్ సమస్యలపై ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. స్కూల్‌లో వాటర్ ప్లాంట్ మరమ్మత్తుల కోసం మంత్రి స్వయంగా రూ.50 వేలను పాఠశాల సిబ్బందికి అందించారు. స్కూల్‌లో ప్రహరీ గోడ లేకపోవడంతో కుక్కలు వస్తున్నాయని సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. విద్యార్థులు కొంత మంది చెట్ల కింద చదువుతుండటంపై ఆరా తీశారు. వెంటనే అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశంతో పాటు రెసిడెన్షియల్ స్కూల్స్ కమిషనర్ రమణ బాబు, మెదక్ కలెక్టర్ రాజర్షి షాతో ఫోన్‌లో మాట్లాడారు. స్కూల్‌లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. స్కూల్‌లో విద్యార్థులకు బెడ్స్ ఏర్పాటు చేయాలని ఆర్డీఓను ఆదేశించారు. ప్లే గ్రౌండ్‌లో ఆట వస్తువులతో పాటు ఓపెన్ జిమ్, తాగునీటి సౌకర్యంతో పాటు వాటర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం, శానిటేషన్ పనులను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దిన్‌ను ఆదేశించారు. పాఠశాలకు ప్రహరీగోడ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. పాఠశాల సిబ్బంది సైతం విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి మంత్రి భోజనం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన సిబ్బందితో పాటు వాచ్ మెన్‌లను సన్మానించి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడు తూ.. పాత 35 రెసిడెన్షి యల్ స్కూల్స్‌లలో తూప్రాన్ స్కూల్ ఒకటని, స్కూల్‌లో మార్పులు జరగాలని, పాఠశాల రూపురేఖలు మార్చాలని ఆకస్మికంగా విజిట్ చేసినట్టు తెలిపారు. సీఎస్ఆర్ ఫండ్స్, ఆర్డీఓ, తహసీల్దార్‌ల ద్వారా కొన్ని సమస్యలు పరిష్కరించామని తెలిపారు. త్వరలోనే జిల్లా కలెక్టర్ విజిట్ చేయాలని సూచించారు. అందరూ సహకరించాలని, ఆదర్శ మోటార్స్ వారితో లైబ్రరీ కట్టించేలా మాట్లాడామన్నారు. కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, తుప్రాన్ ఆర్డీఓ జయ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దిన్, తహసీల్దార్ విజయలక్ష్మి , ఎంపీడీఓ అరుంధతి ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మధ్యంతర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ లేచి నిలబడగానే అందరిలోనూ ఒకటే ఉత్కంఠ. బడ్జెట్ దేనిపై దృష్టి సారిస్తుందనే విషయంపై ఆతృత. ఇది ఓట్-ఆన్-అకౌంట్ మినహా మరేమీ కాబోదని కొందరు పెదవి విరిచారు కూడా. ఎందుకంటే ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల ఓ ప్రకటన చేస్తూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌నే ప్రవేశపెడుతుందని చెప్పారు. అంతేకాదు...ఎన్నికల్లో విజయంపై ధీమా కూడా వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్‌ను సమర్పిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత బడ్జెట్‌ను ఒకసారి పరిశీలిద్దాం....



ఓట్ల వేటలో అంకెల గారడీ...

బడ్జెట్‌లో నిర్మలమ్మ మాయా జాలం


- తొమ్మిది నెలలు నత్తనడక... ఆపై కుందేలు పరుగు
- చివరి త్రైమాసికంలోనే అధిక ఖర్చు
- ఎన్నికల ప్రయత్నాల్లో తలమునకలు

న్యూఢిల్లీ : గడచిన పది సంవత్సరాల కాలంలో దేశాన్ని రెండు దఫాలు ఏలిన మోడీపై ప్రశంసల వర్షం కురిపించేలా బడ్జెట్ ప్రసంగం ఉంటుందని అందరూ భావించారు. బడ్జెట్ ప్రసంగం కొన్ని సంవత్సరాలుగా రెండు భాగాలుగా కొనసాగుతోంది. మొదటి భాగం ప్రభుత్వం ఇప్పటికే అవలంబించిన లేదా అవలంబించాల్సిన విధానాలను గురించి ఏకరువు పెడుతూ విసుగు పుట్టిస్తోంది. అయితే ఈ భాగంలో వనరుల సమీకరణ, కేటాయింపులు, అనుసరించాల్సిన వ్యూహం తదితర అంశాల ప్రస్తావనే ఉండదు. ఇది ఆందోళన కలిగించే విషయం. రాబోయే సంవత్సరానికి సంబంధించి ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ కూడా ఇదే తరహాలో ఉంది. ఈ బడ్జెట్ ప్రధానంగా సంక్షేమ పథకాలపై దృష్టి కేంద్రీకరించింది.' గృహ వసతి నుండి ఆహారం వరకూ...ఈ పథకాలన్నీ ప్రధానమంత్రి రూపొందించినవే. అయితే ఇలాంటి పథకాలనే బీజేపీ యేతర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసినప్పుడు వాటిని 'తీపి బహుమతి' సంస్కృతికి ప్రతినిధులు అంటూ ప్రధాని మోడీ ఎద్దేవా చేశారు. అలాంటప్పుడు అవి కూడా బీజేపీ ప్రభుత్వాలకు సంబంధించి తీపి బహుమతులే అవుతాయి కదా!

ప్రభుత్వ పనితీరును అంచనా వేయాలంటే...

బడ్జెట్‌లోని రెండో భాగం ద్రవ్యలోటు, జీడీపీ నిష్పత్తులు వంటి అంశాలతో కూడి ఉంటుంది. మౌలిక సదుపాయాలు, సంక్షేమంపై పెట్టే ఖర్చును ఇందులో తెలియజేస్తారు. ద్రవ్యలోటును తగ్గిస్తామని, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమానికి అధిక నిధులు కేటాయి స్తామని హామీలు గుప్పి స్తారు. అయితే ప్రభుత్వ పని తీరును అంచనా వేయా లంటే రాబోయే సంవత్సరానికి చేయబోయే కేటాయింపులను కాకుండా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జరిపిన కేటాయింపులు, చేసిన వాస్తవ వ్యయం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

ఇటీవలి కాలంలో ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశ పెడుతున్న బడ్జెట్లను పరిశీలిస్తే ఆర్థిక సంవత్సరపు సవరించిన అంచనాలలో మార్చి 31 వరకూ పొడిగించిన ఆర్థిక సంవత్సరపు చివరి త్రైమాసికానికి సంబంధించిన అంచనాలను చేరుస్తున్నారు. కాబట్టి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మొదటి మూడు త్రైమాసికాలలో వివిధ పద్దుల కింద పెట్టిన వాస్తవ వ్యయపు అంచనాలనే పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.



వ్యవసాయ రంగానికి కేటాయింపులు


వ్యవసాయం, రైతుల సంక్షేమ శాఖకు సంబంధించి ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాలకు, 2023 డిసెంబర్ వరకూ జరిగిన వాస్తవ వ్యయానికి మధ్య తేడా మరింత ఎక్కువగా ఉంది. ఈ శాఖ కిందే ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకం ఉంది. 2023-24లో ఈ శాఖకు బడ్జెట్‌లో చూపిన వ్యయం రూ.21,15,532 కోట్లు. సవరించిన అంచనా రూ.21,16,789 కోట్లు. డిసెంబర్ వరకూ అయిన వాస్తవ ఖర్చు సవరించిన అంచనాలో 61% అని కాగ్ తెలిపింది. ఒక్క పీఎం-కిసాన్ పథకానికే 2021-22లో రూ.166,825 కోట్లు ఖర్చు చేయగా 2022-23లో అది రూ.58,254 కోట్లకు తగ్గిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.60,000 కోట్లు ఖర్చు చేయాలని బడ్జెట్‌లో లక్ష్యంగా నిర్దేశించారు. డిసెంబర్ వరకూ అయిన వాస్తవ ఖర్చుకు, బడ్జెట్‌లో సవరించిన అంచనాలకు మధ్య తేడాలను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఉపాధి హామీకి కేటాయింపులు

కాగ్ అందించిన వివరాలను బడ్జెట్‌లో పూర్తి సంవత్సరానికి వేసిన అంచనాలతో పోల్చవచ్చు. ఉదాహరణకు గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన అంచనాలనే తీసుకుందాం. వీటిలోనే ముఖ్యమైన గ్రామీణ ఉపాధి హామీ పథకం చేరి ఉంది. 2023-24 సంవత్సరపు బడ్జెట్ వ్యయం రూ.1,57,545 కోట్లతో పోలిస్తే సవరించిన అంచనాలను అధికంగా...అంటే రూ.1,71,069 కోట్లుగా చూపారు. పథకానికి సరిపడా నిధులు లేవని, వేతన బకాయిలు పేరుకుపోయాయని, వేతన చెల్లింపులను ఆధార్‌తో అనుసంధానం చేయకపోవడంతో జాబ్‌కార్డు ఉన్న వారిని పనుల నుండి మినహాయించారని...ఇలా ప్రభుత్వ రకరకాల కారణాలు చెబుతోంది. కానీ బడ్జెటరీ వ్యయంతో పోలిస్తే సవరించిన అంచనాలు అధికంగా ఉండడం గమనార్హం.

సవరించిన, బడ్జెట్‌లో కేటాయించిన వ్యయాలను పోలిస్తే వాస్తవంగా ఏం జరుగుతోందో అర్థమవుతుంది. 2021-22లో గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు అయిన ఖర్చు రూ.198,468 కోట్లు. 2022-23లో ఈ వ్యయం రూ.190,806 కోట్లకు తగ్గిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ కార్యక్రమంపై సవరించిన అంచనా వ్యయం మరింత తగ్గింది (రూ.186,000 కోట్లు). తనది పేదల అనుకూల ప్రభుత్వమంటూ డాంబికాలు పలుకుతున్న ప్రభుత్వానికి ఈ గణాంకాలు చెంపపెట్టు వంటివి. ఇక్కడ ఆసక్తికరమైన విషయమేమంటే 2023 డిసెంబర్ వరకూ గ్రామీణాభివృద్ధి శాఖ రూ.1,07,912 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని కాగ్ నివేదిక తెలిపింది. సవరించిన అంచనాలలో చూపిన వ్యయంలో ఇది 63% మాత్రమే. దీనిని బట్టి అవగతమవుతున్నది ఏమంటే ఆర్థిక సంవత్సరపు అంచనా వ్యయంలో మూడో వంతు కంటే ఎక్కువ మొత్తం చివరి త్రైమాసికంలోనే జరుగుతోంది. అంటే మొదటి తొమ్మిది నెలలు నత్తనడక నడుస్తూ, చివర్లో కుందేలు మాదిరిగా పరిగెత్తడమన్న మాట.

ఓట్లు రాల్చే రంగాల పైనే శ్రద్ధ



రైతులు, గ్రామీణ కార్మికులకు ప్రభుత్వం పెద్ద ఎత్తున మద్దతు ఇస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెబుతున్నారు. తన వాదనకు మద్దతుగా ఆమె సవరించిన వ్యయ అంచనాలను చూపారు. డిసెంబర్ వరకూ తక్కువ మొత్తంలో ఖర్చు చేసిన ప్రభుత్వం, ఇప్పుడు దానిని వేగవంతం చేస్తోంది. దీని వెనుక ఎన్నికల ఎత్తుగడ ఉంది. ఏయే రంగాలపై డబ్బు ఎక్కువ ఖర్చు చేస్తే బీజేపీకి ఓట్లు పడతాయో ఆ రంగాలపై ఇప్పుడు దృష్టి సారిస్తోంది. అయితే గ్రామీణ ఉపాధి హామీ పథకంపై చేసిన వ్యయాన్ని పరిశీలిస్తే వాక్చాతుర్యంతో వాస్తవ కేటాయింపులను మరుగు పరచవచ్చునని బీజేపీ భావిస్తున్నట్లు కన్పిస్తోంది. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద 80 కోట్ల మందికి ఆహార మద్దతు అందించేందుకు ఉచితంగా రేషన్ అందిస్తానని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ వాస్తవం ఏమిటి? ఆహార సబ్సిడీ రానురానూ తగ్గిపోతోంది. 2021-22లో రూ.12,88,60 కోట్లుగా ఉన్న ఆహార సబ్సిడీ 2023-24లో రూ.12,87,194 (సవరించిన అంచనా) కోట్లకు తగ్గుతోంది. బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగానే వ్యయం చేస్తున్నామని చెబుతూనే ద్రవ్యలోటును జీడీపీలో 5.8%గా ఉంచుతామని ఆర్థిక మంత్రి చెప్పారు. ఇది బడ్జెట్ స్థాయి కంటే కొంచెం తక్కువ. తద్వారా ద్రవ్య మార్కెట్లను సంతోషపెట్టేందుకు నిర్మలమ్మ శతవిధాలా ప్రయత్నించారు. ఈ ఎత్తుగడలు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు కురిపించి, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం హ్యాట్రిక్ విజయం సాధించడానికి దోహదపడతాయా లేదా అన్నది వేచి చూడాల్సిందే.

కార్మిక వ్యతిరేక విధానాలపై

సమరశీల పోరు సాగించాలి

సీఐటీయూ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కే.హేమలత పిలుపు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



మాట్లాడుతున్న హేమలత

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు సాగించాలని సీఐటీయూ జాతీయ అధ్యక్షులు కే హేమలత పిలుపునిచ్చారు. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు శుక్రవారం హన్మకొండ ఫాతిమా నగర్‌లోని బాలవికాసలో ఉత్సాహంగా ప్రారంభ మయ్యాయి. ముందుగా సీఐటీయూ పతాకాన్ని జాతీయ అధ్యక్షులు డాక్టర్ కే.హేమలత ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళులు అర్పిస్తూ కళాకారులు పాటలు పాడారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిందాబాద్.. కార్మిక వర్గ ఐక్యత వర్ధిల్లాలి, మతతత్వ విధానాలు నశించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వర్కింగ్ కమిటీ సమావేశాలను జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జాతీయ అధ్యక్షులు కే.హేమలత మాట్లాడుతూ.. ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం పెరుగుతోందని, దీని ప్రభావం మన దేశంపైన తీవ్రంగా ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల పేద, ధనిక తారతమ్యాలు తీవ్రమవుతున్నాయని వాటి దుష్ఫలితాల వల్ల నిరుద్యోగం, దారిద్ర్యం పెరుగుతుందని విమర్శించారు. కనీస వేతనాలు ధరలకు అనుగుణంగా పెరగకపోవడం వల్ల కొనుగోలు శక్తి క్షీణిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలకు గణనీయ లాభాలు, కార్మికుల వేతనాలు క్షీణించడం ఒక ధోరణిగా ప్రభవించిందన్నారు. వ్యవసాయరంగం గత ఐదేండ్లుగా సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో ఈ నెల 16న గ్రామీణ భారత్ బంద్, కార్మిక సమ్మెకు సన్నద్ధమవుతున్నట్టు తెలిపారు. ఈ కార్మిక సమ్మెలో కోట్లాదిమంది కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతాంగ సమస్యలు పరిష్కరించలేక రామాలయ నిర్మాణం పేరుతో భావోద్వేగాల ఆధారంగా 2024 పార్లమెంట్ ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తున్నదన్నారు. బహుళ జాతి సంస్థల ప్రయోజనాల కోసం దేశంలోని 139 కోట్ల మంది ప్రజల హక్కులను పణంగా పెడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. ముందుగా ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ స్వాగత ఉపన్యాసం చేశారు. పోరాటాల గడ్డ, చారిత్రక నగరం హన్మకొండలో జాతీయ సమావేశాలు నిర్వహించడం సంతోషం అన్నారు.

ఈ సమావేశాలను ఉపయోగించుకొని రాబోయే కాలంలో ప్రజా, కార్మిక సమస్యల మీద పోరాటాలు చేస్తూ సీఐటీయూని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. సమావేశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ రాష్ట్ర కార్యదర్శి జే.వెంకటేష్, భూపాల్, ఎస్. రమ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టీ.ఉప్పలయ్య, జిల్లా నాయకులు గాదె ప్రభాకర్ రెడ్డి, మెట్టు రవి, బొట్ల చక్రపాణి, సారంగపాణి, బి.సంపత్, రజితలతోపాటు జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ధరణి కమిటీ

సమావేశం

వక్ఫ్‌బోర్డు, దేవాదాయ భూములపై సమీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధరణి కమిటీ శనివారం సచివాలయంలో సమావేశం కానుంది. వక్ఫ్ బోర్డు, దేవాదాయ భూములపై ఆయా శాఖలతో కమిటీ ప్రతినిధులు చర్చించనున్నారు. ఆ రెండు విభాగాలకు రాష్ట్రంలో వేలాది ఎకరాల భూములున్నాయి. అయితే వీటి సంరక్షణలో జాగ్రత్తలు తీసుకోక పోవడంతో కాలక్రమంలో వేల ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఎండోమెంట్, వక్ఫ్ బోర్డు పరిధిలో ఉన్న భూములు, ఆస్తులను కాపాడటానికి, రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖలు తీసుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. సర్వే, సెటిల్మెంట్ విభాగం ద్వారా రికార్డుల నిర్వహణ, భూ భారతి కార్యక్రమం, ల్యాండ్ పార్శిల్ మ్యాపులు, ధరణి పోర్టల్ కింద తీసుకున్న మ్యాపుల స్థితిపై ఆరా తీయనున్నారు. ఈ సమవేశంలో సీసీఎల్ కమిషనర్, కమిటీ కన్వీనర్ నవీన్ మిట్టల్, సభ్యులు ఎం. కోదండరెడ్డి, రేమండ్ పీటర్, వి. లచ్చిరెడ్డి, సునిల్, మధుసూదన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొంటారు.

రాష్ట్రంలో దొంగలు

అధికారంలోకి వచ్చారు

మేడ్చల్ నియోజకవర్గ విజయోత్సవ సభలో కేటీఆర్

నవతెలంగాణ-ఘట్‌కేసర్

రాష్ట్రంలో దొంగలు అధికారంలోకి వచ్చారు.. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం కొర్రెముల చెరుకు బాలయ్య గార్డెన్‌లో ఎమ్మెల్యే మలారెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన మేడ్చల్ నియోజకవర్గ విజయోత్సవ సభలో కేటీఆర్ ప్రసంగించారు. లంకె బిందెలున్నాయని వచ్చి చూస్తే ఖాళీ కుండలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అనడం దురదృష్టకరమన్నారు. లంకె బిందెల కోసం రాత్రిపూట దొంగలు గడ్డపారలు, తట్టలు పట్టుకొని వస్తారన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో అదే దొంగలు అధికారంలోకి వచ్చారని ఎద్దేవా చేశారు. సచివాలయంలో లంకె బిందెలుండవని కంప్యూటర్లు, ఫైళ్ళు, జీవోలుంటాయని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను నెరవేర్చకపోతే వెంటాడి భరతం పడతామని హెచ్చరించారు. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు రూ.2500 ఇస్తానని మాట ఇచ్చారని, దానికోసం రాష్ట్రంలో కోటి 57 లక్షల మంది ఆడపడుచులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో రాష్ట్రంలో 6.5 లక్షల మంది ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల వెంట ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉంటారని భరోసా కల్పించారు. ఢిల్లీలో మన గొంతు వినిపించాలంటే మనం పార్లమెంటులో ఉండాల్సిందేనని చెప్పారు.



రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా గట్టిగా నిలబడి బీఆర్ఎస్ నాయకులను గెలిపించుకుందామన్నారు.

కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చే సమయం ప్రధాని మోడీకి లేదన్నారు. కృష్ణా జలాల కోసం పోరాటం బీఆర్ఎస్ వల్లే సాధ్యపడుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మన హక్కులను కేంద్రం వద్ద తాకట్టు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియా కూటమికి బీటలు పారిందని, ఇప్పుడు ఆ కూటమిలో ఎవరూ లేరన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి నిరంతరం మేడ్చల్ ప్రజల కోసం పరితపించే వ్యక్తి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు వాచ్‌మెన్‌గా పనిచేస్తానని మల్లారెడ్డి అన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, బోడుప్పల్ మేయర్ బుచ్చిరెడ్డి, ఘట్కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, పోచారం మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మెన్ చామకూర భద్రారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉపయోగం లేని

కేంద్ర బడ్జెట్

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తాత్కాలిక బడ్జెట్ ఎన్నికల ముందు ప్రచార ఆర్భాటం తప్ప మహిళలకు ఏ మాత్రం ప్రయోజనకరంగా లేదని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి విమర్శించారు. బీజేపీ ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల పేదలకు మహిళలకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ బడ్జెట్ లో ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచకుండా గతేడాది సవరించిన బడ్జెట్ కంటే తక్కువ కేటాయింపులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు మహిళల ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయనీ, పెరుగుతున్న ఆకలి, ఆర్థిక దుస్థితిపై బడ్జెట్లో దృష్టి సారించి తగిన విధంగా కేటాయింపులు చేయలేదని తెలిపారు. 2014-2021 మధ్య మహిళా కార్మికుల ఆత్మ హత్యలు 137 శాతం పెరిగాయనీ, ఇది మన ఆర్థిక దుస్థితిని తెలియచేస్తోందని ఆమె వివరించారు. అయినా మహిళాభివద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచకపోవడం మోడీ సర్కారు నైజాన్ని బయటపెడుతున్నదని పేర్కొన్నారు. గత బడ్జెట్‌లో ప్రకటించిన బాలికల పొదుపు మొత్తాల పథకం ఇప్పటి వరకూ ప్రారంభం కాలేదనీ, జన్ ధన్ పథకంలో అనేక మోసాలు ఉన్నట్టు కాగ్ బట్టబయలు చేసినా మహిళా సాధికారత గురించి పాటు పడుతున్నట్టు ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం సరికాదని విమర్శించారు.

కూలగొడతామంటే కట్టేసి కొడతారు

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఇంద్రవెల్లి సభలో సీఎం ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన బీఆర్ఎస్ రాష్ట్రంలో ఎంపీ సీట్లు గెలవాలని అంటోందని.. ఎంపీ సీట్లు గెలిస్తే మోడీకి అమ్ముకుంటారని ఆరోపించారు. ఎన్డీఏకు మోడీ ఉన్నారని.. ఇండియా కూటమికి తాము ఉన్నామని.. ఎటూ లేని కేసీఆర్‌కు ఎందుకు ఓటేయాలని అన్నారు.

రాష్ట్రం మీద పడి దోచుకుతిన్నారు..

గత ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్లలో అడవి బిడ్డల గురించి ఒక్కరోజైనా సమీక్ష చేశారా.. ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలను ఆదుకోవాలని ఏనాడైనా చర్చించారా.. నీ కుటుంబం కోసమే తెలంగాణ రాష్ట్రం వచ్చిందా.. నీ బిడ్డల కోసమే సోనియమ్మ రాష్ట్రాన్ని ఇచ్చారా అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. పదేండ్లలో కేసీఆర్ దుర్మార్గమైన పాలన సాగించారని, రాష్ట్రం మీద పడి దోచుకుతిని విధ్వంస రాష్ట్రంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రూ.7లక్షల కోట్ల అప్పు తీసుకొచ్చిందని, వీటితో కడెం ప్రాజెక్టుకు కనీస మరమ్మతు చేయలేదని, సదర్‌మాట్ కూడా కట్టలేదని అన్నారు. మిషన్ భగీరథ పేరిట రూ.40వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. ఈ పథకం బాగా చేసినట్లయితే.. తాగునీటి అవసరాల కోసం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ.65వేల కోట్లు కేటాయించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. కోటి ఎకరాలకు నీళ్లిస్తామని చెప్పి లక్ష కోట్లు దోచుకున్నారని..హెలిక్యాప్టర్‌లో వస్తుంటే ఈ ప్రాంతమంతా ఎడారిలా కనిపిస్తోంది.. ఎక్కడ నీళ్లిచ్చారో కేసీఆర్ చెప్పాలని అన్నారు. ఎన్నికల్లో కూతురు ఓడిపోయినప్పటికీ దోపిడీ, పదవుల మీద వ్యామోహంతో మళ్లీ ఎమ్మెల్సీ ఇచ్చారని.. ఇక్కడి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలనే ఆలోచన చేయలేదని విమర్శించారు. ప్రగతి భవన్ పేరిట గడి కట్టుకొని గద్దర్ అన్నను కూడా రానీయకుండా అడ్డుకున్నారని, ఆయన ఉసురు తగిలినందుకే ప్రభుత్వం కూలిపోయిందని ఎద్దేవా చేశారు.

ఇంద్రవెల్లి ఘటనలో అమరులైన కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున కేటాయించి ఇండ్లు కట్టించి ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైద్యఆరోగ్యశాఖలో 7వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని.. మరోపక్షం రోజుల్లో 15వేల కానిస్టేబుల్ ఉద్యోగాలు కూడా భర్తీ చేస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో 2లక్షల ఉద్యోగాలు తప్పనిసరిగా కల్పిస్తామని హామీనిచ్చారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాకముందే ఆరు గ్యారంటీలు ఎందుకు అమలు చేయలేదని కొందరు సన్నాసులు మాట్లాడుతున్నారని, మీరు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఏనాడైనా ఆలోచించారా అని సీఎం ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే తాము రూ.10లక్షలతో బీమా సౌకర్యం కల్పించామని.. త్వరలోనే రూ.500కే సిలిండర్ సౌకర్యాన్ని ప్రియాంక గాంధీ ఆధ్వర్యంలో లక్ష మంది ఆడబిడ్డల సమక్షంలో ప్రారంభిస్తామని చెప్పారు. ఆదిలాబాద్‌ను దత్తత తీసుకొని తుమ్మిడిహేటీ, సదర్‌మాట్, కుప్టి ప్రాజెక్టులు నిర్మిస్తామని, కడెంకు మరమ్మతులు చేపడుతామని భరోసా ఇచ్చారు. తండా, గూడేలకు తాగునీరు, విద్యుత్, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15లక్షల చొప్పున జమ చేస్తామని చెప్పిన ప్రధాని మోడీ ఒక్కరికైనా ఖాతాలో వేశారా అన్నారు. ఈ ప్రాంతానికి ఏమీ ఇవ్వలేని మోడీకి ఓటు ఎందుకు వేయాలని ప్రశ్నించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని, త్యాగధనుల కుటుంబానికి చెందిన రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకు ఆదిలాబాద్ గడ్డ నుంచే కాంగ్రెస్ జెండా ఎగరాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండ సురేఖ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వినోద్, వివేక్‌వెంకటస్వామి, ఆది శ్రీనివాస్, వేం నరేందర్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లు రవి, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, బల్మూర్ వెంకట్, మాజీ ఎంపీ హన్మంతరావు, పార్టీ మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల అధ్యక్షులు కొక్కిరాల సురేఖ, విశ్వప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.


సచివాలయంలో ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసిన కేరళా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి జీ.ఆర్.అనిల్

మా రాష్ట్రానికి

బియ్యాన్ని పంపండి

మంత్రి ఉత్తమ్‌తో చర్చించిన కేరళ మంత్రి అనిల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న బియ్యాన్ని కేరళ అవసరాలను తీర్చేందుకు వీలుగా అక్కడకు పంపాలని ఆ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి జీ.ఆర్.అనిల్ కోరారు. ఇదే విషయమై ఆయన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో చర్చించారు. హైదరాబాద్‌కు విచ్చేసిన అనిల్ శుక్రవారం సచివాలయంలో ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ, కేరళ రెండు రాష్ట్రాలకు ప్రయోజనం కలిగేలా పరస్పర సహకరించుకునేలా ఒప్పందం చేసుకునేందుకు ఉన్న అవకాశాలపై వారిద్దరూ చర్చించారు.

వీటి సాధ్యాసాధ్యాలపై చర్చించి కార్యాచరణ ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేయాలని పౌరసరఫరాల కమిషనర్ డీ.ఎస్.చౌహన్‌ను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. ఇందుకోసం కేరళ రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డాక్టర్ డి.సుజిత్ బాబుతో చర్చించాలని సూచించారు. ఒప్పందం కుదిరితే ఇరు రాష్ట్రాలకు మేలు కలుగుతుందనీ, అదే సమయంలో కేరళ రాష్ట్రంలో అధికంగా వస్తున్న ఆహార ఉత్పత్తులను తెలంగాణకు వాడుకునేందుకు వీలుంటుందని తెలిపారు.

సంపాదకీయం

'నాటో' యుద్ధోన్మాద విన్యాసాలు!

"నిలకడైన రక్షకుడు 2024" అనే పేరుతో ఈ ఏడాది మే నెల వరకు కొనసాగే 1998 తరువాత అతి పెద్ద సైనిక విన్యాసాలను నాటో కూటమి ప్రారంభించింది. ఇలాంటి బల ప్రదర్శనలు ఫలానా వారిని ఉద్దేశించి అని ఎక్కడా చెప్పరు గానీ ఏదో ఒక లక్ష్యం లేకుండా జరగవు. దేశాలు గాకపోతే తాము తయారు చేసిన ఆధునిక ఆయుధాల పాటవాన్ని పరీక్షించి ప్రపంచానికి వెల్లడించేందుకు చేస్తారు. నాటో కూటమి జరుపుతున్న బలప్రదర్శన తమకు ముప్పు తెచ్చేందుకే అని, ఇప్పటికే ఆయుధాలను తమ సరిహద్దులకు తరలించారని, తాము కూడా తగిన సన్నాహాలు చేసుకుంటున్నామని రష్యా ప్రకటించింది. సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్న స్వీడన్‌తో సహా 32దేశాలు జరుపుతున్న విన్యాసాలు మూడవ ప్రపంచ యుద్ధానికి సన్నాహాలు అని కొందరు వర్ణించారంటే నిజానికి ఇవి ఒక్క రష్యాకే కాదు, యావత్ ప్రపంచానికి సామ్రాజ్యవాదులు తెస్తున్న ముప్పుగా పరిగణించాలి. కొద్దిరోజుల్లో ఉక్రెయిన్ మీద రష్యా అమలు జరుపుతున్న సైనిక చర్య మూడవ సంవత్సరంలో ప్రవేశించనుంది. ఉక్రెయిన్‌ను అడ్డం పెట్టుకొని రష్యాను దెబ్బతీసేందుకు వందల కోట్ల డాలర్లను, ఆయుధాలను పశ్చిమ దేశాలు కుమ్మరిస్తున్నాయి. అది ఎప్పుడు తెగుతుందో తెలియదు. తమ దేశంలో పుతిన్ సర్కార్ ఉగ్రవాదాన్ని రెచ్చగొడుతున్నదని రష్యాను ఉగ్రదేశంగా ప్రకటించాలని ఉక్రెయిన్ చేసిన 2017లో చేసిన వినతిని హేగ్ నగరంలోని ఐరాస కోర్టు (ఐసిజె) తిరస్కరించింది. వచ్చిన ఆరోపణలపై మాస్కో దర్యాప్తు చేయటం లేదనే విమర్శ మాత్రమే చేసింది. ప్రస్తుతం జరుపుతున్న సైనిక చర్య మీద విచారణ జరిపేదీ లేనిదీ వేరే అంశమని పేర్కొన్నది. ఇప్పటికే దిక్కుతోచని స్థితిలో ఉన్న పశ్చిమదేశాలు ఈ పరిణామంతో జనాన్ని ఇంకేమాత్రం తప్పుదారి పట్టించలేవన్నది స్పష్టం. ఉక్రెయిన్‌కు ఎందుకు వందల కోట్ల డాలర్లను తగలేస్తున్నారని ప్రశ్నించే వారు నాటో కూటమి దేశాల్లో మరింతగా పెరుగుతారు. ఆ సంక్షోభం ముందుకు తెచ్చిన సమస్యలతో అనేక దేశాల్లో రైతాంగం ఇప్పటికే వీధులకు ఎక్కుతున్నది.



నాటో కూటమి తమ యుద్ధోన్మాదాన్ని, నేరాలను కప్పి పుచ్చుకొనేందుకు చైనా, రష్యాల నుంచి ప్రపంచానికి ముప్పు ఉందంటూ ఒక పథకం ప్రకారం ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే. తైవాన్ సమస్యకూ నాటోకూ ఎలాంటి సంబంధమూ లేదు. అయినప్పటికీ ఈ రోజు ఉక్రెయిన్ మీద రష్యా దాడి చేసింది రేపు తైవాన్ మీద చైనా అదే పని చేయవచ్చంటూ నాటో అధిపతి స్టోల్టెన్‌బర్గ్ తాజాగా అమెరికా పర్యటనలో లంకెపెట్టటం కుట్రలో భాగం తప్ప మరొకటి కాదు. నాటోతో చేతులు కలిపి తమ ముంగిటకు మిలిటరీని తెచ్చి ముప్పు తలపెడుతున్నదనే కారణంతోనే రష్యా మిలిటరీ చర్యకు పూనుకుంది. తైవాన్ ప్రాంతం చైనాలో అంతర్భాగమని, రెండు చైనాలు లేవని ఐరాసతో పాటు అన్ని దేశాలూ గుర్తించాయి. విలీనానికి తగిన సమయం రాలేదని, బలవంతంగా విలీనం చేసుకుంటే సహించబోమని పశ్చిమ దేశాలు ప్రకటించటమే కాదు, తైవాన్‌లో ఉన్న తిరుగుబాటు ప్రభుత్వానికి మిలిటరీ సాయం చేస్తున్నాయి. అయినప్పటికీ గడచిన ఏడుదశాబ్దాలుగా చైనా ఎలాంటి బలప్రయోగానికీ పూనుకోలేదు.

ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిందని, తామే విజేతలమని అమెరికా ప్రకటించుకున్న తరువాత జరుపుతున్న అతి పెద్ద నాటో సైనిక విన్యాసాల్లో వివిధ దేశాల నుంచి 90వేల మంది మిలిటరీతో పాటు యాభైకి పైగా విమానవాహక యుద్ధ నౌకల మొదలు డిస్ట్రాయర్లు, ఎనభైకి పైగా ఫైటర్ జెట్‌లు, హెలికాప్టర్లు, డ్రోన్లు, 133 టాంక్‌లతో సహా పదకొండువందల వరకు మిలిటరీ వాహనాలు పాల్గొంటున్నాయి. తమ బల ప్రదర్శనను సమర్థించుకొనేందుకు, ఐరోపా జనాన్ని తప్పుదారి పట్టించుకొనేందుకు, భయాన్ని సృష్టించేందుకు అనేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. ఉద్రిక్తలను మరింతగా పెంచేందుకు వ్లదిమిర్ ఒక పథకాన్ని రూపొందించాడని, దాని ప్రకారం వచ్చే ఏడాది నాటో-రష్యాకు చెందిన ఐదు లక్షల మంది సైనికులు తలపడతారనే అంచనాతో కూడిన ఒక పథకం లీకైందంటూ ప్రచారదాడి ప్రారంభించారు. దానిలో రష్యా ఏయే దేశాల మీద దాడికి పథకాలు వేస్తున్నదో కూడా వివరాల మాప్ కూడా ఉందని ఆరోపించారు. రష్యాను ఎలా ఎదుర్కోవాలంటూ దశాబ్దాల తరబడి రూపొందించిన వివిధ పథకాలతో తమ సత్తా ఇది అని ప్రపంచాన్ని బెదిరించేందుకే నాటో విన్యాసాలు అన్నది స్పష్టం.ఈ బెదిరింపులకు లొంగేదేశాలేవీ లేదని తెలిసినప్పటికీ భయాన్ని సృష్టించి సొమ్ము చేసుకొనే ఈ దుష్ట క్రీడకు వ్యతిరేకంగా ప్రపంచ శాంతిశక్తులు జనాన్ని సమీకరించి ఒత్తిడి తేవాలి.

నాటి మద్రాస్ నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి సినిమా పరిశ్రమ రావడానికి, వచ్చి ఇక్కడ స్థిరపడడానికి, అప్పటి ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వకుండా ఉండి ఉంటే అది సాధ్యమయ్యేదేనా? ఆంధ్రాప్రాంతానికి మద్రాసు దగ్గరగా ఉండటంవల్ల అప్పట్లో ఆంధ్ర ప్రాంతం వారు సినిమా పరిశ్రమలో అవకాశాలను దక్కించుకోగలిగారు. కాబట్టి ఆ ప్రాంతానికి చెందిన రచయితలు, దర్శకులు అక్కడి సంస్కృతినే వెండితెరపై ఆవిష్కరించగలిగారు. ఆ సంస్కృతిలో ఇమిడే పాత్రలకు ఆ ప్రాంతానికి చెందిన నటీనటులకే ఎక్కువ అవకాశాలిచ్చారు, కాబట్టి సినిమా పరిశ్రమలో ఆంధ్రా ప్రాంతంవారు ఎక్కువ శాతం స్థిరపడిపోయారు. అక్కడి వ్యాపారవేత్తలు నిర్మాణ రంగంలో, పంపిణీ రంగంలో దూసుకుపోయారు. తెలుగు సినిమా పరిశ్రమలో కొంతమంది స్థిరపడ్డ తర్వాత, ప్రభుత్వం ఇచ్చే రాయితీలను, ప్రోత్సాహకాలను, పన్ను మినహాయింపులను తొలగించేశారు. అందువల్ల, ఇక్కడ స్థిరపడ్డ వారు అంచెలంచెలుగా ఎదిగిపోయారు, అందులో కొంతమంది నిర్మాణ రంగాన్ని, పంపిణీ రంగాన్ని, థియేటర్లన్నీ తమ గుప్పిట్లో పెట్టుకుని మొత్తం సినిమా వ్యాపారాన్ని శాసించే స్థాయికి ఎదిగిపోయారు. అప్పటి ప్రోత్సాహకాలు, రాయితీలు అలాగే కొనసాగి ఉంటే, కొత్తవారికి పరిశ్రమలో రావడానికి, వ్యాపారాన్ని పెంచుకోవడానికి అవకాశం ఉండేది. ఇప్పుడు ఎవరైనా సాహసం చేసి సినిమాలు తీసినా, థియేటర్స్‌లో చోటుదక్కక మళ్లీ గుత్తాధిపతులపై ఆధారపడవలసిన పరిస్థితి నెలకొన్నది. ఆ సినిమాకు గుత్తాధిపతి సహకరిస్తే గాని అది విడుదలకు నోచుకోవడం లేదు. గతంలో ఒక సినిమా తీస్తే డిస్ట్రిబ్యూటర్లు అడ్వాన్సులు తీసుకొని వచ్చి నిర్మాణానికి దోహద పడేవారు, థియేటర్ యజమానులు ఎంతోకొంత అడ్వాన్సులిచ్చి సినిమాను తమ థియేటర్లో విడుదల చేయుటకు అగ్రిమెంట్స్ చేసుకునేవారు. అలా మూ డంచెల వ్యవస్థ ఉన్నంతకాలం సినిమా పరిశ్రమలో అందరూ సమతుల్యంగా ఎదిగేవారు. ఎప్పటినుంచైతే ఈ మూడంచెల వ్యవస్థ కనుమరుగైపోయిందో అప్పటి నుండి లోబడ్జెట్ సినిమాలు తీయడం, విడుదల చేయడం కష్టతరం అయిపోయింది. దీంతో ఎంతోమంది సినిమాలు నిర్మించడం మానేశారు.

తెలంగాణ సినిమాను బతికించుకుందాం...



ఇప్పుడు ఎవరైనా కొత్తవారు సినిమాలపై కసి, మోజు ఉన్న వారు మాత్రమే రిస్క్ తీసుకొని సినిమాలు నిర్మిస్తున్నారు. వాటిలో అరకొర సినిమాలు సవ్యంగా విడుదలై విజయవంతం కూడా అవుతున్నాయి. పూర్తి నిర్మాణం, ప్రింటు, పబ్లిసిటీ అన్ని నిర్మాత నెత్తిపైనే ప డుతున్నవి. ఆ సినిమా ఒక గుత్తాధిపతికి నచ్చితే అది విడుదలవుతుంది. ఆ విడుదలైన సినిమా ప్రజలకు నచ్చితే, ఆ నిర్మాత బతికి బయట పడవచ్చు, లేకుంటే పెట్టిన పెట్టుబడి మొత్తం పోవచ్చు. ఇంత రిస్క్ తీసుకొని ఏ వ్యాపార వేత్త కూడా ఈ సినిమా బిజినెస్‌లో ముందుకు రాడానికి సాహసించడు. ఇది ఇప్పుడు కొనసాగుతున్న సినిమా పరిశ్రమ పరిస్థితి. ఈ పరిస్థితి మారాలంటే మొట్టమొదలు టికెట్ రేట్లు నియంత్రించాలి, క్యూబ్, యు ఎఫ్ ఓలకు చెల్లించే డిజిటల్ చార్జెస్ తగ్గించి ఒక్కొక్క షో చొప్పున నిర్ణయించాలి. టికెట్ రేట్లు పెరగడం వల్ల జనాలు థియేటర్లకు రాడానికి భయపడుతున్నారు ఓటీటీలో వచ్చినప్పుడు చూద్దామని నిర్ణయించుకుంటున్నారు. సినిమా నిర్మాణ వ్యయం అతిగా పెరిగిపోయిందనే కారణంతో టికెట్ రేట్లు విపరీతంగా పెంచేస్తున్నారు ఈ విధంగా సినిమా పరిశ్రమ తన గొయ్యి తానే తవ్వుకుంటున్నది. టికెట్ రేట్లు నియంత్రిస్తే ప్రజలు థియేటర్లో ఆస్వాదించుటకు మొగ్గు చూపుతారు, లేకుంటే నెమ్మదిగా ప్రజలు థియేటర్‌కి వచ్చే అలవాటును మానుకుంటారు. డిజిటల్ చార్జెస్ షో చొప్పున తీసుకుంటే సినిమా విడుదల సమయంలో నిర్మాతకు వెసులుబాటుగా ఉంటుంది. మొట్టమొదలే వారం చొప్పున చెల్లించుకుని సినిమా ఆడినా, ఆడకున్న ఆ డబ్బులు తిరిగివ్వకుండా ఉండే సంస్కృతి ఒక రకమైన దోపిడీయే కదా! ఈ నియంత్రణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ తరపున తప్పనిసరిగా జరగాలి లేదా ఈ డిజిటల్ స్క్రీనింగ్ ప్రక్రియ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ మొదలుపెట్టి, తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడుతూ, ఆ వచ్చే ఆదాయాన్ని సినిమా పరిశ్రమ అభివృద్ధికి ఉపయోగించుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఇప్పుడు స్థిరపడ్డ పరిశ్రమలో సమస్యల పరిష్కారానికి వేగవంతంగా ప్రభుత్వం చొరవ తీసుకొని, చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది.

ఇప్పుడున్న పరిశ్రమకు సమాంతరంగా ఒక ప్రత్యామ్నాయ తెలంగాణ సినిమా పరిశ్రమ స్థాపన అవసరం. దానికోసం ఒక ప్రత్యేక తెలంగాణ సినిమా పాలసీ ప్రభుత్వం ప్రవేశపెట్టాలి. తెలంగాణ సాధనకు అన్ని రంగాలవారు కలిసి కట్టుగా పోరాటం చేశారు. ఏ మాటకామాట చెప్పాలంటే వట్టి రాజకీయ రంగానికే తెలంగాణ తెచ్చుకున్నట్టు కనపడింది. గత పదేళ్లలో అన్ని రంగాలలో కల్లా తెలంగాణ సినీ రంగంపై ఒక్క ఇంచు కూడా గత ప్రభుత్వం కదలలేదు. ప్రతిపాదించిన కొన్ని డిమాండ్లను గత టీఆర్ఎస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టినప్పటికీ, ఈరోజు వరకు ఒక్క డిమాండ్ కూడా అమలు కాలేదు. పదేళ్లు వట్టి ప్రకటనలతోనే కాలయాపన చేశారు, ఒక్క అభివృద్ధి కూడా సినిమా పరిశ్రమలో జరగలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నది. మాలాంటివారు తెలంగాణ ఉద్యమం కోసం సినిమాలు తీశాము. ప్రతి పిలుపునకు కదిలి ఉద్యమంలో పాలు పంచుకున్నాము. విలువైన సమయాన్ని, డబ్బును వెచ్చించాము.ప్రత్యేక రాష్ట్రమొస్తేనైనా సినిమా పరిశ్రమ మెరుగుపడుతుందని ఆశించాము. ఏదీ జరగలేదు కాబట్టి, ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వానికి పౌర సమాజంతో పాటు మా మద్దతు కూడా తెలిపి అధికారంలోకి వచ్చేలా కృషి చేశాము. ఈ కొత్త ప్రభుత్వం తక్షణమే కాలయాపన చేయకుండా తమను పిలిపించి, ఒక కమిటీ ఏర్పాటు చేసి ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మా సూచనలను తీసుకొని, పెండింగ్‌లో ఉన్న తెలంగాణ సినిమా పరిశ్రమ స్థాపనకు పునాది వేస్తారని ఆశిస్తున్నాము.

ఇప్పటికే తెలుగు సినిమా పరిశ్రమ ఉన్నది కదా ఇంకొక పరిశ్రమ ఏమిటి? ఇంకా అభివృద్ధి ఏమిటనే ప్రశ్న కొంతమందికి ఉత్పన్నం అవ్వచ్చు. ఇప్పుడు స్థిరపడ్డ సినిమా పరిశ్రమ అప్పుడు స్థిరపడ్డవారితో, వారి ఆధిపత్యంలో కొనసాగుతున్నది, తెలంగాణ భూమి పుత్రులు, తెలంగాణ కళాకారులు, తెలంగాణ సాంకేతిక నిపుణులు, తెలంగాణ నిర్మాతలు తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలపై, తెలంగాణ చరిత్రపై, తెలంగాణ జీవితాలను ఆవిష్కరిస్తూ తీసే సినిమాలకు మునుపటిలాగా మళ్లీ రాయితీలు, ప్రోత్సాహకాలు, పన్ను మినహాయింపులు ఇచ్చి ప్రోత్సహించడం అవసరం. అలాంటి సినిమాలకు థియేటర్లలో రెండు షోలు కేటాయించాలి. పన్ను మినహాయింపులివ్వాలి. అవార్డులూ ప్రకటించాలి. అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్‌కి పంపించాలి. అప్పుడుగాని తెలంగాణలో ఉన్న కళాసంపదకు ప్రయోజనం చేకూరుతుంది. స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ద్వారా కళాకారులకు సాంకేతిక నిపుణులకు ట్రైనింగ్ సౌకర్యం కల్పించాలి. పూనే ఫిలిమ్ ఇనిస్టిట్యూట్ మాదిరిగా ఒక ఇనిస్టిట్యూట్ స్థాపించాలి. మంచి కథ తయారు చేసుకుని ఉన్న యువతకు కెమెరా, ఎడిటింగ్ సౌకర్యాలు ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ సమకూర్చి ప్రోత్సహించాలి. తెలంగాణ వారు స్టూడియోలు నిర్మించుకోవడానికి గతంలో లాగా స్థలాలు కేటాయించాలి. సినిమా నిర్మాణానికి కొంతవరకు రుణసౌకర్యం కల్పించాలి. అప్పుడే తెలంగాణ వారు సినిమా రంగం వైపు మొగ్గు చూపించి సినిమాలు నిర్మించి, సినిమా పరిశ్రమలో అభివృద్ధి చెందగలుగుతారు. భూమి పుత్రులకు పుష్కలంగా అవకాశాలు దక్కుతాయి. తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలు వెండితెరపై ఆవిష్కరించడానికి అవకాశం దొరుకుతుంది. ఈ ప్రత్యామ్నాయ, సమాంతర తెలంగాణ సినిమా పరిశ్రమ స్థాపనతో ప్రభుత్వానికి కూడా ఆదాయం వస్తుంది. ప్రపంచ వ్యాప్తిగా ఖ్యాతి దక్కుతుంది.



- సయ్యద్ రఫీ, 9966025325

హత్రాస్: మనువాద అన్యాయానికి ప్రతీక

"మేమే, నేరస్తులం. మా చెల్లిపై సామూహిక అత్యాచారానికి పాల్పడి, హత్య చేసినవారు స్వేచ్ఛగా ఉన్నారు. ఊళ్లో వారు విజేతల్లాగా తిరుగుతున్నారు. కానీ మేము మా ఇంటి బయటికి అడుగు వెయ్యలేకపోతున్నాం" అని హత్రాస్ బాధితురాలి 33 ఏళ్ల సోదరుడైన సతీందర్ కుమార్, జనవరి 17న వారి గ్రామం బుల్‌గర్హీకి వెళ్లిన నాతో, సుభాషిణి అలీతో అన్నాడు. వారి సంక్షేమం గురించి తెలుసుకుందామని అక్కడికి వెళ్ళాం. సిగ్గుమాలినతనంతో న్యాయం అణచివేతను, కులనియమావళి అమలును అక్కడ గమనించాం. నేటి ఉత్తరప్రదేశ్‌లో ఒక దళితుడికి న్యాయం జరగాలని పోరాడటం చాలా కష్టమనే నిజం మాకు అర్థమైంది. కుటుంబ కష్టాల్ని తెలుసుకునే క్రమంలో, మనువాద కుల నియమావళి అమల్లో నాలుగు దశలున్నాయని తెలిసింది.



బృందా కారత్

మొదటిదశ - నేరం : మొదటిది, సెప్టెంబర్ 2020లో జరిగిన నేరం-ఒక పేద దళిత కుటుంబానికి చెందిన 19 ఏళ్ల అమ్మాయిపై అగ్రవర్ణానికి చెందిన నలుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారం చేసి, హత్య చేశారు. కుల, వర్గ, పితృస్వామిక దోపిడీలు, అణచివేత కలిసిన అసాధారణ "మేడ్ ఇన్ ఇండియా" కేంద్రంగా ఆమె ఉనికి ఉంది. బాల్మీకి, దళిత, పేద, మహిళ. పందొమిదేళ్ల వయసు. ఇదొక కుల నేరం. మహిళకు వ్యతిరేకంగా జరిగిన నేరం. పేద మహిళకు వ్యతిరేకంగా బలమైన గ్రామీణ ఉన్నత శ్రేణులు జరిపిన వర్గ నేరం. ఇది, ఒక యోగ్యత ఆధారంగా జరిగిన నేరం అందుకే దీనిని నేరంగా పరిగణించరు.

రెండవ దశ - ప్రభుత్వ పక్షపాతం : రెండో దశలో పాలనా విభాగం, యూపీ ప్రభుత్వం ద్వారా నేరాన్ని కులంతో కప్పివేశారు. సెప్టెంబర్ 2020లో నేరం జరిగింది. పాలనా విభాగం, ప్రభుత్వం, విచారణను బలహీనపర్చడానికి సాధ్యమైనంత కృషిచేశాయి. మొదటి నుండి కూడా అత్యాచారం అసలు జరుగలేదనీ, ఏది జరిగినా అంగీకారంతోనే జరిగిందనే అబద్ధాన్ని బయట పెట్టారు. ఐదు రోజులపాటు అసలు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. వైద్య పరీక్షల్ని ఆలస్యంగా చేసి, ముఖ్యమైన రుజువును లేకుండా చేశారు. అత్యవసరంగా అందించాల్సిన వైద్యాన్ని అందించక పోవడంతో ఆ అమ్మాయి ఆరోగ్యం మరింత క్షీణించింది. ఆలస్యం అయిన తర్వాత ఢిల్లీ ఆసుపత్రికి తరలించారు. ఆమె మరణం తరువాత పోలీసులే మృతదేహాన్ని బలవంతంగా తీసుకెళ్ళి, కుటుంబసభ్యుల అనుమతి లేకుండానే రాత్రికి రాత్రే అంత్యక్రియలు నిర్వహించారు. అంత్య క్రియలు నిర్వహించడం ద్వారా రెండో పోస్ట్‌మార్టం చెయ్యాలనే డిమాండ్ లేకుండా పోలీసులు అడ్డుకున్నారు. దేశవ్యాప్తంగా నిరసనలు, ఆగ్రహజ్వాలలతో కేసును సీబీఐ అప్పగించారు.

మూడవ దశ - న్యాయ పోరాటం : న్యాయ ప్రక్రియలో, ప్రభుత్వ పక్షపాత ధోరణి కొనసాగింపులో మనువాద కుల నియమావళి మూడవదశగా ఉంటూ వచ్చింది. ఆ యువతిపై జరిగిన అమానుషమైన నేరానికి సీబీఐ చార్జిషీట్‌లో ఉన్నాయి. గ్యాంగ్ రేప్, హత్య కుట్ర సంబంధిత నిబంధనల కింద అభియోగాలు మోపారు. బాధితురాలి మరణ వాంగ్మూలంపైన చార్జిషీట్ ఆధారపడింది, ఈ విషయాన్ని తీవ్రంగా బాధపడుతున్న అమ్మాయిని మొదట గమనించిన తల్లి కూడా తెలిపింది. అట్రాసిటీల నిరోధక చట్టం కింద ఎస్సీ, ఎస్టీలకు వ్యతిరేకంగా జరిగిన కేసుల్ని విచారించేందుకు నియమించబడిన ప్రత్యేకకోర్టు ఈ కేసును విచారించింది. ఎలాంటి కారణా ల్లేకుండా కోర్టు, బాధితురాలి మరణ వాంగ్మూలాన్ని కొట్టివేసి, తల్లి చెప్పిన విషయాల్ని పక్కన పెట్టింది. ఆ అమ్మాయి పేర్కొన్న నలుగురిలో ముగ్గుర్ని నిర్దోషులుగా విడుదల చేసి, సెక్షన్ 304 కింద తక్కువ నేరం చేశాడని నాలుగో వ్యక్తికి శిక్ష వేశారు. ఇది నేరపూరిత నరహత్య.

> యూపీలో ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ కులానికి చెందిన సోదర సభ్యులు, శిక్ష మినహాయింపు ప్రత్యేకతల్ని అనుభవిస్తున్నారు. కుల సమీకరణలు తారుమారై, ఒకవేళ బాధితురాలు అగ్రవర్ణానికి చెందిన వ్యక్తి అయి, నేరం చేసిన వారు దళితులు లేదా ఇతర మైనార్టీలై ఉంటే, ఒకవేళ ఆ అమ్మాయి హత్రాస్ బాధితురాలి వలెనే ఒక మరణ వాంగ్మూలం ఇచ్చి ఉండి ఉంటే, ఎలాంటి వాదనల్లేకుండా అది అంగీకరించబడి ఉండేది, నేరస్తులకు జీవిత ఖైదీ విధించి ఉండేవారు. మరణ వాంగ్మూలానికి కోర్టు ఎప్పటికీ ప్రాధాన్యత ఇస్తుంది. కానీ హత్రాస్‌లో బాధితురాలు బాల్మీకి కులానికి చెందింది. రాజీ చేసి, తీర్పును అంగీకరించడానికి ఆ కుటుంబంపై ఒత్తిడి తెచ్చారు.

యూపీలో ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ కులానికి చెందిన సోదర సభ్యులు, శిక్ష మినహాయింపు ప్రత్యేకతల్ని అనుభవిస్తున్నారు. కుల సమీకరణలు తారుమారై, ఒకవేళ బాధితురాలు అగ్రవర్ణానికి చెందిన వ్యక్తి అయి, నేరం చేసిన వారు దళితులు లేదా ఇతర మైనార్టీలై ఉంటే, ఒకవేళ ఆ అమ్మాయి హత్రాస్ బాధితురాలి వలెనే ఒక మరణ వాంగ్మూలం ఇచ్చి ఉండి ఉంటే, ఎలాంటి వాదనల్లేకుండా అది అంగీకరించబడి ఉండేది, నేరస్తులకు జీవిత ఖైదు విధించి ఉండేవారు. మరణ వాంగ్మూలానికి కోర్టు ఎప్పటికీ ప్రాధాన్యత ఇస్తుంది. కానీ హత్రాస్‌లో బాధితురాలు బాల్మీకి కులానికి చెందింది. రాజీ చేసి, తీర్పును అంగీకరించడానికి ఆ కుటుంబంపై ఒత్తిడి తెచ్చారు. ఇలాంటి అన్యా యమైన తీర్పుపై ప్రభుత్వం అప్పీలు చేస్తుంది అనుకున్న వారి ఆశలు అడియాశలు అయ్యాయి. యూపీ ప్రభుత్వం అప్పీల్ చేయడానికి నిరాకరిం చింది. ఇలాంటి పూర్వ నమూనాలు ఏమైనా ఉన్నా యా? గ్యాంగ్ రేప్, కుట్ర, హత్య లాంటి సీబీఐ నమోదు చేసిన భయంకరమైన అభియోగా లుండి, కింది కోర్టు తిరస్కరించిన చార్జిషీట్‌ను తమ సొంత కేసును సమర్థించుకోడానికి అప్పీల్ చేయడానికి సీబీఐ నిరాకరిస్తుందా? సీబీఐ, కేంద్ర హోంశాఖ ఆధీనంలో పనిచేస్తుంది. అప్పీలు చేయ కూడదనే నిర్ణయం వెనుక హోంశాఖ, దాని బలమైన మంత్రి అమిత్ షా అంగీకారం ఉంటుంది. అప్పీల్ చేయ దానికి ప్రభుత్వం, సీబీఐ నిరాకరించడంతో, దాన్ని సవాల్ చేస్తూ బాధిత కుటుంబం అలహాబాద్ హైకోర్టులో అప్పీలు చేసింది. ఆ కేసు ఇప్పుడు పెండింగ్‌లో ఉంది.

రెండో కేసు లక్నో బెంచ్‌కి సంబంధించింది. సెప్టెంబర్ 2020లో ఘోరమైన నేరం జరిగిన తర్వాత లక్నో బెంచ్ ఈ కేసును సుమోటోగా స్వీకరించింది. అక్టోబర్ 2020లో బాధిత కుటుంబాన్ని కోర్టుకు పిలిపించింది. ప్రభుత్వం కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి, ఆ కుటుంబానికి భద్రత కల్పించి, సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిందితుల్ని నిర్దోషులుగా విడుదల చేస్తూ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అప్పీలు చేయడానికి నిరాకరించి, లక్నో కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఒకరికి ఉద్యోగం ఇవ్వడానికి, కుటుంబానికి ప్రత్యామ్నాయంగా గృహ వసతి ఏర్పాటుకు వ్యతిరేకంగా యూపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేస్తుంది. బాధిత కుటుంబం ఆ కేసును సుప్రీంకోర్టులో ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాల్సి వచ్చింది. ఏప్రిల్ 2023లో ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ముగ్గురు సభ్యులతో కూడిన ధర్మాసనం, లక్నో కోర్టు తీర్పుపై స్టే కోరుతూ దాఖలైన ప్రభుత్వ అప్పీల్‌ను తిరస్కరించింది. అయితే ప్రభుత్వం ఆ తీర్పును అమలు చేయకుండా నిరాకరించింది. సుప్రీంకోర్టులో తదుపరి విచారణ జనవరి 2024 తరువాత జరుగుతుంది. ఈ రెండు కేసుల్లో కూడా భారం, ఆందోళన, న్యాయ ప్రక్రియకు అయ్యే ఖర్చును ఆ కుటుంబమే భరిస్తుంది. రెండు కేసుల్లోనూ వారు ప్రభుత్వంతోనే పోరాడాల్సి వస్తుంది.

నాల్గవ దశ - బతుకు పోరాటం : కొనసాగుతున్న నాల్గవ దశలో, గ్రామ స్థాయి నుంచి ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి వరకూ ఉన్న అధికార శక్తులతో రోజువారీ బతుకు పోరాటం జరుగుతోంది. గతేడాది నిందితులు విడుదల అయినప్పుడు జరిగిన దృశ్యాల గురించి సోదరులు సతీందర్, సందీప్‌లు మాతో చెప్పారు. బిల్కిస్ బానో కేసులో రేపిస్టులు, హంతకులు విడుదలైనప్పుడు వీహెచ్‌పీ ఉత్సవాల నిర్వహణను ఇది, మనకు గుర్తుకుతెస్తుంది. మార్చి 3, 2023న తీర్పు వెలువడిన వెంటనే వారిని విడుదల చేశారు. హోళీ పండుగకు కొద్ది రోజుల ముందు ఇది జరిగింది. కానీ హోలీ పండుగను జరుపుకున్న విధంగా ఉత్సవంగానే ఇది జరిగింది. వారిని మేళతాళాలతో, పూలవర్షం కురిపిస్తూ, వారి సంఘ సభ్యులు పూలదండలు వేసి ప్రదర్శనగా స్వాగతం పలికారని వారన్నారు. బుల్‌గర్హి గ్రామంలో కేవలం ఆరు దళిత కుటుంబాలే ఉన్నాయి. ఆ గ్రామంలో మెజారిటీ కుటుంబాలు ఠాకూర్లు. నిందితులంతా ఈ కులానికి చెందినవారే. బ్రాహ్మణ కుటుంబాల సంఖ్య చాలా ఎక్కువ. తమను భయపెట్టి, ఒంటరిని చేస్తున్నారని బాధితులు తెలిపారు.

మొదట్లో ఆ కుటుంబానికి నష్టపరిహారంగా ప్రభుత్వం 25 లక్షల రూపాయలిచ్చింది. కుటుంబానికి 24 గంటలు భద్రత ఏర్పాటు చేయాలన్న కోర్టు ఆజ్ఞల్ని అమలు చేసింది. మేము ఆ కుటుంబం వద్దకు వెళ్ళేసరికి, వారుంటున్న ఇంటి ఆవరణలోని ఒక భాగంలో కేంద్ర బలగాల క్యాంపు కనిపించింది. కుటుంబ రక్షణ కోసం ఒక కంపెనీని కేటాయించారనీ, వారి భద్రత కోసం 15 మంది సిబ్బందిని కేటాయించారని చెప్పారు. వారక్కడ లేకుంటే, కుటుంబాన్ని చంపి ఉండెడివారని ఒక కానిస్టేబుల్ మాతో అన్నాడు. ఈ కుటుంబం కోర్టులో పోరాటం చేస్తుందని, వీరిపై గ్రామంలో చాలా కోపం ఉందని వారన్నారు.



అయితే భద్రత కూడా రెండువైపులా పదునైన కత్తి అని రుజువైంది. ఇద్దరు సోదరులూ వారి ఉద్యోగాలు కోల్పోయారు. సతీందర్ నోయిడాలోని ఒక మాన్యుఫాక్చరింగ్ ఫ్యాక్టరీలో, అతని తమ్ముడు సందీప్ ఘజియాబాద్‌లోని ఒక మొబైల్ కంపెనీలో పనిచేసేవారు. వారి తల్లిదండ్రుల సంరక్షణ కోసం గ్రామంలోని ఇంటికి రావాల్సి వచ్చేది. భద్రతా సిబ్బంది లేకుండా ఇప్పుడు వారు ఇల్లు విడిచి బయటికి వెళ్లలేరు. వారి వెంట సాయుధ పోలీసులుంటారు. కాబట్టి వారికెవరూ ఉద్యోగాలివ్వడానికి ఇష్టపడటం లేదు. కొన్ని దశాబ్దాల క్రితం దళితుల భూపంపిణీ కార్యక్రమంలో వారికి ఐదు భిగాల భూమినిచ్చారు. రెండు భిగాల భూమిని అగ్ర వర్ణాలవారు చట్టవ్యతిరేకంగా ఆక్రమించుకున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో కూడా పోలీసులు వెంట ఉంటున్నారనీ, ఆఖరికి కూరగాయలు కొనేందుకు కూడా వారు ఇంటి నుండి బయటకి అడుగుపెట్టలేకపోతున్నామనీ, మార్కెట్‌కు వెళ్ళేటప్పుడు ముందు ఇద్దరు, వెనుక ఇద్దరు పోలీసులు ఉండడం వల్ల అందరి దృష్టి మాపైనే పడిన ఫలితంగా మమ్ముల్ని "హత్రాస్ కేసు" కుటుంబంగా గుర్తిస్తున్నారు. ఆ కుటుంబంలో శాంతీదేవి అనే 80 ఏళ్ల నాయనమ్మ బాధితురాలి తల్లిదండ్రులు ఓం ప్రకాష్, రమాదేవిలు ఉంటారు. ఓం ప్రకాష్ దశాబ్దాలుగా అసన్సోల్‌లో కార్మికునిగా పనిచేస్తూ ఉన్నాడు, అతనికి ఎర్రజెండాతో అనుబంధం ఉంది. జ్యోతీబసు నాయకత్వంలోని బెంగాల్‌లో ఇలాంటి అన్యాయం ఎప్పుడూ జరగలేదని ఆయన అన్నాడు. ఇంకా సతీందర్ భార్య సంధ్య, వారి ముగ్గురు పిల్లలు, 23 ఏళ్ల వారి తమ్ముడు సందీప్ ఉన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా వారి పిల్లలు స్కూల్‌కు వెళ్ళడం లేదు. పెద్ద పాపను సంధ్య తల్లిదండ్రుల వద్దకు పంపించారు. మిగిలిన ఇద్దరు పిల్లలకు చదువుకునే హక్కును ఈ పరిస్థితులు ఆటంక పరిచాయి. కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉంది. ఈ మూడేళ్ల కాలంలో నష్టపరిహారంగా ఇచ్చిన డబ్బును కేసు కోసం ఖర్చు చేస్తున్నారు. వీరిపట్ల సానుభూతితో ఉన్న న్యాయవాదులు ఫీజు తీసుకోకపోయినప్పటికీ కోర్టుకు వెళ్లిన ప్రతిసారీ వేల రూపాయలు ఖర్చవుతాయి. వారు కుటుంబ సభ్యుల కోసమే కాక భద్రతా సిబ్బందికి కూడా వాహనాన్ని అద్దెకు తీసుకోవాలి. కొన్ని సందర్భాల్లో, ముఖ్యంగా తొలి రోజుల్లో వారు వివిధ కోర్టులకు వెళ్ళాల్సి వచ్చేది. లక్నో, అలహాబాద్‌లకు నెలలో చాలాసార్లు వెళ్ళాల్సి వచ్చింది. ప్రతి సందర్భంలో కుటుంబం సామాజిక కార్యక్రమాలకు వెళ్ళాలి, అప్పుడు కూడా ఇలాంటి ఖర్చులే. ప్రయాణపు ఏర్పాట్లన్నింటినీ కుటుంబమే చూసుకోవాలి. ఫలితంగా అసలు కుటుంబం బయటకు వెళ్లడమే మానేసింది. గతేడాది సంధ్య తీవ్ర అనారోగ్యం పాలైంది. ఆమెను ఆగ్రాలోని ఆసుపత్రిలో చేర్చాల్సి వచ్చింది. ఆమె వైద్య ఖర్చులే కాక, భద్రతా సిబ్బందికి ఖర్చుతో కూడిన ప్రత్యేక గదిని కూడా కుటుంబం ఏర్పాటు చేయాల్సి వచ్చింది. మాతో మాట్లాడుతున్నప్పుడు రమాదేవి చాలాసార్లు విరుచుకొని పడిపోయింది. తనకు తన కూతురి శరీర క్రూరమైన చిత్రాలు కనిపిస్తున్నాయనీ, ఈ హింసకు పాల్పడిన వారిని విడుదల చేస్తూ, మాకు చేసిన అన్యాయాన్ని అంగీకరిం చడం కష్టంగా ఉందని చెప్పింది. ఇది కేవలం తన కూతు ర్ని మాత్రమే కాక, మొత్తం కుటుంబాన్ని కూడా నాశనం చేసిందని విలపిస్తూ చెప్పింది. తన కొడుకుల వైపు చూపి స్తూ, వారేమి నేరం చేశారని, సాధారణ జీవితాలకు దూర మయ్యారు, వారికి ఏ ఉద్యోగం లేకుండా మేమెలా బత కాలని ఆమె అంటుంది. నష్టపరిహారంగా ఇచ్చిన డబ్బు దాదాపు అయిపోయిందని సతీందర్ అన్నాడు. కొంత డ బ్బును కేసు ఖర్చుల కోసం పక్కకు పెట్టి, ఇతర ఖర్చుల్ని తగ్గించుకోడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నాడు. మా తిండికి, కనీస ఖర్చులకు నెలకు కనీసం 15వేల రూపా యలు అవసరమని, అయితే ఆదాయం లేకుండా పరిస్థితి దారుణంగా ఉంటుందని అతడు అన్నాడు. తాను ధరిం చిన దుస్తులను చూపిస్తూ, ఇవి తమ బంధువులు ఇచ్చా రని, మా కష్టాల గురించి మాట్లాడటం మాకు సిగ్గని పిస్తుందని అన్నాడు.

> భద్రతా సిబ్బంది లేకుండా ఇప్పుడు వారు ఇల్లు విడిచి బయటికి వెళ్లలేరు. వారి వెంట సాయుధ పోలీసులుంటారు. కాబట్టి వారికెవరూ ఉద్యోగాలివ్వడానికి ఇష్టపడటం లేదు. కొన్ని దశాబ్దాల క్రితం దళితుల భూపంపిణీ కార్యక్రమంలో వారికి ఐదు భిగాల భూమినిచ్చారు. రెండు భిగాల భూమిని అగ్ర వర్ణాలవారు చట్టవ్యతిరేకంగా ఆక్రమించుకున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో కూడా పోలీసులు వెంట ఉంటున్నారనీ, ఆఖరికి కూరగాయలు కొనేందుకు కూడా వారు ఇంటి నుండి బయటకి అడుగుపెట్టలేకపోతున్నామనీ, మార్కెట్‌కు వెళ్ళేటప్పుడు ముందు ఇద్దరు, వెనుక ఇద్దరు పోలీసులు ఉండడం వల్ల అందరి దృష్టి మాపైనే పడిన ఫలితంగా మమ్ముల్ని "హత్రాస్ కేసు" కుటుంబంగా గుర్తిస్తున్నారు.

ఇక్కడి లోక్‌సభ స్థానం ఎస్సీలకు రిజర్వ్ చేయబడింది. ప్రస్తుత ఎంపీ, బీజేపీకి చెందిన రజ్వీర్ దిలర్. ఆయన ఒక్కసారి కూడా బాధిత కుటుంబాన్ని సందర్శించలేదు. వారి బాధల గురించి అడిగితే, ప్రభుత్వం రూ.25 లక్షలు ఇచ్చింది, ఇంకా ప్రభుత్వం ఏమి ఇస్తుందని అన్నాడు. తమ ఇళ్ళల్లో టీ తాగడానికి ఉపయోగించే గ్లాసుల్లో దళితులకు టీ ఇవ్వని అగ్రవర్ణాల వారి ఇండ్లకు ఆ ఎంపీ వెళితే, తన తోపాటు స్వంత టీ గ్లాసు తీసుకొని, ఆ గ్లాసులోనే టీ తాగుతాడనే కథనాన్ని మాకు చెప్పారు. ఆ విధంగా తన నియోజకవర్గంలోని అగ్రవర్ణాల వారిని అవమానానికి గురికాకుండా చూస్తాడు. ఇవి, ఒక బీజేపీకి చెందిన ఎస్సీ ఎంపీ అవమానకరంగా అంటిపెట్టుకుంటున్న కుల నియమావళి. ఇవే నియమాల్ని దళితులు అంతా అనుసరించాలని కోరుకుంటున్నారు.

ఈ దారుణమైన పరిస్థితి ఒక దళిత కుటుంబానికి పడిన శిక్ష. వారి చెల్లెలిపై అత్యాచారం చేసి, హత్య చేసిన వారితో రాజీకి నిరాకరించిన కారణంగానే వారికి ఈ శిక్ష పడింది. దళితులు, మహిళలకు వ్యతిరేకంగా బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వ క్రూరత్వానికి, మనువాద అన్యాయానికి హత్రాస్ ఒక ప్రతీక.

("పీపుల్స్ డెమోక్రసీ" సౌజన్యంతో)

అనువాదం : బోడపట్ల రవీందర్, 9848412451

తెలంగాణకు మళ్లీ నిరాశే?

సామాజిక న్యాయం, సమానత్వాన్ని ప్రోత్సహిస్తూనే మన దేశం శీఘ్ర, సమతుల్య ఆర్థిక వృద్ధిని సాధించడం కేంద్ర బడ్జెట్ లక్ష్యం. రెండు నెలల్లో లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలు రాబోతున్నాయి. కేంద్రం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ అందరికీ ఆనందాన్ని పంచలేకపోయింది. కొన్ని వర్గాలకు కాస్త ఊరట లభించగా, ఎక్కువ వర్గాలను నిరుత్సాహానికి గురిచేసింది. సమర్థవంతమైన వనరుల కేటాయింపును నిర్ధారించడం, నిరుద్యోగం, పేదరికాన్ని తగ్గించడం, సంపద, ఆదాయ అసమానతలను తగ్గించడం, సబ్సిడీ తగ్గించుకొని కష్టజీవులపై ఎరువుల భారం మోపింది. ధరలను అదుపులో ఉంచడం, పన్ను వ్యవస్థను సంస్కరించడం చేస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకుంటే బడ్జెట్ ఉసూరు మనిపించింది. ప్రధానంగా పేదలకు కూలి పనులు కల్పించే ఉపాధి చట్టానికి ఐదు శాతం నిధులు తగ్గించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యంతర బడ్జెట్ ఆశించినంత ఆకర్షణీయంగా లేనప్పటికీ గతంతో పోలిస్తే మౌలిక సదుపాయాలు, తదితర రంగాలకు కేటాయింపులు పెంచారు, మరికొన్ని రంగాలకు తగ్గించారు.

2023-24లో తెలంగాణకు పన్నుల వాటా కింద 23,400 కోట్లు కేటాయించగా. ఈ మధ్యంతర బడ్జెట్‌లో దీనికి మరో రూ.2,239 కోట్లు చేర్చారు. దీంతో బడ్జెట్ రూ. 25,639 కోట్లకు చేరింది. ఎన్నికల సంవత్సరం కావడంతో బడ్జెట్ మొత్తం రూ. 47,65,768 కోట్లతో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో ప్రత్యేకంగా తెలంగాణకు రూ. 25,639 కోట్లు కేటాయించారు. కొత్త పథకాలేవి లేవు. తెలంగాణకు కేటాయించిన బడ్జెట్ కూడా కేంద్ర పన్నుల వాటా కింద మాత్రమే ప్రకటించారు. ఇక రాష్ట్రానికి కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రూ.19,760.59 కోట్లు వస్తాయి. ఇక మరో రూ.3200 కోట్లు 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు స్థానిక సంస్థల మంజూరు కింద రానున్నాయి. ఈ మూడు మాత్రమే పెద్దపద్దులు. తప్ప రాష్ట్రానికి చెప్పుకోదగిన కేటాయింపులు పెద్దగా లేవు. ఈ బడ్జెట్‌లో తెలంగాణ కేంద్రం నుంచి ఎక్కువగానే ఆశించింది. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, పాలమూరు రంగారెడ్డి - ప్రాజెక్టుకు జాతీయ హోదా, బయ్యారం స్టీల్‌ప్లాంట్‌కు ఆమోదం, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి కింద మూడేళ్లకు రూ. 1800 కోట్లు విడుదల చేయాలని కోరింది. దీంతో పాటు హైదరాబాద్- నాగపూర్ పారిశ్రామిక కారిడార్‌కు అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఒక వేళ దీనికి కనుక అనుమతులు ఇస్తే రాష్ట్రానికి రూ.2,300 కోట్లు విడుదలవుతాయని అంచనా వేశారు. దీంతోపాటు అదనంగా రూ.90 కోట్లు సైబర్ సెక్యూరిటీకి, మరో రూ. 88 కోట్లు యాంటీనార్కోటిక్ బ్యూరో పటిష్టతకు ఇవ్వాలని కోరారు. దీంతో పాటు మూసి రివర్ ఫ్రంట్ అభివృద్ధికి నిధులు మెట్రో రైలు రెండో దశకు నిధులు ఆశించారు. కానీ మధ్యంతర బడ్జెట్‌లో వీటి మీద ఎలాంటి ప్రస్తావన లేదు. కేంద్రం ఎలాంటి హామీ లివ్వలేదు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో రెండు తెలుగు రాష్ట్రాలకు అత్యధికంగా రూ.14 వేల 209 కోట్లు కేటాయించినట్లు. రైల్వే బడ్జెట్ విషయానికి వచ్చే సరికి తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాలు భద్రతా ప్రాజెక్టులకు రూ.5071 కోట్లు ఈసారి కేటాయించినట్లుగా కేంద్ర రైల్వే మంత్రి తెలిపారు.



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైల్వే శాఖకు కేటాయింపుల్లో తెలంగాణకు ఊరట కలిగించే అంశాల్లేవు. నూతన రైల్వేలైన్లు, రైల్వే టెర్మినల్, డబ్లింగ్, భారీ ప్రాజెక్టు లేవీ అందించబడలేదు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్నవి, పాత ప్రాజెక్టులకే నిధులు కేటాయించారు. గతేడాది రాష్ట్రానికి ఇచ్చిన రూ.4,418 కోట్లతో ఈసారి దాదాపు 12.8 శాతం పెంచి రూ.5,071 కోట్లు కేటాయించారు. 2021-22 బడ్జెట్లో రూ.2420కోట్లు కేటాయిస్తే ఇప్పుడు రెండు సార్లు పెంచామని గుర్తు చేశారు. ఇప్పుడు 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ 109శాతం పెరిగిందని. అలా రూ.571 కోట్లు అని తెలిపారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి ప్రధాని శంకుస్థాపన చేశారని చెబుతూనే రాష్ట్రంలో రైల్వేలకు పెట్టుబడులు గణనీయంగా పెరిగాయని, తెలంగాణలో వందశాతం విద్యుద్దీకరణ పూర్తయ్యిందన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్రం రెండు రాష్ట్రాలకు చాలా హామీలిచ్చింది. పదేండ్లయినా నేటికీ హామీలు అమలు కాలేదు. ఎన్నికల వేళ అని ఎదురుచూసినా వాటికి మోక్షం లభించలేదు. విభజన ప్రక్రియ అమలు విషయంలో కేంద్రం తాత్సారం చేస్తోంది. ప్రత్యేక నిధులు, రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులకు చోటే లేదు. ఇది రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపనుంది.

- తీగల అశోక్ కుమార్, 7989114086

వంద శాతం ట్యాక్స్ కలెక్షన్ చేయాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



నవతెలంగాణ - భగత్‌నగర్ : జిల్లాలో వాణిజ్య, గృహ, నీటి పన్నుల వసూలు వంద శాతం చేయాలని కరీంనగర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. ఈ మేరకు అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పన్ను వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పన్నులు చెల్లింపు చేయకుండా నిర్లక్ష్యం వహించే వారికి నోటీసులు జారీ చేయాలని చెప్పారు. ఫిబ్రవరి నాటికి 80శాతం, మార్చి చివరి నాటికి 100శాతం పన్నుల వసూళ్లు జరగాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 30సంవత్సరాలు గడిచిన వాణిజ్య దుకాణాలపై యాక్షన్‌కు చర్యలు తీసుకోవాలని తెలిపారు. టాక్స్ కలెక్షన్‌కు వార్డుల వారిగా బృందాలను ఏర్పాటు చేయాలని, సానిటరి ఇన్స్‌పెక్టర్‌లకు ఏరియా వారిగా విధులు కేటాయించాలని ఆదేశించారు. పన్ను వసూలుపై ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహిస్తానని తెలిపారు. సమీక్షలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డిప్యూటిఈ కమిషనర్ స్వరూపరాణి పాల్గొన్నారు.



యాసంగిలో నాట్లు వేసేందుకు ఎక్కువ సమయం లేకపోవడంతో నవంబరు మొదటి వారంలో నార్లు పోసి డిసెంబరులోనే ఎక్కువ మంది రైతులు నాట్లు వేశారు. నారు దశలోనే పురుగు ఆశించగా రైతులు గమనించలేదు. మొన్నటి సంక్రాంతి సమయంలో వీచిన చలిగాలులకు పొలంలోని నీరంతా బంకతోకూడిన నాచుతో పేరుకుపోయింది. ఫలితంగా పురుగు మరింత వృద్ధి దాని ప్రభావం తీవ్రంగా మారింది. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా సగంమేర పొలాల్లో మొగిపురుగు సోకిన పొలాలు దర్శనమిస్తున్నాయి. అప్రమత్తమైన జిల్లావ్యవసాయశాఖ నేరుగా సదరు పొలాలను సందర్శించి ఏయే మందులు చల్లాలో రైతులకు సూచిస్తోంది. ప్రస్తుతం ఆందోళన పడాల్సిన పరిస్థితి లేదని, వారం రోజులుగా మారి వాతావరణం అనుకూలిస్తుందని చెబుతున్నారు.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

వరిలో మొగిపురుగు

- డిసెంబర్‌లో నాట్లు వేసిన పొలాల్లోనే తీవ్రత ఎక్కువ
- సంక్రాంతి చలిగాలులతో విజృంభన
- ఎరుపురంగుగా మారి క్రమంగా వరిగడ్డిగా పొలాలు
- రంగంలోకి దిగిన వ్యవసాయశాఖ
- నేరుగా పొలాలు పరిశీలిస్తూ రైతులకు సూచనలు
- నివారణ చర్యలకు అవసరమైన మందులపై అవగాహన

వర్షాకాలం పంట పెట్టుబడి ఎక్కువ కారణంగా రైతులకు పెద్దగా గిట్టుబాటు కాదు. యాసంగి పంట అన్నదాతలకు కొంత లాభదాయకంగా ఉంటుంది. అయితే, ఈసారి మునుపెన్నడూ లేనివిధంగా నాటు వేసిన 10 రోజులకు పాదులు చనిపోతున్నాయి. ఎరుపు రంగుకు మారి క్రమంగా వరిగడ్డిలా మారి చనిపోతున్నాయి. దీంతో అన్నదాతలు అందోళన చెందుతున్నారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగి సీజన్‌లో 2,48,249 ఎకరాల సాధారణ సాగు విస్తీరానికిగాను 2,31,166 ఎకరాల్లో ఆయా పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా వరి 2,11,450 ఎకరాల్లో సాగవగా పత్తి, పొగాకు, పల్లి, పొద్దుతిరుగుడు, పప్పుదినుసులు మిగతాసాగు విస్తీర్ణంలో వేశారు. నాట్లు పూర్తికాకముందే మొగిపురుగు సోకి మొదట వేసిన నాట్లు చనిపోతున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వందలాది ఎకరాల్లో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో కొంత మంది రైతులు ఆశ చావక మళ్లీ దమ్ము చేసి నారు కొనుక్కుని వచ్చి నాట్లు వేశారు. ఇలాంటి పరిస్థితిలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా వ్యవసాయశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు.

మందులు చల్లినా మెరుగవని పరిస్థితి...

వ్యవసాయశాఖ సూచనల మేరకు రైతులు 3జీ, 4జీ గుళికలను ఎకరానికి రూ.వెయ్యి నుంచి రూ.1200 ఖర్చు చేసి పొలాల్లో చల్లారు. మొగి పురుగు చావకపోవడంతో తిరిగి క్లోరో ఫైరిఫాస్, లమ్డా సైలోత్రిన్ క్రిమిసంహారక మందులను మరో రూ.750 రూపాయలు వెచ్చించి స్ప్రే చేసినా ఫలితం లేకుండా పోతున్నదని చొప్పదండి మండలంలోని కొమురయ్య అనే రైతు 'నవతెలంగాణ'తో వాపోయాడు. జింక్ లోపం కూడా తోడవడంతో మొగి పురుగు ఉధతి చెందుతుందని భావించిన కొందరు రైతులు జింక్ మందులూ స్ప్రే చేశారు. అయితే ఈ మొగి పురుగు కారణంగా ఒక్కో ఎకరానికి రూ.3 వేల నుంచి రూ.3500 వరకు రైతులకు అదనపు పెట్టుబడి భారం పడుతోంది. యాసంగిలో వరి పిలక దశలో మొగి పురుగు(కాండం తొలిచే పురుగు) ఉధతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, అందుకోసం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ సైతం సూచిస్తున్నా.. ఈ సీజన్‌లో పంట నష్టం తప్పదేమోనని కొందరు ఆందోళనకు గురవుతున్నారు.

ఆందోళన వద్దు.. పురుగును అరికట్టే చర్యలు చేపట్టాలి

- ప్రియదర్శిని,
కరీంనగర్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి



యాసంగిలో మొగి పురుగు ఉధతి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నది. దీని ఉధతిని గమనించడానికి పొలాల్లో దీపపు ఎరలను, లింగార్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలి. పిలక దశలో ఎకరాకు మూడు లింగార్షక బుట్టలు పెట్టి, వారానికి ఒక్కో బుట్టలో 25 నుంచి 30 పురుగులు పడితే తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం పిలక దశలో ఉన్న పొలాల్లో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8కిలోలు, లేదంటే క్లోరాంట్రోనిలిప్రోలు 4జీ గుళికలు 4కిలోలు 20కిలోల ఇసుకలో కలిపి బురద పదునులో వేయాలి.

ప్రత్యేక అధికారిగా ఎంపీడీఓ



నవతెలంగాణ - కరీంనగర్ రూరల్ : మండలంలోని నగునూర్ గ్రామపంచాయతీకి ప్రత్యేక అధికారిగా కరీంనగర్ ఎంపీడీఓ దివ్యదర్శన్‌రావు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉప్పుల శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి పొన్నాల మల్లయ్య, ఎంపీటీసీ సాయిల్ల వినయ్ సాగర్, కారోబార్ ఫారూఖ్, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జీపీ బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులు



బాధ్యతలు చేపట్టిన స్పెషల్ ఆఫీసర్ మల్హోత్ర

నవతెలంగాణ - గంగాధర : గంగాధర మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. ఫిబ్రవరి 1 వ తేదీతో సర్పంచుల పదవీ కాలం పూర్తి కావడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియామకం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గ్రామ గ్రామాన జీపీ బాధ్యతలను ప్రత్యేక అధికారులు చేపట్టారు.

జీపీ ప్రత్యేక అధికారులు వీరే

ఆచంపల్లి జీపీ ప్రత్యేక అధికారిగా పి.రేణుక, బూర్గుపల్లి, చర్లపల్లి (ఆర్), తాడిజెర్రి - దాచపల్లి జనార్ధన్‌రెడ్డి, చర్లపల్లి (ఎన్), కాచిరెడ్డిపల్లి - వజహత్ అలీ, చిన్న ఆచంపల్లి, గట్టుభూత్కూర్ - డి.రాజు, గంగాధర, గర్శకుర్తి, మంగపేట నాగారపు- మల్హోత్ర, గోపాల్‌రావుపల్లి- రాములు, హిమ్మత్‌నగర్- రమాదేవి, ఇస్లాంపూర్, మధురానగర్, లింగంపల్లి- రమేశ్‌బాబు, కాసారం, మల్లాపూర్- సింగిరెడ్డి దినేశ్‌రెడ్డి, కొండాయపల్లి- ఎంఏ హలీం, కొండన్నపల్లి, కురిక్యాల - గుగ్గిల్ల రమేశ్, లక్ష్మిదేవిపల్లి- రాజేంద్రప్రసాద్, ముప్పిడినర్సయ్యపల్లి, సర్వారెడ్డిపల్లి- చిన్నయ్య, నాగిరెడ్డిపూర్, నారాయణపూర్- అవినాశ్, నర్సింహులపల్లి, ఒద్యారం - వినయ్‌కుమార్, రంగారావుపల్లి, ర్యాలపల్లి - ఒంటెల శ్రీనివాసరెడ్డి ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు చేపట్టారు.

జీపీలకు ప్రత్యేక అధికారులు వీరే

నవతెలంగాణ - గన్నేరువరం : సర్పంచుల పదవీకాలం ముగియడంతో మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను కలెక్టర్ ఆదేశాల మేరకు నియమించినట్లు ఎంపీడీవో స్వాతి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల వారీగా అధికారుల వివరాలు ఎంపీడీవో స్వాతి చొక్కారావుపల్లి, గోపాలపూర్ గ్రామాలకు, తహసీల్దార్ బిక్షపతి చాకలివానిపల్లి, చీమలకుంటపల్లి గ్రామాలకు, ఎంపీఓ పీవీ.నరసింహారెడ్డి గన్నేరువరం, గుండ్లపల్లి, యస్వాడ గ్రామాలకు, మిషన్ భగీరథ ఏఈ వీరబ్రహ్మం గునుకుల కొండాపూర్, పీచుపల్లి. పిఆర్ ఏఈ స్నేహ జ్యోతి హనుమాజిపల్లి, ఏఈ ఇరిగేషన్ ఈ.రాజ్ కుమార్ జంగపల్లి, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఇస్రావత్ సుల్తానా మైలారం, సాంబయ్యపల్లి, మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి పారువెల్ల, కాసింపేట, మాదాపూర్ గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా నియామకమయ్యారు. శనివారం నుండి గ్రామాలలో ప్రత్యేక విధులు నిర్వహించనున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారులు



బాధ్యతలు స్వీకరించిన ఇంఛార్జి ఎంపీడీఓ రాజేశ్వర్ రావు

నవతెలంగాణ - మానకొండూర్ : సర్పంచుల పదవీ కాలం ముగియడంతో గ్రామ పంచాయితీలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. మండలంలోని 27గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇందులో రెండు పంచాయితీలకు ఒకరి చొప్పున 9 మంది, 9పంచాయితీలకు 9 మంది మొత్తం 27 పంచాయితీలకు 18 మంది ప్రత్యేక అధికారులు నియమితులయ్యారు. అన్నారం, చేంజర్ల గ్రామ పంచాయతీలకు స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.రాజేశ్వర్ రావు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ - చొప్పదండి : మండలంలోని సాంబయ్యపల్లె గ్రామానికి చెందిన మండల నరసయ్య మృతిచెందాడు. ఆయన కుటుంబానికి శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి రూ. 5వేలు, బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో పెరిక శ్రీనివాస్, బండారి రాజేష్, ఆవుల హరీష్, సతీష్ పాల్గొన్నారు.

ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చి...

అబద్దాల పునాదులపై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది

- బీఆర్ఎస్‌ను బొందపెట్టడం వైఎస్సార్, చంద్రబాబుతోనే కాలేదు
- కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్



సమావేశం లో మాట్లాడుతున్న మాజీ ఎంపి బోయినిపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణ - భగత్‌నగర్ : ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చి... అబద్దాల పునాదులపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వాళ్లు బంజారాలేనని, బంజారాలు రాబోయే కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో తనకు ఒట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ ఎస్టీ సెల్ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకుల ఆత్మీయ సమ్మేళనం చింతకుంటలోని ఓ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్‌ను బొంద పెడతాం అని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతున్నారని.. వీళ్లిద్దరి గురువులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు నాయుడుతోనే కాలేదు.. వీళ్లతో ఏమవుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఒక సిద్దాంతం ఉందని, సమసమాజ అభివృద్ధి కోసం పని చేసేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని అన్నారు. దేశంలో బీజేపీ మత రాజకీయాలు చేస్తుందని, ఎన్నికలు వచ్చేటప్పుడు ఏదో ఒకటి చేసి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజల దీవెనలతో తెలంగాణ రాష్ట్రాన్ని తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన దేశంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపినట్లు చెప్పారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలోనే తండాలను పంచాయతీలుగా చేసి అభివృద్ధి చేశామన్నారు. ఈ నెలాఖరులోగా 2లక్షల ఉద్యోగాల ఖాళీల వివరాలపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని, డిసెంబర్ 24 వరకు 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. కరీంనగర్ పార్లమెంటు పరిధిలో ఐదేండ్లలో బండి సంజయ్ ఐదు కొత్తల అభివృద్ధి చేయలేదన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ జెడ్పీ చైర్మన్ విజయ, బీఆర్ఎస్ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు జీవి.రామకృష్ణారావు, తోట ఆగయ్య, బీఆర్ఎస్ కార్మిక విభాగం మాజీ అధ్యక్షుడు రూప్‌సింగ్, నాయకులు రవిందర్‌సింగ్, భూక్య తిరుపతి నాయక్, గుగులోతు రవినాయక్, గుగులోతు తిరుపతి నాయక్, రాజునాయక్, బీలునాయక్, లక్ష్మీవీరునాయక్, మంగ, మానస, రాంచందర్ నాయక్, కళావతి సురేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ డే వేడుకలు..



శంకరపట్నంలో...

నవతెలంగాణ - శంకరపట్నం : శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో ఈజీఎస్ డేను నిర్వహించారు. గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా తహసీల్దార్ అనుపమ బాధ్యతలు స్వీకరించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మమత, ఫీల్డ్ అసిస్టెంట్ ములుగురి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీ ఎన్నికల షెడ్యూల్ ముందే డీఏ ప్రకటించాలి'

నవతెలంగాణ - శంకరపట్నం : పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన డీఏలను ప్రకటించాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ.ఖాద్రీ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 2022 జులై, 2023 జనవరి, జులై నెలల డీఏలు బకాయిలు ఉండగా కేంద్ర ప్రభుత్వం మరో డీఏ ప్రకటించబోతుందని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఏసీపి ఎల్. జీవన్ రెడ్డి

నవతెలంగాణ - హుజురాబాద్ : హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న సంపత్ ఇటీవల ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్ నుంచి కింద పడగా అతని తలకు సర్జరీ జరిగినది. ఏసీపీ జీవన్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. హుజురాబాద్ డివిజన్లోని పోలీస్ సిబ్బంది 50,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని హుజురాబాద్ పట్టణ సీఐ బొల్లం రమేష్, ఎస్సై రాజు, సిబ్బంది చేత ఏసీపీ హోంగార్డ్ కుటుంబానికి అందజేశారు.

ఫైర్ స్టేషన్ పనులను త్వరతిగతిన పూర్తి చేయాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ



ఫైర్ స్టేషన్ పనులను పరిశీలిస్తున్న గుర్రం నీరజ

నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండి పట్టణంలో చేపట్టిన ఫైర్ స్టేషన్ పనులను త్వరతిగతిన పూర్తిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఫైర్‌స్టేషన్ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు.

నేడు బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం



మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నవతెలంగాణ - గంగాధర : వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని వీఏఎస్ గార్డెన్‌లో ఈ నెల 3ననిర్వహిస్తున్న సమావేశానికి బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. గంగాధరలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ ముఖ్యకార్యకర్తల సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు అనుసరించాల్సిన వ్యూహం, ప్రజలను చైతన్య పరచడానికి తీసుకోవల్సిన అనేక అంశాలపై మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే మల్లారెడ్డితోపాటు ముఖ్య నాయకులు హాజరు అవుతున్నారని ఆయన తెలిపారు.

పోలీసుల స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్ లో పాల్గొన్న పోలీస్ సిబ్బంది

నవతెలంగాణ - హుజురాబాద్ : హుజురాబాద్‌లో శుక్రవారం పట్టణ సీఐ బొల్లం రమేష్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నెంబర్ ప్లేట్ లేని 8 ద్విచక్ర వాహనాలను, ఐదు డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. లైసెన్సు లేకుండా, రిజిస్ట్రేషన్ లేకుండా తిరిగే వాహనాలపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ర్యాష్ డ్రైవింగ్ చేయొద్దని వాహనదారులను హెచ్చరించారు. ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి



తల్లిదండ్రుల నుండి ఆశీర్వాదం తీసుకుంటున్న విద్యార్థులు

నవతెలంగాణ - చొప్పదండి : ప్రతి విద్యార్థి చిన్నతనం నుండే కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని వీణాధారి విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్ అన్నారు. చొప్పదండి మండల కేంద్రంలోని వీణాధారి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆశీర్వాద కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలిసి జ్ఞాన సరస్వతి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం తల్లిదండ్రులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పాఠశాలలో స్నేహిత కార్యక్రమం



చామన్‌పల్లి పాఠశాలలో

నవతెలంగాణ - కరీంనగర్ రూరల్ : మండలంలోని చామనపెల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.లక్ష్మారెడ్డి అధ్యక్షతన స్నేహిత కార్యక్రమం నిర్వహించరు. వైద్యాధికారి డాక్టర్ మనోహర్ పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపరింటెండెంట్ జి.నిర్మల మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. దుబ్బపల్లి గ్రామ కార్యదర్శి ఎం.సరిత, కరీంనగర్ రూరల్ ఏఎస్ఐ కె.దామోదర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమయస్ఫూర్తితో అఘాయిత్యాలను అధిగమించాలి



మాట్లాడుతున్న పీడీ శ్రీలతారెడ్డి

నవతెలంగాణ - గంగాధర : మహిళలు, బాలికల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను సమయస్ఫూర్తితో అధిగమించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీలతారెడ్డి అన్నారు. గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన విద్యార్థునుల అవగాహన సదస్సులో పీడీ మాట్లాడారు. సమాజంలో మహిళలు, విద్యార్థినులు, బాలికలపై అఘాయిత్యాలు పెరిగాయని, వాటిని అధిగమించడానికి తీసుకోవల్సిన అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఏపీవో లోకేశ్వరి, ప్రిన్సిపాల్ సౌజన్య పాల్గొన్నారు.

10న నవోదయ 9, 11 తరగతులలో ప్రవేశ పరీక్ష

ప్రిన్సిపాల్ పడమటి మంగతాయారు

నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండి మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ నెల 10న 9, 11వ తరగతులలో పరిమిత సీట్లలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లుగా విద్యాలయ ప్రిన్సిపాల్ పడమటి మంగతాయారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతికి 1745 మంది, 11వ తరగతికి 1144 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి కరీంనగర్ నగరంలో 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టుగా తెలిపారు. అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. నవోదయ.గౌవ్.ఇన్‌వెబ్ సైట్ నుండి హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తినచో 9490395216 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

స్నేహిత కార్యక్రమం



అవగాహన కల్పిస్తున్న మండల విద్యాధికారి వేణు కుమార్

నవతెలంగాణ - చొప్పదండి : మండలంలోని ఆర్నకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాల బాలికలకు స్నేహిత అవగాహన కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దీక్షితులు శ్రీనివాస్ అధ్యక్షత నిర్వహించారు. మండల విద్యాధికారి అంబటి వేణు కుమార్ మాట్లాడారు. సిడిపిఓ కస్తూరి, డాక్టర్ సమీనా, ఏఎస్ఐ రాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూబ్లీనగర్‌లో ఉపాధి హామీ దినోత్సవం



కార్యక్రమంలో అడిషినల్ కలెక్టర్

నవతెలంగాణ - కరీంనగర్ రూరల్ : రూరల్ మండలంలోని జూబ్లీనగర్ గ్రామంలో జాతీయ ఉపాధి దినోత్సవ సంబరాలు నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌ని ఉపాధి హామీ కూలీలు సన్మానించారు. అనంతరం వారితోపాటు డీఆర్‌డీఓ శ్రీలతతో కలిసి కేక్ కట్‌చేశారు. స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ దివ్యదర్శన్‌రావు, ఏపీఓ శోభ, కార్యదర్శి కిరణ్‌రావు, జూబ్లీనగర్ మాజీ సర్పంచ్ రుద్ర రాము, ఫీల్డ్ అసిస్టెంట్ అంజనేయులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఆవిర్భావ ఉత్సవాలు



సైదాపూర్ లో...

నవతెలంగాణ - సైదాపూర్ : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని బొమ్మకల్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో కేక్ కట్ చేయించారు. గ్రామ కార్యదర్శి చంద్రశేఖర్, ఏపీఓ రాణి, టెక్నికల్ అసిస్టెంట్ అశోక్, కంప్యూటర్ ఆపరేటర్ గంజి రామ్‌కిషన్‌రావు పాల్గొన్నారు.

రాగంపేట సర్పంచ్ దంపతులకు సన్మానం



రాగంపేట సర్పంచ్‌ను సన్మానిస్తున్న సెక్రటరీ శ్రీకాంత్

నవతెలంగాణ - చొప్పదండి : మండలంలోని రాగంపేట గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ బాధ్యతలు ముగిసి నందున శుక్రవారం సర్పంచ్ దంపతులు మామిడి లత రాజేశంను గ్రామ సెక్రెటరీ శ్రీకాంత్‌తో గ్రామస్తులు, పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిటిసి, మాజీ సర్పంచ్, పాల్గొన్నారు.

కాసింపేట మాజీ పాలకవర్గానికి సన్మానం



సన్మానం చేస్తున్న గ్రామ ప్రజలు

నవతెలంగాణ - గన్నేరువరం : కాసింపేట గ్రామ మాజీ సర్పంచ్ గంప మల్లేశ్వరివెంకన్న, పాలకవర్గానికి గ్రామ నాయకులు, ప్రజలు శాలువాలతో శుక్రవారం ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎలేటి స్వప్నచంద్రారెడ్డి, ఉపసర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు ఆకెన వైకుంఠం, ప్రత్యేక అధికారి కిరణ్మయి, కార్యదర్శి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ టోర్నమెంట్‌పోటీలకు ఎంపికైన మైతాపూర్ విద్యార్థి

నవతెలంగాణ-రాయికల్



మండలంలోకి మైతాపూర్ గ్రామానికి చెందిన పొడకంటి రాజు-సుమతల కుమారుడు క్రిష్ణ (14) ఈ నెల7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు న్యూఢిల్లీలోని కేడీ జాదవ్ ఇండోర్ స్టేడియంలో జరిగే 3వ వాకో ఇండియా అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ టోర్నమెంట్ పోటీలకు ఎంపికైనట్లు తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సి. రామాంజనేయులు తెలిపారు. తల్లి బీడీ కార్మికురాలు కాగా తండ్రి గల్ఫ్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. గతంలోనూ అంతర్జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొని 5వ స్థానంలో నిలిచాడు. అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనడానికి వెళ్లేందుకు రవాణా ఇతర ఛార్జీలకు గాను సుమారు 30 నుండి 40 వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందని, గతంలోనే ఢిల్లీ వెళ్లేందుకు రూ.30వేల వరకు ఖర్చు అయ్యాయని,తనకు ప్రభుత్వం, దాతలు సహకరిస్తే కిక్ బాక్సింగ్‌లో ఛాంపియన్ అవుతానని దాతలు 8978237734 ఫోన్ పే ద్వారా ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించాలని క్రిష్ణ కోరుతున్నాడు.

వీధి దీపాలు అమర్చాలి

నవతెలంగాణ-రాయికల్



వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయికల్ పట్టణంలోని హనుమాన్ మందిరం ముందు, వీరాపూర్ రోడ్డు ఫకీర్ కాలనీ వద్ద రాత్రి వేళల్లో ప్రయాణానికి ఇబ్బందులు ఎదురవుతు న్నాయని వెంటనే వీధిదీపాలు అమర్చాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ వెంకటికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మ్యాకల రమేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దివాకర్, నర్సయ్య, రాజేష్, నరేష్ పాల్గొన్నారు.

ఆదరిద్దాం.. అండగా నిలుద్దాం

జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్

నవతెలంగాణ- జగిత్యాల:



డైరీ ఆవిష్కరిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి

జగిత్యాల వయోవృద్ధులైన తల్లిదండ్రులను ఆదరించాలని అండగా నిలవాలని, సంరక్షణ భద్రత కల్పించాల్సిన బాధ్యత పిల్లలదేనని వారిని విస్మరించేవారు శిక్షార్హులేనని జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్ అన్నారు. శుక్రవారం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ ముద్రించిన సీనియర్ సిటీజేన్స్ పిలుపుపుస్తకాన్ని,2024 డైరీ, క్యాలెండర్లను అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా సంక్షేమ అధికారికి ,వారి సిబ్బందికి అందజేశారు.

గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన

నవతెలంగాణ-పెగడపల్లి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో పుల్లయ్య.

పెగడపల్లి మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలో సర్పంచుల పదవీకాలంలో ముగిసి పోవడంతో శనివారం ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలన్నారు. ఎంపీడీవో పుల్లయ్య తహసీల్దార్ ఫారుక్, ఎంపీవో మహేందర్, డిప్యూటీ తహసీల్దార్ విష్ణువర్ధన్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధి హామీ వార్షికోత్సవం

నవతెలంగాణ -పెగడపల్లి

పెగడపల్లి మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకం 19వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించి కేకలు కట్ చేసి స్వీట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పుల్లయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, ఏపీవో వేణు, టెక్నికల్ అసిస్టెంట్స్ రాజేశం, నాని, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంటు పాల్గొన్నాడు.

నర్సింగ్ ఆఫీసర్ లాస్యకు సన్మానం

నవతెలంగాణ -మెట్‌పల్లి



లాస్యను సన్మానిస్తున్న వార్డు ప్రజలు

తెలంగాణ నర్సింగ్ నియామక పరీక్షల్లో రాష్ట్రంలో ఆరో ర్యాంకు సాధించిన జెట్టి లాస్యను 23వ వార్డు కౌన్సిలర్ ఓజ్జెల బుచ్చిరెడ్డి శుక్రవారం శాలువా కప్పి అభినందించారు. సాధించిన ర్యాంక్ ద్వారా వార్డులోని మహి ళలకు ఆదర్శంగా నిలిచావన్నారు. మహిళలను వంటింటికే పరిమితం చేయకుండా ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ఆమెను ప్రోత్సహించిన భర్త నరేందర్ వార్డు ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వై నియోజకవర్గ నాయకులు ఓజ్జల శ్రీనివాస్, వార్డు సభ్యులు పుప్పాల రాజన్న, గంగారెడ్డి, ఆకుల నర్సయ్య, గడిపల్లి రాజు, తోట మధు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసనిస్తాయి

నవతెలంగాణ -మెట్‌పల్లి



ఆటలు ఆడుతున్న విద్యార్థులు

క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులకు మానసిక ఉల్లాసన్ని ఇస్తాయని కళాశాల కారస్పాండెంట్ ఇల్లేందుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జ్ఞానోదయ కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు, వార్షి కోత్సవం కోసం కళాశాల విద్యార్థులకు క్రిడలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థుల కోసం ప్రతి సంవత్సరం సాంస్కృతిక క్రీడా కార్యక్రమాలతో పాటు విజ్ఞాన, విహారయాత్రలు ఉంటాయాన్నారు.క్రిడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను వార్షికోత్సవ కార్యక్రమంలో అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కెవి సంతోష్ ,వైస్ ప్రిన్సిపాల్‌రాజు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్లకు సన్మానం

నవతెలంగాణ -మెట్‌పల్లి



ఏజెంట్లను సన్మానిస్తున్న అధికారులు

మెట్‌పల్లి పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయంలో శుక్రవారం బిజినెస్‌లో ప్రతిభ కనబరచిన ఎజెంట్లను సన్మానించారు. ఏజెంట్లు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ ఎల్ఐసి పాలసీ ద్వారా ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్ కల్పించడం అభినందాని యమన్నారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి మల్లారెడ్డి, బుడిగె నారాయణ,మేకల తుకారాం, అడిపు శేఖర్, ఆలుగొట్టు పురుషోత్తం, కే వెంకట రత్నం, చేర్లపల్లి రాజేశ్వర్గౌడ్, నర్సారెడ్డి, నాయిని శ్రీనివాస్,జోగ నరసయ్య, తిమ్మాపూర్ నర్సయ్య, పసుల సుమన్,అధికారులుపాల్గొన్నారు.

జిల్లాలో రెండో రోజు ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ఇంటర్ ద్వితీయ సంవత్సర జనరల్ విద్యార్థులకు, వొకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు నిన్నటి నుండి ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నాయి. రెండవ రోజు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 92 శాతం విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం జరిగిన జనరల్ విభాగంలో 775 విద్యార్థులకు గాను 761 విద్యార్థులు హాజరు కాగా, 14 విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 724 విద్యార్థులు పరీక్షలు వ్రాయవలసి ఉండగా 606 గురు హాజరై 118 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో జనరల్ విభాగంలో 342 గురు విద్యార్థులకు గాను 333 హాజరై 9 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 814 విద్యార్థులకు గానూ 730 మంది హాజరు కాగా 84 గైర్హాజరైనట్టు కన్వీనర్ బి. నారాయణ తెలిపారు.

నత్తనడకన రైతుబంధు సాయం

- ప్రభుత్వం మారడంతో పెట్టుబడి సాయం ఆలస్యం !
- జిల్లాలో రైతుబంధుకు అర్హులు 181460

నవతెలంగాణ-జగిత్యాల



జగిత్యాల జిల్లాలో రైతుబంధు సాయం నత్తనడకన సాగుతోంది. ఇప్పటివరకు మూడెకరాల భూమి ఉన్న రైతులకు మాత్రమే డబ్బులు జమ య్యాయి. మిగతా వారు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయం విడుదల చేస్తున్నామని నెలరోజుల క్రితం ప్రక టించింది. ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో రైతుల ఖాతాల్లో దానికి సంబంధించిన డబ్బు జమ కాలేదు. మూడు ఎకరాల భూమి ఉన్న రైతులకు మాత్రమే వారికి మాత్రమే పెట్టుబడి అందిందని రైతాంగం పేర్కొంటోంది. ఈ నెలాఖరు వరకు అర్హులందరికీ రైతుబంధు అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికే యాసంగి పనులు మొదలయ్యాయి.

జిల్లాలో మొత్తం మంది రైతులు 239818 ఉండగా, రైతు బంధుకు 181460 మంది అర్హత సాధించారు. జిల్లాలో రావాల్సిన రైతుబంధు మొత్తం 214.32 కోట్లు కాగా ఇప్పటి వరకు రైతు బంధు మొత్తం 100.86 కోట్లు రైతుల ఖాతాలో జమ అయ్యాయని అధికారుల సమాచారం. సాయం సకాలంలో అందక సాగు కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుంది.

కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకం పేరును రైతు భరోసాగా మార్చింది. ఎకరం భూమికి ఒక్కో సీజన్‌లో రూ.7,500 వంతున సాయం అందిస్తామని ఎన్నికల ముందు ప్రకటించింది. రైతు భరోసా విధి విధానాలు ఇంకా ఖరారు కాకపోవడంతో ఈ సీజన్‌కు గాను పాత విధానంలోనే ఎకరానికి రూ.5 వేల వంతున సాయం అందిస్తోంది. అయితే ఎకరం లోపు ఉన్న కొంత మంది రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ కాలేదని పేర్కొంటున్నారు.

పెట్టుబడి సాయాన్ని ఐదెకరాలకు కుదించడం, ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లించే వారు, బడా వ్యాపారులు, ఆర్థికంగా వృద్ధి చెందిన వారికి ఇవ్వకూడదనే డిమాండ్ ముందు నుంచి వినిపిస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇదేమీ పరిగణనలోకి తీసుకోకుండా భూమి ఉండి పట్టా పాసు పుస్తకం పొందిన ప్రతి ఒక్కరికీ రైతుబంధు నిధులు జమ చేసింది. వందల ఎకరాల భూమి ఉన్న రైతులు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులకు కూడా పెట్టుబడి సాయం తీసుకున్నారు. ఈ విధానంతో రాష్ట్ర ఖజానా దివాలా తీసే పరిస్థితి ఏర్పడిందని అప్పట్లో ప్రతిపక్షాలు విమర్శించాయి.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కింద అందించే సాయం విషయంలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా సాగుతుందని ప్రకటించారు. యాసంగి సీజన్ సమయం మొదలు కావడంతో ఇప్పుడు విధి విధానాలు రూపొందించి సాయం జమచేయాలంటే ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో ప్రస్తుతం పాత పద్ధతిలోనే నిధులు జమచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వర్షాకాలం సీజన్ వరకు కొత్త మార్గదర్శకాలతో పెట్టుబడి సాయం జమచేసే అవకాశం ఉంది. పాత పద్ధతిలోనైనా మెజార్టీ రైతులకు సాయం అందలేదు. ప్రభుత్వ ఖజానాలో నిధుల కొరత కారణంగా జాప్యం జరుగుతోందనే అభిప్రాయం అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయం త్వరగా అందించాలని రైతాంగం కోరుతోంది.

సర్పంచ్‌లకు ఆత్మీయ సమ్మేళనం



సర్పరాజ్‌పూర్ గ్రామంలో



జోగిన్‌పల్లిలో ఆత్మీయ సమ్మేళనం



గుమాలాపూర్‌లో..



పైడిమడుగులో...

నవతెలంగాణ-కోరుట్ల

కోరుట్ల మండలంలోని సర్పరాజ్‌పూర్, జోగిన్‌పల్లి, గుమాలాపూర్, పైడుమడుగు గ్రామాల్లో పదవీకాలం ముగిసిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులను పంచాయతీ కార్యదర్శులు పృథ్వీ, మిట్టపెల్లి మాధవి, హకీం,శేకర్‌లు శాలువాతో సన్మానం చేసి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా జోగిన్‌పల్లి సర్పంచ్ నర్సు రాజనర్సయ్య మాట్లాడుతూ.. సర్పంచ్‌గా ప్రజలకు సేవ చేయడం సంతోషంగా ఉందని, పదవి ఇచ్చిన గ్రామ ప్రజలకు దన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పరాజ్‌పూర్ సర్పంచ్ భర్త మల్లయ్య, జోగిన్‌పల్లి గ్రామ సబ్యులు బద్దం తిరుపతిరెడ్డి, కొమ్ముల నిత్యశ్రీ, బద్దం రాజేశం, ముత్యపు లక్ష్మిరాజు, పల్లికొండ రమేష్, పల్లికొండ పెద్దరాయుడు (నర్సయ్య), ఎడుమల నిరోష, భూమి వినోద్, కొండ్ర లక్ష్మన, పైడిమడుగు గ్రామ మాజీ సర్పంచ్ దమ్మ భీమ్‌రెడ్డి, వార్డుమెంబర్ లక్‌పతి, లాస్యరాము, ప్రేమలత, మధులత, రజనీ, మల్లారెడ్డి, రాద, గణేస్, కమర్‌సుల్తానా, జగదీశ్వర్, సంజీవ్, మల్లేస్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటుకు కలెక్టర్ ఉత్తర్వులు

నవతెలంగాణ-జగిత్యాల

భవన నిర్మాణ రంగంలో ఇసుక ప్రాధాన్యతను వివరిస్తూ, ఇసుకను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు జిల్లా కేంద్రంలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి జగిత్యాల జిల్లా కలెక్టర్ యాష్మీన్ భాషా కు లేఖ రాశారు. గతంలో నిర్వహించిన ఇసుక స్టాక్ పాయింట్‌ను ఏడాది కాలంగా నిలిపివేయడంతో భవన నిర్మాణ రంగానికి అవసరమైన ఇసుక అందు బాటులో లేకపోవడంతో ప్రైవేట్‌గా ఇసుక కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని లేఖలో పేర్కొన్నారు. ఇసుక స్టాక్ పాయింట్‌ను తిరిగి ప్రారంభిస్తే, ఇసుక అక్రమ రవాణా నిలువరిం చడంతో పాటు, నిర్మాణ రంగానికి ప్రభుత్వపరంగా ఇసుక అందుబాటులోకి వస్తుందని తద్వారా నిర్మాణ రంగంపై పడే అదనపు ఆర్థిక భారం కూడా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. పట్టణంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయానికి చెందిన సుమారు ఐదు ఎకరాల స్థలాన్ని పరిశీలించాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కోరారు. ఈ మేరకు జగిత్యాల జిల్లా కలెక్టర్ యాష్మీ న్ భాషా జగిత్యాల పట్టణంలోని శ్రీ రాజ రాజేశ్వర దేవాలయ పరిసరాల్లో అందు బాటులో ఉన్న ఐదు ఎకరాల స్థలంలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రత్యేకాధికారులకు అనేక సవాళ్లు

- ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామాల కేటాయింపు
- నైరాశ్యంలో తాజా మాజీ సర్పంచులు
- పెరుగనున్న అధికారుల పని భారం
- నూతన పంచాయతీ భవనాల బిల్లలు, నిర్మాణాల సవాల్

నవతెలంగాణ-రాయికల్



ప్రత్యేక అధికారిగా భాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపిడిఓ



.. పంచాయతీ భవనాల నిర్మాణాల కోసం తవ్విన పునాదులు

పల్లెల పాలన అధికారుల చేతుల్లోకి వచ్చింది. ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా లేకపోవడంతో పదేళ్ల తర్వాత మళ్లీ గ్రామాల్లో ప్రత్యేక పాలన ప్రారంభమైంది. సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల పదవీ కాలం గురువారంతో ముగియడంతో మండలంలోని 32 గ్రామాల్లో శుక్రవారం నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది.

రాయికల్ మండలంలోని 32 గ్రామాల్లో గెజిటెడ్ అధికారులు ప్రత్యేక పాలన విధులకు సంబంధించి బాధ్యత్యలు స్వీకరించారు. నేడు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, ఉన్నతాధికారులు, మండల, గ్రామస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ తదుపరి ప్రత్యేక అధికారుల పాలనకు సంబంధించిన విధి,విధానాల దిశా నిర్దేశం చేస్తారని సమాచారం. మండలంలో ఇకపై ప్రత్యేక విధుల్లో పంచాయతీరాజ్, రెవెన్యూ, ఇరిగేషన్, రోడ్డు భవనాల, ఎస్.ఆర్.ఎస్.పి, వ్యవసాయ, విద్య, ఎంప్లాయిమెంట్ శాఖల అధికారులు ప్రత్యక్షంగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో విధులు నిర్వహించనున్నారు. సర్పంచుల ఆధీనంలో ఉన్న డిజిటల్ కీలు, చెక్కులు, ఇతర రికార్డులన్నంటినీ అధికారులు ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేక అధికారికి, కార్యదర్శికి ప్రభుత్వం జాయింట్ చెక్ పవర్ అవకాశం కల్పించనుంది.

నైరాశ్యంలో తాజా మాజీ సర్పంచులు

ఇప్పటి వరకు గ్రామాల్లో సరిపడా నిధులు రాక కొందరు సర్పంచులు ఆయా గ్రామాల్లో సంక్షేమ పనులకు అప్పులు చేసి అభివృద్ధి పనులకు పెట్టుబడి పెట్టిన బిల్లులు రాలేదని, ఎంబి రికార్డులు సైతం పూర్తి చేయలేదని, ఒకవేళ మార్చి 31లోపు చేసిన పనులకు ఎంబి రికార్డులు పూర్తి చేయకపోతే సొంతగా ఖర్చు భరించిన సర్పంచుల పరిస్థితి అధోగతి అవుతుందని పలువురు సర్పంచులు నైరాశ్యంలో అయోమయంగా ఉన్నారు.

పెరుగనున్న పనిభారం

మండల, జిల్లా స్థాయిలో పని చేసే గెజిటెడ్ అధికారులు రెండు, మూడు గ్రామాల్లో విధులు నిర్వహించాల్సి ఉంది. ఆయా కార్యాలయాల్లో రోజు వారి చేయవలసిన పనుల వల్ల కొంత మేర కార్యాలయ పనుల్లో జాప్యం ఏర్పడి పని భారం, ఒత్తిడికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని తద్వారా అటు విధులు నిర్వహిస్తున్న కార్యాలయాల్లో, ఇటు గ్రామాల్లో నిర్వహించే పనుల్లో ఏ విధంగా ముందుకు సాగుతారనేది ప్రశ్నర్థకమే..?

నూతన పంచాయితీ భవనాల బిల్లలు,నిర్మాణాల సవాల్

ప్రత్యేక అధికారులకు నూతన పంచాయతీ భవనాల బిల్లలు, నిర్మాణాల పనులు సవాల్‌గా మారనున్నాయి. మండలంలో మొత్తం 13 నూతన గ్రామ పంచాయతీలకు ఎన్ఆర్ఈజీఎస్ తదితర స్కీంల కింద ఒక్కో బిల్డింగ్ నిర్మాణానికి సుమారు 20 లక్షల చొప్పున నిధులు మంజూరు కాగా కేవలం ఇప్పటి వరకు కుర్మపల్లి, వడ్డలింగాపూర్, సింగారావుపేట మూడు గ్రామాల్లో గ్రామ పంచాయతీల నూతన భవన నిర్మాణాలు మాత్రమే పూర్తయినవి. సంబంధిత బిల్లులు ఆయా సర్పంచులకు రావాల్సి ఉందని సమాచారం. ఒడ్డెర కాలనీ, చింతలూరు రెండు గ్రామాల్లోని నిర్మాణ పనులు స్లాబ్ లెవల్‌లోనే ఉన్నాయి. మిగిలిన 8 గ్రామాలైన వస్తాపూర్, మైతాపూర్, చెర్ల కొండాపూర్, మూటపల్లి, జగన్నాథ్ పూర్, బోర్నపల్లి, శ్రీరామ్‌నగర్, మంత్యా నాయక్ తండా గ్రామ పంచాయతీ భవన నిర్మాణాల పనులు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి.

రావాల్సిన బకాయిలు వచ్చేనా..?

ఈజీఎస్ పనుల బిల్లులు మినహా 29 జనవరి 2024 వరకు గ్రామాల వారీగా ప్రభుత్వం తాజా మాజీ సర్పంచ్‌లకు చెల్లించాల్సిన బకాయిలకు సంబంధించిన సవాళ్లను ప్రత్యేక అధికారులు ఎదుర్కోవాల్సిందేనెమో...ఇప్పటివరకు 32 గ్రామాల వారీగా చూస్తే అల్లీపూర్ 858450, అలియా నాయక్ తండా 103000, ఆలూర్ 96181, అయోధ్య 96860, భూపతిపూర్ 1141629, బోర్నపల్లి241000, చెర్లకొండాపూర్ 264000, చింతలూరు 223000, ధావన్‌పల్లి 147200, ధర్మాజిపేట్ 356500,ఇటిక్యాల 895000, జగన్నాథ్‌పూర్ 150000, కైరిగూడెం 177650, కట్కపూర్ 293228, కిష్టంపేట 996609, కొత్తపేట్ 435563,కుర్మపల్లి 606270,కుర్మపల్లి 188510, మహితాపూర్ 845900, మంత్యా నాయక్ తండా 326000, మూటపల్లి 652000, ఒడ్డెలింగాపూర్ 232000, వడ్డెర కాలనీ 667000, రాజనగర్ 102000, రామాజీపేట్ 698000, రామారావుపల్లె 50000, సింగర్‌రావుపేట్ 157444, శ్రీరామ్ నగర్ 104000, తాట్లవాయి 812000, ఉప్పుమడుగు 576963, వస్తాపూర్ 1177195, వీరపూర్ 396000 మొత్తం 14067152 నిధులు తాజా మాజీ సర్పంచ్‌లకు చెల్లించాల్సి ఉంది.

ఎమర్జెన్సీ పోరాటయోధులకు సమరయోధులుగా గుర్తింపు

త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

నవతెలంగాణ-జగిత్యాల

ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి ప్రజాస్వామ్య పునరుద్ధరణకు కృషి చేసిన వారిని స్వాతంత్ర యోధులుగా గుర్తింపు కల్పించే విధంగా కృషి చేస్తానని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. భారత సురక్ష సమితి జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి పౌర సన్మానం ఏర్పాటు చేశారు. జగిత్యాల పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్ భారత సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసిఎస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ 1975- 77 కాలంలో దేశంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీని విధించిందన్నారు. ప్రతిపక్ష నాయకులను రాత్రికి రాత్రి అరెస్టు చేసి జైల్లో పెట్టారన్నారు. పత్రికలు, మీడియా సంస్థలపై ఉక్కు పాదం మోపి ప్రజాస్వామ్య గొంతు నులిమారని తెలిపారు. ఆ సమయంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎంతోమంది యువకులు, విద్యార్థులు ఉద్యమించారని, కొంతమంది పోలీస్ కాల్పుల్లో కూడా మృతి చెందారన్నారు. ఆనాడు ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న వారు ఆర్థిక పరంగా ఆరోగ్యపరంగా ఇబ్బందుల్లో ఉన్నారని అలాంటి వారిని స్వాతంత్ర యోధులుగా గుర్తించి అన్ని రాయితీలు కల్పించే విధంగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామ కృష్ణారెడ్డి, కాసిపేట లింగయ్య, భారత సురక్ష సమితి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసీఎస్ రాజు, ప్రధాన కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కృషి చేస్తాం

రాష్ట్ర వైద్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి రాజనరసింహ



కలిసి వెళ్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనరసింహా, ఎమ్మెల్యే అడ్లూరి

నవతెలంగాణ-జగిత్యాల

సీఎస్ఆర్ నిధులతో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం ధర్మపురిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్య, వైద్యంలకు సీఎస్ఆర్. నిధులను సమకూర్చుకు నేందుకు సీఎంతో చర్చిస్తామని తెలిపారు. ధర్మపురిలోని 30 పడకల కమ్యూనిటీ ఆస్పత్రిని 100 పడకలుగా మార్చేందుకు, మార్చురీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వసతులు ఉన్నప్పటికీ క్యాడర్ స్ట్రెంథ్ లేదని, రిక్రూట్మెంట్ జరుగలేదని తెలిపారు. వైద్య కళాశాలలు, ఆస్పత్రుల్లో ప్రమాణాలు ఉన్నప్పటికీ వ్యవస్థ లేదని అన్నారు. స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలనే అభిప్రాయం ప్రభుత్వం ఆలోచిస్తున్నదని తెలిపారు. ఈ ప్రాంతమంతా బొగ్గు గనులు ఉన్నాయని, గతంలోలాగే సీఎస్ఆర్ నిధులు కేటాయించే విధంగా కృషి చేస్తామని తెలిపారు.

శ్రీ నరసింహ స్వామిని దర్శించుకున్న మంత్రి కుటుంబ సభ్యులు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నరసింహ కుటుంబ సభ్యులు గురువారం రాత్రి ధర్మపురి పుణ్య క్షేత్రానికి చేరుకుని బస చేశారు. ప్రభుత్వ విప్ ఏ. లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ దివాకర లు మంత్రికి పూల బోకెలు అందించి స్వాగతం పలికారు. శుక్రవారం రోజున తెల్లవారు జామునే దేవాలయానికి చేరుకుని అభిషేకం, హోమం, కళ్యాణం లను వేద పండితుల మంత్రోశ్చరణలతో నిర్వహించుకున్నారు.

మంత్రిని కలిసిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు

జిల్లాకు చేరుకున్న మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలను అందించిన జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, బి.ఎస్.లత. అనంతరం జిల్లాలోని పలు సమస్యలపై చర్చించారు.ఈ కార్యక్రమాలలో ఆర్డీఓ నరసింహ మూర్తి, ఆలయ ఈఓ శ్రీనివాస్ , తహశీల్దార్, వైద్య శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలోచన అదిరింది.. కోతి బెదిరింది

కోతులను తరిమేందుకు మహిళ వినుత్న ప్రయత్నం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



ఏర్పాటు చేసిన సింహం బొమ్మ

గ్రామంలో కోతులు సైరవిహారం చేస్తున్నాయి. ఇండ్లల్లోకి చోరబడి వంటా సామగ్రితో పాటు, నిత్య వసరాలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన అంకతి గౌరమ్మ తమ ఇంట్లోకి కోతులు రావటంతో రక్షణగా సింహం బొమ్మను ఏర్పాటు చేసింది. బొమ్మను చూసి కోతులు భయంతో పరుగులు తీశాయి.

ఎమ్మెల్యేను కలిసిన మెప్మా ఆర్‌పీలు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



వినతి పత్రం అందజేస్తున్న ఆర్‌పీలు

జగిత్యాల పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆర్‌పీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇప్పించాలని, వారి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

స్కేటింగ్ క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే

జగిత్యాల పట్టణానికి చెందిన అద్వైత్, అభినవ్, సాయి, ప్రీతం, స్పీడ్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ స్థాయి స్పీడ్ స్కేటింగ్‌లో గోల్డ్, బ్రాంజ్ మెడల్ సాధించగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అభినందించారు. క్రీడాకారుల కోసం అన్ని మౌలిక సదుపాయాల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తామన్నారు.

ఉచిత నేత్ర శస్త్ర చికిత్సలు చేసిన ఎమ్మెల్యే



పరీక్షిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల పావని కంటి ఆసుపత్రి, ఆపి, రోటరీ క్లబ్ జగిత్యాల వారి ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 19 మంది నిరుపేదలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించారు.

బడ్జెట్‌లో పాత స్లాబులే..

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో ఉద్యోగులకు ఇన్కమ్ టాక్స్ పరిధి పెంచకపోవడం, పాత స్లాబులు కొనసాగించడం శోచనీయమని ప్రోగ్రెసివ్ టీచర్ యూనియన్ తెలంగాణ స్టేట్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ ప్రతిపాదనలో ప్రభుత్వం ఉద్యోగులకు ఇన్కమ్ టాక్స్ పరిధి పెంచకపోవడం పాత స్లాబ్‌లోనే తిరిగి కొనసాగించడం వలన ఎక్కువ మొత్తం పనులు కట్టవలసి వస్తుందని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో కాస్త పన్ను మినహాయింపు అవుతుందని ఆత్రుతగా ఎదురుచూసిన ఉద్యోగులకు నిరాశే మిగిలిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మద్దిరాల గణేష్, చిన్నయ్య, దాసరి నవీన్, జేఎస్ అశోక్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలి

నవతెలంగాణ-మల్లాపూర్

కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని బిజెపి పార్టీ మల్లాపూర్ మండల ఇన్‌చార్జి డాక్టర్ చిట్నేని రఘు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వెంకటేశ్వర ఆలయంలో బిజెపి మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గావ్ చలో బస్తీ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహిళా మోర్చా కార్యవర్గ సభ్యులు ఎర్ర లక్ష్మి, బీజేవైఎం మండల అధ్యక్షులు పందిరి నాగరాజు, బిజెపి ఉపాధ్యక్షులు గుయ్య మల్లేష్, బిజెపి మండల సీనియర్ నాయకులు ముత్యాల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరి హెల్మెట్ ధరించాలి

జిల్లా మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ చంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్ చంద్రారెడ్డి

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి గ్రామంలోని జ్ఞానదీప్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో శుక్రవారం జాతీయ రహదారుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై జిల్లా మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ చంద్రారెడ్డి అవగాహన కల్పించారు. వివరించారు. వెహికల్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ చాల మంది వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలకు గురై అక్కడికక్కడే మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయన్నారు. కారు డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని డ్రైవింగ్ సమయంలో బెల్ట్‌లు ధరించాలని, విద్యార్థులు రోడ్డు దాటేటప్పుడు ఇరువైపులా చూసుకుని దాటాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జ్ఞానదీప్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిట్టపల్లి లక్ష్మినారాయణ, జిల్లా మోటార్ డ్రైవింగ్ స్కూల్ యూనియన్ అధ్యక్షులు బాబు, సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

11, 12వ తేదీల్లో టీపీటీఎఫ్ ద్వితీయ రాష్ట్ర మహాసభలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీచర్ ఫౌండేషన్

నవతెలంగాణ - కొనరావుపేట : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11, 12వ తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న ద్వితీయ రాష్ట్ర విద్య వైజ్ఞానిక మహాసభలను ఉపాధ్యాయులు, ఫెడరేషన్ బాధ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు నూగూరి దేవేందర్ పిలుపునిచ్చారు. కొనరావుపేట మండలం కొలనూరు గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యాధికారి దూస రఘుపతి, టీపీటీఎఫ్ మండల అధ్యక్షులు నూగూరి దేవేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మహాసభలు ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. తాము కూడా ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించినప్పుడు ఇలాంటి మహాసభలలో పాల్గొన్నామని గుర్తు చేసుకున్నారు. టీపీటీఎఫ్ మండల అధ్యక్షులు నూగూరి దేవేందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఫెడరేషన్ బాధ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని, విద్యా రంగంలో నెలకొన్న అనేక సమస్యలకు పరిష్కార మార్గం మహాసభల్లో లభిస్తుందని, వాటి ద్వారా ప్రభుత్వానికి ఉపాధ్యాయుల సమస్యలను గట్టిగా వినిపిద్దామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోడూరి ఎల్లయ్య, టిపిటిఎఫ్ మండల ఉపాధ్యక్షులు నరేందర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, జిందం అశోక్, రవీంద్ర బాబు, సిరిగిరి రవీందర్, అస్మా బేగం, కమల్ నయన్, రమాదేవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొల్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో 'గోరుముద్ద' కార్యక్రమం ప్రారంభం



గోరుముద్ద కార్యక్రమం ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండలంలోని రాచర్ల గొల్లపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కొండ ఆంజేయులు గౌడ్ ఆర్థిక సాయంతో శుక్రవారం పదవ తరగతి విద్యార్థులకు గోరు ముద్ద కార్యక్రమం ప్రారంభించారు. పాఠశాల మీద అభిమానంతో ఆంజనేయులు గోరుముద్ద కార్యక్రమానికి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ విద్యా సంవత్సరం 10వ తరగతిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయుల బృందం డ్యాకర్ ఆంజేయులు గౌడ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాక మురళీధర్, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారులు

నవతెలంగాణ - వీర్నపల్లి : వీర్నపల్లి మండలం గ్రామ పంచాయతీ అధికారులుగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రంగంపేట, ఎర్రగడ్డ తండ ప్రత్యేక అధికారిగా ఉప తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, జవహర్ లాల్ తండ, సీతారాం నాయక్ తండ ప్రత్యేక అధికారిగా మిషన్ భగీరథ ఏఈ అనిల్, వీర్నపల్లి ప్రత్యేక అధికారిగా ఇరిగేషన్ డీఈ వినోద్ కుమార్, మద్ది మల్ల, మద్దిమల్ల తండ ప్రత్యేక అధికారిగా తహశీల్దార్ ఉమా రాణి, బంజెరు, భూక్య తండ ప్రత్యేక అధికారిగా ఇరిగేషన్ ఏఈ సురేష్, గర్జనపల్లి, కంచర్ల పంచాయతీ రాజ్ ఏఈ వెంకన్న, వన్‌పల్లి, శాంతీనగర్ హ్యాండ్‌లూం, అండ్ టెక్స్ టైల్స్ డెవలప్ మెంట్ అధికారి రాజేశ్వర్ రావు, అడవిపదిర, లాల్‌సింగ్ తండ డెవలప్ మెంట్ అధికారి మోజుద్దిన్, బాబాయి చెరువుతండ, బావు సింగ్ తండ ఎంపీడీఓ నరేష్ కుమార్‌లు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కార్యదర్శులు గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

పాలన పగ్గాలు చేపట్టిన ప్రత్యేక అధికారులు

నవతెలంగాణ-సారంగాపూర్ : గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయా గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం సారంగాపూర్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు పాలన పగ్గాలను చేపట్టారు. సారంగాపూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ రమేష్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. సారంగాపూర్ మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సారంగాపూర్ మండల శాఖ అధ్యక్షుడు కొంద్ర రామచంద్రారెడ్డి, సారంగాపూర్ మాజీ సర్పంచ్ న్యారబోయిన గంగాధర్ కార్యకర్తలతో కలిసి ప్రత్యేక అధికారికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ ఈ కార్యక్రమంలో కాలగిరి సత్యనారాయణరెడ్డి, ఏలూరి రాజిరెడ్డి, పెద్దిరెడ్డి స్వామిరెడ్డి, ఎంపీ రమణ, చేకుట శేఖర్, గోవర్ధన్ శ్రీనివాస్, కొక్కు ఉపేందర్, ఆర్ఐ భాస్కరరావు, సెక్రటరీ శేఖర్ లు పాల్గొన్నారు. రేచపల్లి గ్రామపంచాయతీలో ఎంపీడీవో అనుమల్ల రాజేందర్, ఆర్పెల్లి గ్రామ పంచాయతీలో ఎంపీఓ శశికుమార్‌లతో పాటు వివిధ గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారులుగా పలు శాఖలకు చెందిన అధికారులు బాధ్యతలు స్వీకరించారు.

పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ తక్కల్లపెల్లి మాధవరావు

నవతెలంగాణ-సారంగాపూర్ : పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం కోరుట్ల ఆధ్వర్యంలో సారంగాపూర్ మండలంలోని అర్పెల్లి, పోచంపేట్,రేచపెల్లి గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరాలలో 210 పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన చికిత్సలను, 110 మెడిసిన్ చికిత్సలను, 8 శస్త్ర చికిత్సలను నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ తక్కల్లపల్లి మాధవరావు మాట్లాడుతూ.. కళాశాల నుండి అందించబడుతున్న వివిధ సేవలను రైతులకు వివరించారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ బి రాజేందర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అంబిక, డాక్టర్ పరశురాములు, డాక్టర్ సురేశ్ శు సంవర్ధకశాఖ డాక్టర్లు డాక్టర్ తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్



నవతెలంగాణ-కోరుట్ల : మండలంలోని చిన్నమెటుపల్లి గ్రామ పంచాయతీకి స్పెషల్ ఆఫీసర్‌గా కోరుట్ల తహసీల్దార్ ఇట్యాల కిషన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను పంచాయతీ రాజ్ సెక్రటరీ రామకృష్ణ శాలువాతో సన్మానించారు. కారోబార్ రవి, ఆశావర్కర్‌లు, ఏఎన్ఎమ్‌లు, ప్రజలు పాల్గొన్నారు.

మల్లాపూర్ మండలంలో ప్రత్యేకాధికారుల బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-మల్లాపూర్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో గ్రామ పంచాయతీలో ప్రత్యేకాధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా 24 గ్రామాలలో 12 మంది అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఒక్కో అధికారికి రెండు గ్రామాల చొప్పున ప్రత్యేక అధికారిగా నియమకమయ్యారు. ఎంపీడీవో రాజ శ్రీనివాస్ మొగిలిపేట, న్యూ దామరాజుపల్లి ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్ వీర్‌సింగ్ మల్లాపూర్‌తో పాటు వేంపల్లి, ఎంపీఓ జగదీష్ చిట్టాపూర్, కుస్తా పూర్, ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

ప్రభుత్వ భూముల వివరాలు పక్కాగా ఉండాలి

- ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- వేసవిలో నీటి సమస్య రాకుండా చర్యలు
- జిల్లా అధికారులతో సమీక్షలో కలెక్టర్ అనురాగ్ జయంతి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

నవతెలంగాణ - సిరిసిల్ల : జిల్లా పరిధిలో గల ప్రభుత్వ భూముల వివరాలు పక్కాగా ఉండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ భూముల వివరాలు పక్కాగా ఉండాలని సూచించారు. ఖాళీ స్థలాలు ఎన్ని ఎకరాలు ఉన్నాయో రికార్డ్సులో ఉండాలని, వాటిపై తనిఖీ చేయాలని, ఆక్రమణలు ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అట్టి భూములను విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలకు అవసరమయ్యే భవనాల నిర్మాణాలకు వినియోగించాలని పేర్కొన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, అన్ని మండలాల పరిధిలోని గ్రామాల్లో రానున్న వేసవిలో నీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. నీటి శుద్ధి నుంచి మొదలు ఇంటింటికీ సరఫరా వరకు క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అన్ని వివరాలతో కూడిన సమగ్ర నివేదికను అందించాలని కలెక్టర్ ఆదేశించారు. శ్రీ రాజరాజేశ్వర జలాశయంలో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలపై ఆరా తీశారు. నీటి సరఫరా, సమస్యల పరిశీలనకు జిల్లా అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. సిరిసిల్లలోని టెక్స్‌టైల్ పార్క్‌లో ఎన్ని పరిశ్రమలు అనుమతి పొందాయి? ప్రస్తుతం ఎన్ని కొనసాగుతున్నాయనే వివరాలు టెక్స్‌టైల్ పార్క్ ఆర్డీడీ అశోక్‌రావును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. టెక్స్‌టైల్ పార్క్‌లో మొత్తం 116పరిశ్రమలు అనుమతి పొందాయని, ప్రస్తుతం 62 కొనసాగుతున్నాయని జేడీ తెలిపారు. మిగతా పరిశ్రమలు వివిధ కారణాలతో మూతపడ్డాయని వివరించారు. అనంతరం శ్రీ రాజరాజేశ్వర జలాశయం వద్ద చేప పిల్లల పెంపకం, దానికి కావాల్సిన స్థలం, ఇతర అంశాలపై వివరాలు ఆ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గల ప్రతీ ఇంజనీరింగ్ విభాగం పరిధిలో 2014నుంచి ఇప్పటివరకు ఎన్ని పనులు మంజూరయ్యాయి, ఎన్ని పూర్తయ్యాయి అనే సమగ్ర వివరాలను సమకూర్చి తనకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే తంగళ్ళపల్లి మండలం పద్మనగర్ శివారులో చేపడుతున్న కేంద్రీయ విద్యాలయం నూతన భవన నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. ఎంత మేరకు నిర్మాణం పూర్తయింది? ఎప్పటివరకు పూర్తి చేస్తారు? అనే వివరాలను ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో క్రిటికల్ కేర్ యూనిట్, క్వార్టర్ల నిర్మాణాలకు కావాల్సిన భూములను సేకరించాలని, పనులు త్వరగా పూర్తి చేయాలని సిరిసిల్ల ఆర్డీఓను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఎన్.ఖీమ్యా నాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు ఆనంద్ కుమార్, మధుసూధన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగయ్య, టెక్స్టైల్ పార్క్ ఆర్డీడీ అశోక్ రావు, మిడ్ మానేర్ ఈఈ జగన్, జౌళి శాఖ ఏడీ సాగర్, ఇంట్రా ఈఈ జానకి, గ్రిడ్ ఈఈ విజయ్ కుమార్, చీఫ్ ప్లానింగ్ అధికారి పిబి శ్రీనివాసచారి, జిల్లా పంచాయితీ అధికారి రవీందర్, జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ శ్యామ్ సుందర్, మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పనా అధికారి రాఘవేందర్, మున్సిపల్ కమిషనర్లు అయాజ్, అన్వేష్ పాల్గొన్నారు.

రోడ్ భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటించాలి

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



రోడ్డు భద్రత కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్



ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ - సిరిసిల్ల : ప్రజలు రోడ్డు భద్రత ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ వాహనాలు నడపాలని, ప్రాణం ఎంతో విలువైందని, హెల్మెట్ సీట్ బెల్ట్ లేకుండా మద్యం తాగి వాహనాలు నడపవద్దని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. 35వ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, వాహన దారులతో ఏర్పాటు చేసిన రహదారి భద్రతా ప్రతిజ్ఞ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డితో కలసి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 35వ రోడ్ భద్రతా మాసోఉత్సవాల్లో భాగంగా జిల్లాలో రోడ్ భద్రత అవగాహన కార్యక్రమాలు నిరహిస్తున్నామని, అంతే కాకుండా జిల్లాలోని ప్రతి పాఠశాలల్లో రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ క్లాసెస్‌లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని, వాహనం నడిపే సమయంలో హెల్మెట్, సిట్ బెల్ట్ తప్పని సరిగా ధరించాలని, ప్రాణం ఎంతో విలువైనది అని మన మీద మన కుటుంబ సభ్యులు ఆధారపడి ఉంటారని మద్యం సేవించి, నిర్లక్ష్యంగా, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్‌లో, అవగాహన రహిత్యంలో వాహనాలు నదువుతు ప్రాణాల మీద తెచుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మైనర్ డ్రైవింగ్ చేయడం నేరం అని మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. రహదారులు ప్రాచీన నాగరికతకు చిహ్నం అని, రహదారులు పచ్చని నీడనిచ్చే చెట్లతో కళలాడలే తప్ప రక్తపు మరకలతో తడసిపోవద్దని దానికోసం ప్రతి ఒక్కరు రోడ్ భద్రత నియమాలు, ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని కోరారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ ఉదయ్ రెడ్డి, సి.ఐ రఘుపతి, ట్రాఫిక్ ఎస్.ఐ రాజు సిబ్బంది, విద్యార్థులు, వాహనదారులు పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాలను నిర్మూలించాలి

జిల్లా పరిధిలో గంజాయి మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం మెసేజ్ యూవర్ ఎస్పీ నెంబర్ 630-392-2572కు లేదా డయల్ 100కి సమాచారం అందించి, గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యంమై గంజాయి రహిత జిల్లాగా మార్చాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలానే లక్ష్యంగా జిల్లా పోలీస్‌శాఖ పనిచేస్తుందని, ప్రభుత్వం నిషేధించిన గంజాయి, మరే ఇతర మత్తు పదార్థాల గురించి జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌లు చేస్తున్నామన్నారు. గంజాయి మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఉంటే మెసేజ్ యూవర్ ఎస్పీ నెంబర్ 630-392-2572కు లేదా డయల్ 100కి సమాచారం అందించి గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గడిచిన నెల రోజుల కాలంలో జిల్లాలో గంజాయి కి సంబంధించి ఐదు కేసులు నమోదు చేసి 1,250గ్రాముల గంజాయి సీజ్ చేసి, 13 మందిని రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు. గంజాయి, మరే ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, సేవించినా, ఇతరులకు విక్రయించిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

చివరి రోజు.. శిల పలకాల మోజు!

- నూతన భవనాలు ప్రారంభం
- పలు అభివద్ధి పనులకు శంకుస్థాపనలు
- హడావుడిలో సర్పంచ్‌లు

నవతెలంగాణ - చందుర్తి : మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచ్‌లు హడావుడిలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కొత్త పనులకు శంకుస్థాపనలు చేశారు. దీంతో ఫిబ్రవరి ఫస్ట్‌తో సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో కుంటుబడిన అభివృద్ధి పనులను ప్రారంభించారు.

సంవత్సర కిందట పూర్తైన భవనాలు ప్రారంభం

గత సంవత్సర కిందట మర్రిగడ్డ హెల్త్ సెంటర్, మూడపల్లి హెల్త్ సెంటర్, సనుగులలో భవనాల పనుకు పూర్తయ్యాయి. దీంతో అసౌకర్యంగా కొన్ని పనుకు పెండింగ్ ఉండగా అట్టి నూతన భవనాలను ప్రారభించ లేదు. దీంతో పదవి చివరి రోజైన ఆ భవనాలు ప్రారంభించాలని ఆయా సర్పంచ్‌లు కంకణం కట్టుకున్నారు.

శిలాఫలకాలపై పేరు ఉండాలని..

ఐదు సంవత్సరాలు గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు అప్పులుచేసి చేపడితే బిల్లులు రాకపోగా కనీసం వాటిపై తమ పేర్లైనా ఉండాలని సర్పంచ్‌లు హడావిడిగా అప్పటికప్పుడు శిలాఫలకాలను ముద్రించి తాము చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు తెలియాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌తో ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ఏది ఏమైనా చివరి రోజున అభివృద్ధి పనులకు అన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు ప్రారంభ మోజులో ఉండిపోయారు.

బండలింగంపల్లి విద్యార్థినికి డీఈవో అభినందన



ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థిని

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండలంలోని బండలింగంపల్లి విద్యార్థిని వైశాలిని శుక్రవారం జిల్లా విద్యాధికారి అభినందించి ప్రశంసా పత్రం అందించారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ఓటు ప్రాధాన్యత అనే అంశంపై నిర్వహించిన కవితల పోటీలో జిల్లా పరిషత్ బండలింగంపల్లి పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న గొల్లపల్లి వైశాలి మండల జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొంది కలెక్టర్ చేతుల మీదుగా బహుమతిని అందుకున్నదని ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కూడా ప్రథమ స్థానంలో గెలుపొంది గవర్నర్ తమిళసై సౌందర రాజన్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్న సందర్భంగా జిల్లా విద్యాధికారి రమేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ ఆఫీసర్ శైలజ, డిఎస్ఓ పాముల దేవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు తిరుపతి, ధర్మయ్య, దేవయ్య, బలరాం, శ్రీనివాస్, అఫ్జల్, సునంద,పరశురాం, ప్రనూష, మంజుల పాల్గొన్నారు.

ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీ పకడ్బందీగా చేపట్టాలి

జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

నవతెలంగాణ - సిరిసిల్ల : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ల తనిఖీ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా చేయాల్సిన ఏర్పాట్లపై శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు, జిల్లాలోని తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని సర్దాపూర్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ యార్డ్‌లోని గోడౌన్‌లో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ల మొదటి స్థాయి తనిఖీ ఏర్పాట్లపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ నెల 5వ తేదీ నుంచి ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీ చేపడుతున్నట్లు వెల్లడించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ కార్యాలయాల ఆవరణలో ఈవీఎం, వీవీప్యాట్ ల అవగాహన ప్రదర్శన కేంద్రాలు ఏర్పాటు చేసి, అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల కోసం కావాల్సిన సామగ్రిని తెప్పించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటరు జాబితాను మరోసారి పరిశీలించాలని, డబుల్ ఓట్లు, తప్పులు ఉండకూడదని స్పష్టం చేశారు. బీఎల్ఓ లతో ఇంటింటికీ తిరిగి జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఎస్.ఖీమ్యా నాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు ఆనంద్ కుమార్, మధుసూధన్, చీఫ్ ప్లానింగ్ అధికారి పి.బి.శ్రీనివాస చారి, జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, పర్యవేక్షకులు శ్రీకాంత్, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రాణం విలువైనది.. పోతే తిరిగిరాదు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రమేష్

నవతెలంగాణ - వీర్నపల్లి : ప్రాణం విలువైనది ప్రాణం పోతే తిరిగిరదని ఎస్ఐ రమేష్ తెలిపారు. వీర్నపల్లి మండలం కేంద్రం మాడల్ స్కూల్‌లో నేసినల్ రోడ్డు భద్రతా మాసొత్సవాల్లో భాగంగా ఎస్ఐ రమేష్ రోడ్డు భద్రతా నియమాల గురించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్ పాల్ విశ్వనాథం, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఎన్గల్‌లో 'ఎలుగు' సంచారం!

భయాందోళనలో గ్రామస్తులు

నవతెలంగాణ - చందుర్తి : ఎన్గల్ గ్రామ గ్రామ శివారులో ఎలుగు బంటీ సంచరిస్తున్నట్లుగా పశువుల కాపరులు వాపోతున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన కొందరు గొర్ల కాపరుల కు గ్రామ శివారులో కనపడినట్లుగా తెలిపారు. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురౌతున్నారు. దీనిపై అటవీశాఖ అధికారులను వివరణ కోరగా ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.

సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

అజ్మీరా భాస్కర్ నాయక్



అజ్మీరా భాస్కర్ నాయక్

నవతెలంగాణ - గంభీరావుపేట : గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జన్మదినం (ఫిబ్రవరి 15)ను సెలవు దినంగా ప్రకటించి, జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షులు అజ్మీరా భాస్కర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 13 శాతం గిరిజనులు కలరని, గత ప్రభుత్వంలో కేవలం హైదరాబాదు మహా నగరంలో బంజారా భవన్ కట్టించారని, అన్ని జిల్లా కేంద్రాలలో బంజారా భవనాలను నిర్మించేందుకు కృషి చేయాలన్నారు.

విద్యార్థులతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ



విదార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ముస్తాబాద్ ఎస్సై శేఖర్ రెడ్డి

నవతెలంగాణ - ముస్తాబాద్ : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యార్థులచే రహదారి భద్రత ప్రతిజ్ఞ శుక్రవారం ఎస్సై శేఖర్ రెడ్డి చేయించారు. అంతకుముందు విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలతో పాటు వాహనాలు ఏ వైపున నడపాలి, ఎంత స్పీడ్‌తో నడపాలి, వాహనం నడిపే ప్రతి ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్ ఎలా పొందాలి, రహదారిపై కాలినడకన నడిచేటప్పుడు ఏవైపు నుండి నడపాలి, నిబంధనలను ఉల్లంగించి నడిపితే ఎలాంటి శిక్షలు ఉంటాయో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్‌తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కంచర్ల రవి గౌడ్

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : విద్యార్థులకు సరైన సమయంలో సరిపడా బస్సులు నడపాలని కోరినందుకు విద్యార్థి సంఘాల నాయకులపై దురుసుగా ప్రవర్తించిన సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల పాత బస్టాండ్‌లో బస్సులు సమయానికి రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యాసంస్థలకు వెళ్లడానికి బస్సు ఎక్కిన విద్యార్థులను ఆర్టీసీ డిపో మేనేజర్ దింపి వేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న బస్సులోనే వెళ్లాలని లేకపోతే నడుచుకుంటూ వెళ్లాలని విద్యార్థుల పట్ల చులకనగా మాట్లాడారన్నారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు అక్కడికి వెళ్లి ఇదేమిటని ప్రశ్నించిన వారిపై డిపో మేనేజర్ దురుసుగా ప్రవర్తిస్తూ కేసులు నమోదు చేస్తామని బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అధికారులు స్పందించి సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే డిపోను ముట్టడించేందుకు ప్రయత్నిస్తామని హెచ్చరించారు. నాయకులు మట్టే శ్రీనివాస్, జగన్ నవీన్, సందీప్, స్వామి,నరేష్ పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదాయం పెరిగితే.. కేటాయింపులో కోత ఎందుకు..?

- పెట్టుబడీదారులకు ఊతమిచ్చి.. సామాన్యుడి నడ్డి విరిచిన కేంద్ర బడ్జెట్
- భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్



మాట్లాడుతున్న బీమార్మి నాయకులు

నవతెలంగాణ - కొనరావుపేట : కేంద్ర బడ్జెట్ పూర్తిగా ఎలక్షన్స్ దృష్టిలో పెట్టుకొని తయారు చేసిన బడ్జెట్ అని, సామాన్యులకు ప్రయోజనం లేని బడ్జెట్ అని, పెట్టుబడి దారులకి లాభం చేకూర్చేదిగా ఉందని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని సుద్దాల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక వైపు ఆదాయం పెరిగిందని చెబుతూనే వ్యవసాయం రంగం, దాని అనుబంధ రంగాలపై కోతలు పెట్టిందన్నారు. యూరియా సబ్సిడీలో వేల కోట్లు, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 4 వేల కోట్లు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో రూ.7వేల కోట్లు, ఉన్నత విద్య రంగం 9.624 కోట్లు, ఇటువంటి అనేక రంగాలలో ఆరోగ్య ఎస్సీ,ఎస్టీ వెల్ఫేర్, ఆహార సామాజిక భద్రతా వంటిలో కోతలు విధించిందన్నారు. ఆదాయం పెరిగితే కేటాయింపు ఇంకా పెంచాలి గానీ తగ్గించడం అంటే మిగితా ఆదాయాన్ని ఎటు వైపు మళ్లించారని ప్రశ్నించారు. పదేండ్లలో నిత్య అవసరాలు ధరలు పెరుగుతూ పేద ప్రజలకు పెను భారంగా మారాయన్నారు. ఈ బడ్జెట్‌లో సామాన్యులకు లాభం లేకుండా, పెట్టుబడి దారులకు లక్షల కోట్లలో రాయిలిచ్చి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నదన్నారు. ప్రజా వ్యతిరేక విధానలను అవలంబిస్తూ , మతం ముసుగులో రాజకీయం చేస్తూ, దేశాన్ని మొత్తంన్ని అమ్మేస్తున్నా బీజేపీ ప్రభుత్వాన్ని రాన్నున ఎన్నికల్లో ప్రజలంతా ఏకం ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాసం బాబు, రంజిత్, ఓద్యారపు నిఖిల్, దొబ్బల ప్రశాంత్, రాజు, సుమన్, కార్తిక్, జీవన్, వంశీ పాల్గొన్నారు.

పీఆర్టీయూ టీఎస్ మండలశాఖ అధ్యక్షుడిగా అశోక్



అధ్యక్షుడు అశోక్ | ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం : పీఆర్టీయూ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ ఇబ్రహీంపట్నం మండల శాఖ అధ్యక్షుడిగా జేఎన్ వెంకట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా వి.వెంకటేశ్వరరావు, పీఆర్టీయూ టీఎస్ మండల అసోసియేట్ అధ్యక్షులుగా మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ దాసరి నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జగిత్యాల జిల్లా అధ్యక్షులు యాళ్ళ అమర్నాథ్ రెడ్డి, కార్యదర్శి బోయినపల్లి ఆనందరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధు, కోదండపాణి, రాజేందర్, శ్రీనివాసులు, ఇబ్రహీం పట్నం కార్యవర్గ సభ్యులు చిన్నయ్య, జనార్ధన్, రమాకాంత్, శ్రీధర్, జగన్మోహన్, రాజేందర్, సందీప్, రమేష్, లింగయ్య పాల్గొన్నారు.

కొలువుదీరిన ప్రత్యేక అధికారులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం : సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలో ఉన్న గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యాల యాల్లో ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. డబ్బా గ్రామ ప్రత్యేకాధికారి పశువైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు, మాజీ ఉపసర్పంచ్ భూస రాజేశ్వర్ సన్మానించారు. కార్యక్రమంలో రాడే శ్రీనివాస్, ఏఎన్ఎం మహేశ్వరి, అంగన్వాడీ టీచర్ గంగమని, ఆశా కార్యకర్తలు జ్యోతి, రజిత, కారోబార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులు

నవతెలంగాణ-మల్యాల : మల్యాల మండలంలోని ముత్యంపేట, మ్యాడంపల్లి గ్రామాలలో ఎంపీడీఓ వెంకటేష్ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా విధులు చేపట్టారు. నూకపల్లి, పోతారం గ్రామాల్లో ఏఈ జ్ఞానేశ్వర్ గొల్లపల్లి, పోతారం, మానాల, ఇబ్రహీం వివిధ గ్రామ పంచా యతీలలో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులను శుక్రవారం బాధ్యతలు చేపట్టగా పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచులు స్వాగతం పలుకుతూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

సమ్మక్క-సారలమ్మ జాతర కోసం పటిష్ట ఏర్పాట్లు

సుల్తానాబాద్ సీఐ కర్రె జగదీష్

నవతెలంగాణ -సుల్తానాబాద్ రూరల్



ప్రశాంతమైన వాతావరణంలో సమ్మక్క-సారలమ్మ జాతర వేడుకలు జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని జాతర కోసం పటిష్ట ఏర్పాట్లు చేయడం జరుగుతుందని సుల్తానాబాద్ సీఐ కర్రె జగదీష్ అన్నారు. గురువారం సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల్లా గ్రామంలో నిర్వహించే జాతర పరిసరాలను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ మండలంలో అతిపెద్ద జాతరగా పేరుగాంచిన జాతరలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు సకల ఏర్పాట్లు చేపట్టాలని వాగులో నీరు అధికంగా ఉన్న దృష్ట్యా ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి కాబట్టి ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై విజేందర్, ఉత్సవ కమిటీ చైర్మన్ నరసయ్య గౌడ్,ఈవో సాయి శంకర్ కమిటీ సభ్యులతో పాటు పలువురు పాల్గొన్నారు.

రామగుండం రైల్వే స్టేషన్ మేనేజర్‌కు సమ్మె నోటీసు

నవతెలంగాణ-గోదావరిఖని:



సమ్మె నోటీసు అందజేస్తున్న ఎం.రామాచారి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా,రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న జరిగే అఖిల భారత సమ్మెలో రామగుండం రైల్వే కాంట్రాక్టు కార్మికులు పాల్గొంటారని సీఐటీయూ అనుబంధ తెలంగాణ రైల్వే కాంట్రాక్ట్, క్యాజువల్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలోశుక్రవారం రామగుండం స్టేషన్ మేనేజర్‌కు సమ్మె నోటీసు అందించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారిఎం.రామాచారి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తుందన్నారు. కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని, కార్మికులను కట్టు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, తదితర డిమాండ్లతో జరిగే దేశ వ్యాప్త సమ్మెలో రామగుండం రైల్వేకాంట్రాక్ట్ కార్మికులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బొంకూరి మహేష్ పాల్గొన్నారు.

బచ్పన్ అకాడమిక్ హైట్స్ స్కూల్ యాజమాన్యంపై

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-గోదావరిఖని:



నిర్మాణం పూర్తికాని భవనాల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్, ప్రాణాలతో చెలగాటమాడుతున్న బచ్పన్ అకాడమిక్ హైట్స్ స్కూల్ యాజమాన్యంపై వెంటనే కఠిన చట్టపర చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య ఆధ్వర్యంలో మండల విద్యా వనరుల (సీసీవో) క్రాంతి కుమార్‌కి ఫిర్యాదు చేయడం జరిగిందని జిల్లా అధ్యక్షుడు కొంటుసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో విద్యను కేవలం ఒక వ్యాపారంగా ఎంచుకొని విచ్చలవిడిగా ఎటువంటి పూర్తి స్థాయిలో అనుమతులు పొందకుండా ఇక్కడి తల్లిదండ్రులను మాయమాటలతో మెప్పించి వారి యొక్క పిల్లల భవిష్యత్తుతో జీవితాలతో ఆటలాడుతున్నారని వారు తెలిపారు. ఎన్టీపీసీ కృష్ణనగర్‌లోని బచ్పన్ అకాడమిక్ హైట్స్ స్కూల్ యాజమాన్యం ఒక అడ్రస్ పేరుతో అనుమతులు తీసుకొని ఇదే ప్రాంతంలో హౌస్ నెంబర్ 5-6-కెఆర్0016 జిఫ్లస్2 నెంబర్ గల భవనంలో, మల్కాపురంలో సింధూర కాలేజ్ పక్కన గల నూతనంగా నిర్మాణం అవుతున్న భవనంలో పాఠాలు బోధించడాన్ని వారు తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

కంటిన్యూస్ మైనర్‌ల పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-గోదావరిఖని:



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జీఎం

సింగరేణి సీఎండీ ఎన్.బలరాం, డైరెక్టర్ ఈఅండ్ఎం డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ అండ్‌పా ఎన్‌వీకే.శ్రీనివాస్, డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జి.వెంకటేశ్వర రెడ్డి అన్ని ఏరియాల జీఎంలతో కంటిన్యూస్ మైనర్ల ద్వారా బొగ్గు ఉత్పత్తి, యంత్రాల పని తీరు, లక్ష్యాల సాధనకు చేపట్టాల్సిన ప్రణాళికల గూర్చి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కంటిన్యూస్ మైనర్‌ల ద్వారా నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు చేపట్టవలసిన ప్రణాళికలు, కంటిన్యూస్ మైనర్ యంత్రాల పనితీరు, బొగ్గు కటింగ్ సమయంలో చేపట్టవలసిన రక్షణ చర్యలు తదితర విషయాల గురించి చర్చించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ఏజంట్-11 గ్రూప్ చిలుక శ్రీనివాస్, జాయి మైనింగ్ సర్వీసెస్ ప్రాజెక్ట్ అధికారి శుక్లా, జెన్‌కో ప్రాజెక్ట్ అధికారి రాకేష్ పాల్గొన్నారు.

పదవీ విరమణ తర్వాత పాఠశాలకు వచ్చిన ఉద్యోగి

నవతెలంగాణ-ధర్మారం



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కటికనపల్లి గ్రామంలో1965-67సంవత్సరాలలో ప్రాథమిక పాఠశాలలో రాపర్తి వెంకటేశ్వర్లు ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించి 1997 సంవత్సరంలో పదవీ విరమణ పొంది ప్రస్తుతం కరీంనగర్‌లో నివాసముంటున్న రాపర్తి వెంకటేశ్వర్లు శుక్రవారం తాను బోధించిన పాఠశాలకు వచ్చాడు.ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులతో, విద్యార్థులతో ముచ్చటించారు.17 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా మరో 17సంవత్స రాలు ప్రమోషన్ పొంది ఆర్ట్& క్రాఫ్ట్ టీచర్‌గా పనిచేశానని చెప్పారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సూర్యోదయం కన్నా ముందే నిద్రలేచి ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను చదవాలన్నారు, వేకువజాములో చదివితే విషయాలు చక్కగా గుర్తుంటాయన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురకంటి ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు నూతి మల్లయ్య, నిమ్మల రేవతి, పొన్నం సంధ్య, విశ్రాంత ఉపాధ్యాయులు రాపర్తి వెంకటేశ్వర్లును శాలువాతో సన్మానించారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు

నవతెలంగాణ-ఓదెల



ఓదెల మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి రాజ్య ఆధ్వర్యంలో10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం 6 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 120 మంది పదవ తరగతి విద్యార్థులకు మార్చి18వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయుటకై ప్రేరణ తరగతులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల తహసీల్దార్ యాకన్న, ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీడీవో సత్తయ్య హాజరయ్యారు. తహసీల్దార్ యాకన్న మాట్లాడుతూ విద్యార్థులు అందరూ పరీక్షలు బాగా రాయాలని విద్యార్థులందరూ 10 జీపీఏ సాధించి పెద్దపల్లి జిల్లాలోనే ఓదెలను ఉత్తీర్ణతలో ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేయాలన్నారు.ఎంపీడీవో సత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదివి ఉత్తీర్ణత సాధించి జీవితంలో విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌వో వై రమేష్, జడ్పీహెచ్ఎస్ ఓదెల హెచ్ఎం వి.పద్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రైజింగ్ సన్ విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ- పెద్దపల్లి టౌన్



జనవరి 14న గోదావరిఖనిలోని డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల 3, 4వ తేదీలలో మెదక్ జిల్లా తూప్రాన్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల కు రైజింగ్‌సన్ పాఠశాల విద్యార్థులు ఫర్హా, శ్రేష్టలు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తగురం తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సయీద్ అహ్మద్, ప్రధానోపాధ్యాయులు హకీంఖాన్ విద్యార్థులను అభినందించారు.

60 రోజులు 140 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తే లక్ష్యం

- రోజుకు 2.3 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలి
- ఏరియా జీఎంలకు సంస్థ సీఎండీ ఎన్.బలరాం దిశా నిర్దేశం

నవతెలంగాణ-గోదావరిఖని:

దేశ, రాష్ట్ర ఇంధన అవసరాలను తీర్చేందుకు వీలుగా ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని ఎట్టి పరిస్థితుల్లోనూ సాధిం చాల్సిందేనని దీని కోసం అందరూ సమిష్టిగా ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బొగ్గు ఉత్పత్తి పురోగతి, నూతన ప్రాజెక్టులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్ గరిష్టంగా ఉంటుందని, ఈ నేపథ్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలు నిరాటంకంగా విద్యుత్ ఉత్పత్తి చేయడానికి వీలుగా సింగరేణితో ఒప్పందం ఉన్న అన్ని థర్మల్ కేంద్రాలకు తగినంతగా బొగ్గు రవాణా చేయాలని స్పష్టం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని చేరుకోవడానికి మిగిలిన రెండు నెలల కాలంలో ఇంకా 140 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాల్సిన అవసరం ఉందన్నారు. రోజుకు కనీసం 2.3 లక్షల టన్నులకు తగ్గకుండా బొగ్గు ఉత్పత్తి చేస్తే నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 344 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించామని, గత ఏడాది తో పోల్చితే 4 శాతం అధికమన్నారు. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 60 రోజుల్లో నిర్దేశిత లక్ష్యాలను సాధించడానికి వీలుగా రోజుకు 15.6 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని, తద్వారా బొగ్గు ఉత్పత్తి పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. నూతన ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తూ ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల నుకున్న ఒడిశాలోని నైనీకోల్ బ్లాక్, కొత్తగూడెం ఏరియాలోని వీకే కోల్‌మైన్, బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఓసీ, ఇల్లందు ఏరియాలోని జేకే ఓసీ గని ప్రారంభానికి కావాల్సిన అటవీ, పర్యావరణ అనుమతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీక్షలో సంస్థ డైరెక్టర్లు ఈఅండ్ఎం డి.సత్యనారాయణరావు, ఆపరేషన్స్ ఎన్‌వీకె శ్రీనివాస్, ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జి.వెంకటేశ్వర రెడ్డి, ఈడీ కోల్ మూవ్‌మెంట్ జె.అల్విన్, వివిధ విభాగాల జీఎం ఎం.సురేష్, జక్కం రమేష్, జి.దేవేందర్, అన్ని ఏరియాల జీఎంలు, కార్పొరేట్ జీఎంలు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న సీఎండీ, డైరెక్టర్లు

అవిశ్వాసంపై 16న ప్రత్యేక సమావేశం

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-మంథని:

పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్ లపై గురువారం మెజారిటీ కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాసం నోటీసుపై ఈనెల 16న 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేయగా, మంథని రెవెన్యూ డివిజనల్ అధికారిని ప్రిసైడింగ్ అధికారిగా నియమించినట్టు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం ప్రొసీడింగ్ కాపీని జారీచేశారు. ఈ మేరకు మంథని మున్సిపల్ పాలక వర్గానికి నోటీసులు అందించే విధంగా మంథని మున్సిపల్ కమిషనర్ జి.మల్లికార్జున స్వామికి జిల్లా అధికారులు సమావేశం నోటీసు ప్రతులను అందించారు.

కనగర్తి రోడ్డు నాణ్యతపై విచారణకు ఆదేశం

నవతెలంగాణ-ఓదెల



ఓదెల మండలం కనగర్తి గ్రామంలో జేఎస్ఆర్ నిర్మాణ సంస్థ వారు వేసిన తారు రోడ్డు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై కనగర్తి గ్రామానికి చెందిన చిటికేసి సతీష్ కుమార్ డిసెంబర్ 22న హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదుకు స్పందించిన సీఎం కార్యాలయం విచారించి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం తదుపరి చర్యలో భాగంగా కనగర్తి రోడ్డు నాణ్యతను పరిశీలించి వారం రోజులలోపు నివేదిక సమర్పించాలని జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్‌ను కోరుతూ జనవరి 12 2024న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుడు చిటికేసి సతీష్ కుమార్ మాట్లాడుతూ కనగర్తి గ్రామంలో రోడ్డు నిర్మాణంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించలేదని, రోడ్డుకు అడ్డంగా మధ్యలో నిలబడిన ఎలక్ట్రిక్ స్తంభాలను సైతం తొలగించకుండానే నిర్మాణం చేశారని ఆరోపించారు. అంతేకాకుండా సైడ్ డ్రెయిన్లు నిర్మించకుండానే రోడ్డు వేసినందున వర్షపు నీరు పలువురు ఇండ్లలోకి ప్రవేశించి నష్టం జరిగిందన్నారు.ఇప్పటికైనా విచారణ అధికారులు ఎంబీ రికార్డులలో నమోదు చేసిన మేరకు నాణ్యత ఉందో లేదో తెలుసుకోవడానికి గ్రామస్థుల సమక్షంలో విచారించాలని కోరారు.

ఉపాధి హామీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-రామగిరి



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అవిర్భావ దినోత్సవం వేడుకలు రత్నాపూర్ గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధి కూలీల చేత కేక్ కట్ చేసి స్వీట్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి జిల్లా అంబుడ్స్ పర్సన్ శరత్‌కుమార్, ఎంపీడీవో ఇనుముల రమేష్, ఇన్‌చార్జీ ఏపీడీ అమృత్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సందెవేన జ్యోతి కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ను సన్మానించిన పాత్రికేయులు

నవతెలంగాణ-రామగిరి



రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావును శుక్రవారం రామగిరి మండల పాత్రికేయులు ఘనంగా సన్మానించారు. ఐదేళ్ల కాలంలో సర్పంచ్ చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాత్రికేయులు బుర్ర తిరుపతి, పొన్నం శ్రీనివాస్, చిందం రమేష్, ఊట్ల తిరుపతిరెడ్డి, సూత్రం శ్రీధర్, చింతం కిరణ్ కుమార్, చిలుక సురేష్, పోలు మధుకర్ పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

తాజా మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ

నవతెలంగాణ-రామగిరి

మండలం రత్నాపూర్ గ్రామాభివృద్ధి అందరి సహకారంతోనే జరిగిందని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అన్నారు. శుక్రవారం గ్రామపంచాయతీ ఆవరణలో సెక్రటరీ పెండ్లి రమ్య,ఎంపీటీసీధర్మల రాజసంపత్-శ్యామల అధ్వర్యంలో పాలకవర్గంను సన్మానించారు. ఐదు సంవత్సరాల కాలంలో గ్రామ అభివృద్ధిలో పాలకవర్గం పూర్తిగా చొరవ చూపిందని ఎంపీటీసీ సంపత్ అన్నారు. సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు, ఉప సర్పంచ్ దుబ్బాక సత్య రెడ్డి, వార్డ్ సభ్యులు కొవ్వూరి సురేష్, ఉడుత శంకర్, బొంగురాల రవి, కుంట సదాలక్ష్మి గెల్లు చామంతి కృష్ణ, పాల్గొన్నారు.

డీపీవోకు సమ్మె నోటీసు ఇచ్చిన జీపీ కార్మికులు

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్



వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లా యిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా కార్మికులు ఫిబ్రవరి 16న సమ్మెలో పాల్గొంటామని శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారికి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు ప్రజావ్యతిరేక విధానాలకు ప్రతిఘటనగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె చేయాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని, ఈ సమ్మెలో గ్రామపంచాయతీ కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లాలోని వివిధ గ్రామాలలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు 3,4 నెలల నుంచి పెండింగులో ఉన్నాయని, గత సంవత్సరం జరిగిన సమ్మె కాలపు వేతనాన్ని కూడా ఇప్పటివరకు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ. కాజా, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, వివిధ మండలాల నాయకులు, అశోక్, నరేష్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై బాలికలకు అవగాహన

నవతెలంగాణ -సుల్తానాబాద్ రూరల్



పోస్టర్ చూపిస్తున్న విద్యార్థులు

మహిళ సాధికారిత కేంద్రం అధ్వర్యంలో బేటీ బచావో- బేటీ పడావోలో భాగంగా గర్రెపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో బాలికలకు అవగహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సాధికారిత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ సుచరిత, సఖి స్వప్న పాల్గొని మాట్లాడుతూ బాలికల హక్కులు,లింగ వివక్షత,బాల్య వివాహాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత, అధ్యాపకులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వార్డ్ మెంబర్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-జూలపల్లి



జూలపల్లి మండల కేంద్రంలోని ఎస్సీకా లనీ చెందిన 7 వార్డు సభ్యుడు మాను మండ్ల సంపత్‌కు ఆయన సేవలను గుర్తిస్తూ వార్డుకు చెందిన ప్రజలు ఘనంగా సన్మానించారు. మానుమండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ వార్డు నెంబర్‌గా గెలిచి ఐదు సంవత్సరాలు అవుతున్న తరుణంలో కాలనీలో ఎన్నో సీసీ రోడ్లు డ్రైనేజీలు మొదలగు అభివృద్ధి పనులను చేశానన్నారు. ఈ కార్యక్రమంలో నెరువట్ల హనుమయ్య నెరువట్ల తేజు రాజు, మదనపల్లి బుచ్చయ్య, బెజ్జంకి సంతు, పాల్గొన్నారు.

వరి, మొక్కజొన్న పంటల పరిశీలన

నవతెలంగాణ-జూలపల్లి



జూలపల్లి మండలం కుమ్మరి కుంట గ్రామంలో మండల వ్యవసాయ అధికారిణి ప్రత్యూష వరి పంట సందర్శించారు. అమె మాట్లాడుతూ వరి పొలంలో ఎక్కువగా మొగి, రెక్కల పురుగు ఉధృతంగా ఉన్నందున నివారణ చర్యలుగా క్లోరోతరానిప్రోల్ గుళికలు 3G వి కాని, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ ఎకరానికి 8 కిలోలు చల్లుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీవాణి, రైతులు ఆశాడపు కొమురయ్య మ్యాకల కనుకయ్య, కొంకటి కళ, కొంకణి అజయ్ రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్లకై ప్రచారం

నవతెలంగాణ-మంథని



మంథని డివిజన్ పరిధిలోని ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ విద్య కోసం మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కళాశాల అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. ఈ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని డిగ్రీ అడ్మిషన్ల ముందస్తు ప్రచారాన్ని ప్రారంభిస్తున్నామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ తాహేర్ హుస్సేన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కృష్ణ, అకాడమిక్ కోఆర్డినేటర్ పరిశయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-మంథని



చెక్కులు అందజేస్తున్న నాయకులు

ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చెక్కులను పంపిణీ చేశారు. శుక్రవారం మంథని పట్టణంలోని ఎస్ఎల్‌బీ గార్డెన్‌లో భారత రాష్ట్ర సమితి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ స్పీకర్ మధుసూదన చారి,మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్,పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్,బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేతుల మీదుగా మహాముత్తారం మండలం మాదారం గ్రామానికి చెందిన గంప రాజు, మంథని పట్టణానికి చెందిన ఎడ్లశంకర్, మహాదేవ్‌పూర్ మండలం బొమ్మపూర్ గ్రామానికి చెందిన పీక మల్లయ్య, మద్దులపల్లి గ్రామానికి చెందిన బాల్నే రాజయ్య, కుటుంబ సభ్యులకు పార్టీ ప్రమాద భీమా రెండు లక్షల రూపాయలను చెక్కులను అందజేశారు.

తెలంగాణకు ద్రోహం చేసిందే కాంగ్రెస్ పార్టీ

మాజీ స్పీకర్ మధుసూదనాచారి

నవతెలంగాణ-మంథని

కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం ద్రోహం అని, తెలంగాణకు ద్రోహం చేసేందే కాంగ్రెస్ పార్టీ అని మాజీ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. మంథని పట్టణంలోని ఎస్ఎల్బీ గార్డెన్‌లో మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ ఆధ్వర్యంలో స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోగా, తెలంగాణలో కరెంట్ కోతలు మొదలయ్యాయన్నారు.కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ మంథనిలో కాంగ్రెస్ పార్టీ కోట్లు ఖర్చు చేసినా 72 వేల ఓట్లు బీఆర్ఎస్‌కు వచ్చాయంటే మామూలు విషయం కాదని,ఇది ప్రజా విజయమని అన్నారు. కోరుకంటి చందర్ మాట్లాడుతూ గడపగడపకు సంక్షేమ పథకాలు చేరినా విజయం సాధించలేక పోయామని, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ప్రజలకు వివరించడంలో విఫలం అయ్యామని పేర్కొన్నారు. పుట్ట మధు మాట్లాడుతూ మంథనిలో ఒకే కుటుంబ పాలన కొనసాగుతుందని, కాంగ్రెస్ పార్టీ నోట్ల సంచులతో కోట్లు పంచి అధికారంలోకి వచ్చిందన్నారు. పార్లమెంట్ ఎన్నికలలోపే నన్ను చంపాలని చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మండలాల నాయకులు, ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై ఐఎన్‌టీయూసీ వినతి

నవతెలంగాణ-గోదావరిఖని:



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో ఉద్యో గులు, మహిళా ఉద్యోగులు ఎదు ర్కొంటున్న పలు సమస్యలపై జీఎంకు వివరిస్తూ ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు కచ్చకాయల సదానందం ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు శుక్రవారం వినతి పత్రాన్ని సమర్పించారు. అదేవిధంగా డీజీఎంకు పర్సనల్‌కు కూడా సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీరటి సాగర్, శ్రీనివాస్, మైస బాబు, అనిల్, పోతరవేన సమ్మయ్య తదితరులున్నారు.

6న పార్లమెంట్ సన్నాహక సమావేశం

- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని:



6నఉదయం11 గంటలకు ఎన్టీపీసీలోని లక్ష్మీ నరసింహగార్డెన్స్‌లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి పార్లమెంట్ సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ తెలిపారు. గోదావరిఖని చౌరస్తా సమీపంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈనెల 6న జరిగే సమావేశానికి రాష్ట్ర మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామ, పట్టణ, డివిజన్ల అధ్యక్షులు, అధికార ప్రతినిధులు, మాజీ సర్పంచులు, కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ నాయకులు కార్యకర్తలను అధిక సంఖ్యలో తరలించి, సమావేశం విజయవంతానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మూల విజయా రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు పెంట రాజేష్, కుమ్మరి శ్రీనివాస్, నాయకులు గోపు ఐలయ్య యాదవ్, మెతుకు దేవరాజ్, అచ్చవేణు, నారాయణదాసు మారుతి, బొడ్డుపల్లి శ్రీనివాస్, జాహెద్ పాషా పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మె వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-గోదావరిఖని:



వాల్ పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న టీఎన్‌టీయూసీ నాయకులు

గోదావరిఖనిలోని టీఎన్‌టీయూసీ కేంద్ర కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బోసు ఆదేశాల మేంకు పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు ముదిగంటి దామోదర్ రెడ్డి అధ్యక్షతన సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండలు ఈ నెల 16న జరగబోవు దేశవ్యాప్త సమ్మె వాల్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ పలు డిమాండ్లపై ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను అన్ని కార్మిక సంఘాలు ఒకే తాటిపైకి వచ్చి భారతదేశ గ్రామీణ బంద్‌ను, దేశవ్యాప్త సమ్మె పిలుపును విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత శిక్షణ

నవతెలంగాణ-గోదావరిఖని క్రైం:



మాట్లాడుతున్న నాబార్డ్ ఏజీఎం

స్పందన సేవా సొసైటీ, నాబార్డ్ ఆధ్వర్యంలో సారీ రోలింగ్, పాలిషింగ్, డ్రైక్లీనింగ్‌లో ఉచిత శిక్షణ స్థానిక చంద్రబాబు కాలనీలో శుక్రవారం ప్రారంభం అయ్యింది. ఈ మేరకు స్థానిక వీఎచ్‌పీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశానికి నాబార్డ్ ఏజీఎం ఎస్.జయప్రకాష్,స్పందన ఎన్జీవో సేవా సంఘం అధ్యక్షురాలు, టీఎస్‌సీపీస్ ఆర్ మెంబర్ ఎ.శోభారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినపుడు ఆర్థిక స్వావలంబన జరుగుతుందని, వారికి ఈ సారీ రోలింగ్, పాలిషింగ్, డ్రైక్లీనింగ్ నేర్పించడమే కాక వారికి వివిధ బ్యాంకులు లింకేజీ ద్వారా రుణాలు ఇప్పించడం జరుగుతుందని, తద్వారా వారు ఉపాధి పొంది ఆర్థికంగా మెరుగు పడుతారని అన్నారు.25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యోగాగురువు అన్నపూర్ణ మాతాజీ, ఫ్యాషన్ డిజైన్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ వరలక్ష్మీ, పాల్గొన్నారు.

బేటి బచావో.. బేటి పడావోపై అవగాహన

నవతెలంగాణ-ముత్తారం:



ముత్తారం మండలం అడవీ శ్రీరాంపూర్ గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి జనగామ రాజనర్సు బృందం పరిసరాల పరిశుభ్రత, డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలు, ఆడపిల్లలని పుట్టనిద్దాం...ఎదగనిద్దాం... చదవనిద్దాం, బేటీ బచావో బేటి పడావోపై పాటల రూపంలో శుక్రవారం అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రభుత్వ పథకాలపై, యువత పెడదారి పట్టకుండా మంచి మార్గంలో నడవాలని, యువత యాక్సిడెంట్లలో, అనారోగ్యాలతో చాలా మంది మరణిస్తున్నారని, తల్లిదండ్రు లకు తీరని దుఃఖాన్ని, నేటి యువత రేపటి దేశ భవిత అని యువతరం గ్రహించాలని, తల్లిదండ్రులు కన్నకలలు నిజం చేయాలని పాటల రూపంలో అవగాహన కల్పించా రు.కార్యక్రమంలో సాంస్కృతిక కళాకారులు ఈదునూరి పద్మ, కొండ్ర వెంకటేశ్వర్లు, ఇల్లందుల మల్లేష్, జిన్న రమ, సలేంద్ర రాజన్న, దీకొండ శ్రావణ్, కన్నూరి రేణుక పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ-ముత్తారం:



ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్న అధికారులు

ముత్తారం మండలం మైదంబండ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో ఎంపీడీవో కలికోట శ్రీనివాస్, ఎంపీ వో భైరి వేణు మాదవ్, మాజీ సర్పంచ్ ఎర్రం శారద సదానందం, ఎంపీటీసీ బియ్యాని శ్యామల సదానందం, కార్యదర్శి రామ చంద్రం, గ్రామస్తులు న్నారు.

జాతీయ ఉపాధి హామీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవ తెలంగాణ-సుల్తానాబాద్ రూరల్

సుల్తానాబాద్ మండలంలోని బొంతకుంటపల్లి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సికొండ అంజలి, కారోబార్ ఆసరి రమేష్, ఫీల్డ్‌అసిస్టెంట్, న్యాతరి రాజేశ్వరి, అంగన్వాడీ టీచర్ ఏరా బెల్లి శోభ, ఆశా వర్కర్ మంచి కట్ల కవిత, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

దళితబంధు రెండో విడుత నిధులు మంజూరు చేయాలి

నవతెలంగాణ - ఇల్లందకుంట


వినతిపత్రం ఇచ్చిన లబ్దిదారులు

దళితబంధు రెండవ విడుత నిధులు మంజూరు చేయాలని ఎంపీడీఓకు శుక్రవారం లబ్దిదారులు వినతిపత్రం ఇచ్చిరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021 సంవత్సరం లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో మొదటి విడుతగా 5లక్షలు, రెండవ విడుతగా 5లక్షలు ఇస్తామని కలెక్టర్ చెప్పారన్నారు. కాని రాష్ట్రంలో ఎన్నికలు రావడంతో తాత్కాలికంగా నిలిపివేరని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోపే రెండవ విడత పూర్తిస్థాయిలో ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా 20వేల దళిత కుటుంబాలు ధర్నాలు, నిరాహార దీక్షలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కొలుగూరి నరేష్, రామంచ రాకేష్, కలకోట సారయ్య, పార్లపల్లి రవీందర్, ఆకనపల్లి రీటా, పర్లపెల్లి శంకర్, ప్రమోద్, ఆకనపల్లి చంటి, సప్పిడి సతీష్, గాజుల శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

భూపోరాట నాయకులపై అదనపు కేసులు బనాయింపు..?

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

నవతెలంగాణ - కరీంనగర్


మాట్లాడుతున్న సీపీఐ(ఎం) నాయకులు

నిలువ నీడలేని పేదలకు ఇండ్ల జాగా కావాలని కోరుట్ల, జగిత్యాల ప్రాంతాలలో ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసే పోరాటానికి నాయకత్వం వహించిన 11 మంది నాయకులపై సెక్షన్లను బనాయించి కరీంనగర్ జైలుకు పంపడం ఆందోళన కలిగించే అంశం అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ, బి.ప్రసాద్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి అన్నారు. శుక్రవారం ములాకత్‌లో 18రోజుల నుంచి కరీంనగర్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. భూ పోరాట ఉద్యమ, ప్రజా ఉద్యమాల సందర్భంగా నాయకులపై పెట్టిన కేసులు అన్ని ఎత్తివేస్తామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారు కానీ ఆచరణలో స్థానికంగా ఉన్న మెట్‌పల్లి డీఎస్పీ, జగిత్యాల డీఎస్పీ ఇద్దరు కలిసి జైల్లో ఉన్న నాయకులకు బెయిల్ రాకుండా అడ్డుకునేందుకు కొత్తగా అదనపు సెక్షన్లతో ఎఫ్ఐఆర్ యాడ్ చేయడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందనే అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. నాయకులపై సెక్షన్లను కొత్తగా కలిపి ఎఫ్ఐఆర్ బుక్ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. నాయకులను బయటి రాకుండా జైల్లోనే నిర్బంధించే చర్యలకు పోలీస్ యంత్రాంగం ప్రయత్నం చేస్తుందని, ఒకవేళ బయటికి వస్తే వారిపై పీడీ యాక్ట్ ఓపెన్ చేస్తామని పోలీస్ యంత్రాంగం బెదిరింపు చర్యలకు దిగడంతో పాటు జగిత్యాల, ఫిబ్రవరి నెల మొత్తం పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ప్రకటించడం ప్రజాస్వామ్య హక్కులకు, మానవ హక్కులకు పొంచి ఉన్న ప్రమాదంగా తెలిపారు. ప్రజా సమస్యపై ప్రదర్శన, ర్యాలీలు, సభలు పెట్టకూడదని అనుమతి లేకుండా సభలు పెడితే కేసు పెడతామని ప్రకటించడం పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించడమే అన్నారు. తక్షణమే జిల్లా ఎస్పీ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జైల్లో ఉన్న ప్రధాన నాయకుడు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ ఇప్పటికే హార్ట్ సర్జరీ అయిన వ్యక్తి అని, వికలాంగుడైన జగిత్యాల జిల్లా సీపీఐ(ఎం) కార్యదర్శి తిరుపతి నాయక్‌ను, చంటి పిల్లలకు తల్లులుగా ఉన్న మహిళలను జైల్లో నిర్బంధించటం సరైన చర్య కాదన్నారు. ప్రభుత్వ రెవిన్యూ అధికారులు, పోలీసు యంత్రాంగం భేషజాలకు పోకుండా పేదల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. తక్షణమే కొత్తగా యాడ్ చేసిన సెక్షన్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వివిధ పోలీస్ స్టేషన్లలో భూ పోరాట నాయకులపై పెట్టిన బైండోవర్ కేసులు, స్టేషన్ బెయిల్ కేసులు అన్నింటిని తక్షణమే రద్దు చేయాలని కోరారు. కౌన్సిలింగ్ పేరుతో భూ పోరాట కమిటీ నాయకులను వ్యక్తిగతంగా పోలీస్ స్టేషన్లకు పిలిచి బెదిరించే చర్యలు ఆపాలని కోరారు. ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకున్న పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్ల పట్టా ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సాయం తక్షణమే చేయాలని కోరారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసిన వారిపై, గ్రానైట్ క్వారీలు తవ్వుతున్న వారిపై ల్యాండ్ గ్రా బీంగ్ కేసులు నమోదు చేసి బాధ్యులను అరెస్టు చేయాలని, ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్ పటేల్, నాయకుడు నవీన్ తదితరులున్నారు.

విద్యార్థినుల స్వీయ రక్షణకే స్నేహిత

జిల్లా వైద్యాధికారి లలితా దేవి

నవతెలంగాణ - జమ్మికుంట : విద్యార్థినిలకు భద్రత కల్పించాలనే, స్వీయ రక్షణకు ఉపయోగపడాలనే లక్ష్యంతో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో స్నేహిత కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని జిల్లా వైద్యాధికారి లలితా దేవి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కస్తూర్బా పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపాల్ సుప్రియ అధ్యక్షతన స్నేహిత గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ కాన్సెప్ట్‌పై వేధింపులు ఎదురైనప్పుడు ఎలా స్పందించాలి అనే విషయాలపై అవగాహన కల్పించాల్సిన అవసరము ఉందన్నారు. ఎవరైనా తమతో తప్పుగా ప్రవర్తించినప్పుడు వెనుకాడకుండా అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ చందు, సిడిపిఓ భాగ్యలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్ శిరీష, ఏఈఓ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఇల్లందకుంటలో బస్టాండ్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ - ఇల్లందకుంట : ఇల్లందకుంట మండల కేంద్రంలో ప్రజలకు బస్టాండ్ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మోత్కూరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పేరుకు మాత్రమే మండల కేంద్రంగా ఉంది కానీ కనీస సౌకర్యాలు లేవన్నారు. మండల కార్యాలయాలకు పక్కా భవనాలు ఇప్పటివరకు అందుబాటులోకి రాలేదని అన్నారు. జమ్మికుంట నుండి భూపాలపల్లి, పరకాల ప్రాంతాలకు అనునిత్యం రాకపోకలు జరుగుతున్నా బస్టాండ్ సౌకర్యం లేక ప్రజలు రోడ్లపై నిలబడడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని మండల కేంద్రంలో బస్టాండు, ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరారు.



వీణవంక ప్రత్యేకాధికారుల నియామకం

నవతెలంగాణ - వీణవంక : వీణవంక మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు 13 మంది గెజిటెడ్, ఇద్దరు నాన్ గెజిటెడ్ అధికారులను ప్రత్యేకాధికారులను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీణవంక ప్రత్యేకాధికారిగా ఎంపీడీవో కె.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కు మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి బాధ్యతలు అప్పగించారు. కాగా ఎంపీడీవోను వైస్ ఎంపీపీ రాయిశెట్టి లతా శ్రీనివాస్, ఎంపీవో ప్రభాకర్, పాలకవర్గం మాజీ సభ్యులు అభినందించారు. తహసీల్దార్ తిరుమల్‌రావు - బేతిగల్, బొంతుపల్లి, ఎంపీడీవో శ్రీనివాస్ - వీణవంక, రామకృష్ణాపూర్, రెడ్డిపల్లి, డిప్యూటీ తహసీల్దార్ నిజాముద్దీన్ - చల్లూరు, గంగారం, కొండపాక, ఎంపీవో ప్రభాకర్ - మామిడాలపల్లి, పోతిరెడ్డిపల్లి, నర్సింసహులపల్లి, ఏవో గణేష్ - బ్రాహ్మణపల్లి, ఘన్ముక్ల, వెటర్నరీ సర్జన్ మానస- ఇప్పలపల్లి, పీఆర్డీఈఈ ప్రకాష్‌రావు - కనపర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికిరణ్మయి - కిష్టంపేట, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామలాదేవి - కోర్కల్, అసిస్టెంట్ రిజిస్టార్ కరణ్ కుమార్ - శ్రీరాములపేట, ఇరిగేషన్ ఏఈ స్వామిదాస్ - నర్సింగాపూర్, పీఆర్ఏఈ రాంబాబు - వల్బాపూర్, లస్మక్కపల్లి, ఎంబీ గ్రిడ్ డీఈఈ ప్రభాకర్ స్వామి - మల్లన్నపల్లి, మల్లారెడ్డిపల్లి, ఎంబీ గ్రిడ్ డీఈఈ త్రినాథ్ - హిమ్మత్‌నగర్ గ్రామాల్లో బాధ్యతలు స్వీకరించారు.

నుగురి సుధీర్‌కి నివాళి

నవతెలంగాణ - కరీంనగర్ : పెద్దపల్లి జిల్లా డిస్టిక్ అగ్రికల్చర్ ఆఫీసులో సూపరిం టెండెంట్ గా, టీఎన్జీవోల సంఘంలో వివిధ హోదా ల్లో, వివిధ జిల్లాల్లో కీలకపాత్ర పోషించి ఇటీవల గుండెపోటుతో మరణించిన నుగురి సుధీర్‌కి టీఎన్జీవోల కరీంనగర్ జిల్లా సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల జిల్లా సంఘం అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రియదర్శిని, అసోసియేట్ అధ్యక్షులు రాగి శ్రీనివాస్, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహస్వామి, జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

స్నేహిత అవగాహనా కార్యక్రమం

నవతెలంగాణ - సైదాపూర్ : మండలంలోని ఆకునూరు, అమ్మనుగుర్తి పాఠశాలల్లో శుక్రవారం స్నేహిత అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, విద్య ప్రాముఖ్యత, సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగం, సెల్ఫ్ ప్రొడక్షన్, చైల్డ్ హెల్ప్ లైన్ తదితర అంశాలపై వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే 1098 హెల్ప్ లైన్ నెంబరు లేదా కమిటీ సభ్యులకు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, అంగన్వాడీ సూపర్వైజర్ జ్యోతి, హెడ్మాస్టర్లు రామస్వామి, మహేందర్, ఉపాధ్యాయులు, మెడికల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ - తిమ్మాపూర్

నుస్తులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో స్నేహిత కార్యక్రమాన్ని నిర్వహించారు. కరీంనగర్ రూరల్ సిడిపిఓ సబితా కుమారి, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్ పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ అరవింద, సూపర్‌వైజర్ శ్రీలత, ప్రధానోపాధ్యాయుడు రవీందర్, ఏఈఓ స్వామి పాల్గొన్నారు.

పోతిరెడ్డిపల్లి సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం ఎన్నిక

నవతెలంగాణ - వీణవంక : మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చేపూరి మొగిళి, ఉపాధ్యక్షుడిగా తిప్పని చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా సతీష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు దూలం మల్లయ్య, శ్రీనివాస్, అశోక్, వెంకటేష్, అనిల్, కొమురయ్య, శంకరయ్య, ఐలయ్య, రాజయ్య పాల్గొన్నారు.

టీఎన్జీఓ హాల్‌లో ఎన్‌పీసీ సభ

నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్ జిల్లా టీఎన్జీఓ హాల్‌లో జరిగిన ఎన్‌పీసీ సభకు జిల్లా ఏసీపీ మాధవి, టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి అతిథులుగా విచ్చేయగా తెలంగాణ రాష్ట్ర ఎన్‌పీసీ అధ్యక్షుడు శ్రీలక్ష్మి కరవది, జనరల్ సెక్రెటరీ రామ్‌రెడ్డి సామా, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నారాయణరెడ్డి పాల్గొని పెన్షన్ గురించిన సమాచారం వివరంగా పెన్షనర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో వంగా వెంకటేశ్వర్లు, కోటేష్ కుమార్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

28న ఇల్లందకుంట దేవస్థానంలో వేలంపాట

నవతెలంగాణ - ఇల్లందకుంట : ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే టెండర్లు ఫిబ్రవరి 8న నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి కంది సుధాకర్ తెలిపారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్మకానికి నిర్వహించే వేలంలో పాల్గొనే వారు దేవస్థానం పేరు మీద డీడీ తీసి బాక్స్‌లో వేస్తే బహిరంగ వేలం నిర్వహించి టెండర్లు ఖరారు చేస్తామన్నారు.

సౌత్ జోన్ జూడో పోటీలకు వాగ్దేవి విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ - కరీంనగర్ : పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో ఈ నెల 5న జరిగే సౌత్ జోన్ యూనివర్సిటీ స్థాయి జూడో చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి శివరాత్రి విష్ణు ఎంపికయ్యాడని కళాశాల చైర్మెన్ గోవిందవరం కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల అభినందించారు. కళాశాలలోని విద్యార్థులకు విద్యతో పాటు పలు రకాల క్రీడల్లో శిక్షణ అందించి వారిని యూనివర్సిటీ, జాతీయ స్థాయిలో పాల్గొనే విధంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఎంపికైన విద్యార్థి శివరాత్రి విష్ణుని కళాశాల ప్రిన్సిపాల్ పూరెళ్ల రాజశేఖర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ ఏ.మునీందర్‌గౌడ్, పీజీ ఇన్‌చార్జి పి.రమేష్, పీడీ ఏ.శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

ఢిల్లీ ధర్నాకు బయలుదేరిన డీటీఎఫ్ నాయకులు

నవతెలంగాణ - కరీంనగర్ : కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న జాతీయ విద్యా విధానాన్ని నిరసిస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అఖిల భారత విద్యా హక్కు ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాలో పాల్గొనేందుకు కరీంనగర్ జిల్లాకు చెందిన డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా నాయకత్వం శుక్రవారం బయలుదేరి వెళ్లింది. 46 మంది సభ్యులతో కూడిన డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ బృందం రామగుండం నుంచి ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్ రైల్లో వెళ్లారు. ఈ బృందంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి.శ్యాం, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం.రఘుశంకర్‌రెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఈశ్వర్‌రెడ్డి, డి.ఏసురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆవాల నరహరి, సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.విష్ణు, కరీంనగర్ జిల్లా కార్యదర్శి ఏబూషి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్లు వి.రాం కిరణ్, పి.నర్సయ్య, బి.సుదర్శన్‌రెడ్డి, ఏ.రాంమోహన్, మండలాల బాధ్యులు, బి.శ్రీనివాస్, కె.వెంకటస్వామి, కె.శ్రీనివాస్, సంపత్ తదితరులున్నారు.

స్పెషల్ ఆఫీసర్‌గా తహసీల్దార్ రజనీరెడ్డి



నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట మండలంలో 20 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వము ప్రత్యేక అధికారులను నియమించింది. మండలంలోని అంకుశపూర్ గ్రామ ప్రత్యేకారిగా తహసీల్దార్ మార్కల రజనీరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మాజీ సర్పంచ్, గ్రామ కార్యదర్శి ఆమెను శాలువతో సన్మానించారు. ఈఅలాగే మండలంలోని అన్ని గ్రామాలలో ప్రత్యేక అధికారులు చార్జ్ తీసుకున్నారు. బిజిగిరి షరీఫ్, నాగంపేట గ్రామాలకు డిప్యూటీ తహసీల్దార్ నీలం శ్రీనివాస్, గంద్రపల్లి - స్టాటికల్ అధికారి హైమావతి, జగ్గయ్యపల్లి - మండల పరిషత్ సూపరిండెంట్ శైలజాదేవి, కోరపల్లి - తహసీల్దార్ మార్కల రజనీరెడ్డి, మాచినపల్లి - పిఆర్ ఏఈఈ, మడిపల్లి, నాగారం - ఎంపీడీవో కల్పన, నగరం, పాపయ్యపల్లి - ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శివప్రసాద్, పాపక్కపల్లి - ఇరిగేషన్ ఏఈ నవీన్ కుమార్, పెద్దంపల్లి, విలాసాగర్ - ఏఈ ఈ.నాగరాజు, సైదాబాద్, శంభునిపల్లి - వెటర్నరీ అధికారి ఫ్లవర్ ముజుందార్, శాయంపేట, తనుగుల - ఎంపీఓ సతీష్ కుమార్, వావిలాల, వెంకటేశ్వర్లపల్లి - వ్యవసాయ అధికారి గోవర్ధన్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేయగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

ప్రమాదవశాత్తు రైలునుంచి పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ - జమ్మికుంట : ప్రమాదవశాత్తు రైలులోనుంచి కిందపడి మండలంలోని బిజిగిరి షరీఫ్ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం ఉదయం ఒక వ్యక్తి మరణించాడని రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జీ.తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్ ఛత్రియా (43)ది భారుపాలి గ్రామం, బలంగీర్ జిల్లా ఓడిశా రాష్ట్రం. తన చిన్న కుమారుడు, కుమార్తె తో కలిసి తురేకల స్టేషన్‌లో ఏదో ట్రైన్ ఎక్కి అక్కడి నుండి రాయపూర్‌కి వెళ్లి, అక్కడ ట్రైన్ నెం.03253 సికింద్రాబాద్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి జనరల్ కోచ్‌లో ప్రయాణిస్తుండగ ప్రమాదవశాత్తు బిజిగిరిషరీఫ్ రైల్వేస్టేషన్‌కి కొంత దూరంలో కిందపడి మరణించాడు. మృతుడికి భార్య ద్రౌపది, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. వారికి సమాచారం ఇచ్చామని, మృతదేహాన్ని జమ్మికుంట గవర్నమెంట్ హాస్పిటల్‌లో భద్ర పరిచినట్టు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

16న భారత్ బంద్ జయప్రదం చేయండి

ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి

నవతెలంగాణ - కరీంనగర్


వినతిపత్రం అందిస్తున్న పున్నం రవి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాలు వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు అఖిల భారత ఫెడరేషన్లు ఐక్యవేదిక పిలుపునిచ్చిన ఈనెల 16న అఖిల భారత స్థాయిలో కార్మికుల సమ్మెతో పాటు గ్రామీణ భారత్ బంద్‌లో రాష్ట్రంలో రవాణా రంగా కార్మికులు కూడా పెద్దఎత్తున భాగస్వామ్యం కావాలని తెలంగాణ పబ్లిక్, ప్రయివేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ పిలిపిస్తుంది. పారిశ్రామిక వివాదాల చట్టం 1947 సెక్షన్-22 సబ్ సెక్షన్(1) అనుసరించి ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి, లారీ డ్రైవర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు ఎంకే.ఆరిఫ్ మొయినుద్దీన్ కలిసి తిమ్మాపూర్ రవాణా శాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి సురేష్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 16న జరిగే దేశ, రాష్ట్ర కార్మిక సమ్మెలో గ్రామీణ భారత్ బంద్ రవాణా రంగ కార్మికులు అన్ని రకాల వాహనాలు డ్రైవర్లు ఆటో, క్యాబ్, లారీ, డీసీఎం, స్కూల్ బస్సు, జీపు, అంబులెన్స్, ట్రాక్టర్ హెయిర్ బస్, ట్రాలీ, టాటా ఏసీ, రెడీమిక్స్, డ్రైవర్స్ ఈ సమ్మెలో భాగస్వామ్యం కావాలని కోరారు. మోడీ నేతృతంలోని ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో రోడ్డు రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిడుతుందని, క్రూడ్ ఆయిల్ ధరలు 2014 కంటే తక్కువగా ఉన్నప్పుడు కూడా పెట్రోలు, డీజిల్ అసాధారణంగా పెరగడం ఇన్సూరెన్స్ భారీ పెంపుదల, టోల్ టాక్సీ సవరణ తర్వాత పరిశ్రమతో పాటు కార్మికులను ఇప్పటికే నాశనం చేసింద్రు అని విమర్శించారు. హిట్ అండ్ రన్ (106)(1)(2) రద్దు చేయాలని, ఎంవీ యాక్ట్ 2019 సవరణ చట్టం రాష్ట్రంలో అమలు చేయొద్దు, ప్రభుత్వమే ఆన్‌లైన్ యాప్ తీసుకరావాలని, మూడు నెలల పాటు ఆటోల మీద ఈఎంఐ మారుటోరియం ప్రకటించాలని, ప్రమాద బీమా, ఆరోగ్యశ్రీ విధాన పరిరక్షణ ఉచిత వైద్యం మొత్తం రవాణా రంగా కార్మికులకు వర్తింపజేయాలన్నారు. ఆటో డ్రైవర్ల ఇన్సూరెన్స్ ప్రభుత్వం భరించాలని, మహిళలకు ఉచితం ఫ్రీ బస్సు ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు జీవన భృతి నెలకు రూ.4,500లు ఇవ్వాలని కోరారు. నగరంలో టాక్సీ స్టాండ్లు, అడ్డా స్థలాలు ఏర్పాటు చేయాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలి : కటికరెడ్డి బుచ్చన్న యాదవ్

నవతెలంగాణ - కరీంనగర్


వినతిపత్రం అందిస్తున్న కటికరెడ్డి బుచ్చన్న యాదవ్

ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొనాలని తెలంగాణ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ అన్నారు. ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని జిల్లా లేబర్ కమిషనర్‌కు ఏఐటీయూసీ నేతలు (సమ్మె నోటీస్) వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ బిల్డింగ్ కన్స్ట్రక్చర్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక రైతు వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న కార్మికులు సమ్మె పాటించాలని వారు కార్మికుల లోకానికి పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు కోకోల్లలుగా ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, కార్మికుల క్లెయిమ్స్ ఆన్‌లైన్‌లో ఆధార్ నెంబర్లు రావడం లేదని, క్లెయిమ్స్ పెండింగ్‌పై ఎన్నిసార్లు విన్నవించిన పెడచెవిన పెడుతున్నారని కొన్ని డిస్బర్డ్ అని వస్తుందని కానీ డబ్బులు రావడం లేదని కార్మికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, అందరికీ సార్వత్రిక నాణ్యమైన ఆరోగ్యం, విద్యను కేంద్రం అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కాంట్రాక్ట్ పద్ధతిని నిలిపి వేయాలన్నారు. ధరల పెరుగుదలను నియంత్రించాలని ఆహార వస్తువులపై జీఎస్టీని రద్దు చేయాలన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలపై ప్రభుత్వ సుంకం తగ్గించాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రతిష్టము చేసి 14 రకాల నిత్యావసర వస్తువులను పేద ప్రజలకు అందించాలని, ఆహార భద్రతను పటిష్టం చేయాలని వారు కోరారు. ఇంకా కార్మిక సమస్యలపై జరిగే ఈ సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక లోకాన్ని కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, పిట్టల సమ్మయ్య లు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు నరసయ్య, సుల్తాన్, సమ్మయ్య పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను పరిశీలించిన హౌసింగ్ బోర్డు అధికారులు

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో అక్రమ నిర్మాణాలను వరంగల్ హౌసింగ్ బోర్డ్ డిప్యూటీ ఈఈ రవి ప్రసాద్, ఏఈ పృథ్వీరాజ్ శుక్రవారం పరిశీలించారు. జమ్మికుంట హౌసింగ్ బోర్డ్ రైల్వే ట్రాక్ సమీపంలోని హౌసింగ్ బోర్డ్‌కు చెందిన స్థలంలో మునిసిపల్ అధికారులు పెట్టించిన బోర్డును తొలగించారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలోని పలు ప్రాంతాలు, రహదారి కబ్జాకు గురైనట్లు అధికారులు నిర్ధారించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.



ప్రత్యేక అధికారుల బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని 23 గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. తహసీల్దార్ కనకయ్య రామకృష్ణకాలనీ, నల్లగొండ గ్రామాలకు, ఎంపీడీవో సి.రవీందర్‌రెడ్డి- తిమ్మాపూర్, రేణికుంట, ఎంపీఓ బి.కిరణ్ కుమార్- మహాత్మానగర్, మన్నెంపల్లి, నర్సింగపూర్, పంచాయతీ రాజ్ డిఈఈ రవి ప్రసాద్ - మొగిలిపాలెం, ఏ.సురేందర్ రెడ్డి ఏఈ, పంచాయతీరాజ్)- లక్ష్మీదేవిపల్లె, జే.సురేందర్ మండల వ్యవసాయ అధికారి- గొల్లపల్లి, ఇందిరా నగర్, సురేందర్‌రెడ్డి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్- నుస్తులాపూర్,మల్లాపూర్, జి.భారతి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్- పర్లపల్లి, సాంబరావు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ - వచ్చునూర్, టి.క్రిష్ణస్వామి ఏఈ - పోరండ్ల, లక్ష్మణ్ డిప్యూటీ తహశీల్దార్ - బాలయ్యపల్లి, కార్తిక్ ఏఈ మిషన్ భగీరథ - రాంహనుమాన్ నగర్, అహ్మద్ అలి అసిస్టెంట్ రిజిస్ట్రార్ - నేదునూర్, శ్రీలత ఐసీడీఎస్ సూపర్వైజర్ - కొత్తపల్లి, పద్మ ఐసీడీఎస్ సూపర్వైజర్ - మక్తపల్లి, జి.ప్రవీణ్ జూగుండ్ల, ఈ.శ్రావణ కుమార్ - పోలంపల్లి గ్రామాలకు కేటాయించారు. అనంతరం ప్రత్యేక అధికారులు కేటాయించిన గ్రామపంచాయతీలలో బాధితులు స్వీకరించారు.

రామకృష్ణకాలనీ ప్రత్యేక అధికారి తహసీల్దార్ కోడం కనకయ్యను బాధ్యతలు ఎంపీటీసీ కిన్నెర సుజాతసారయ్య పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో ఘనంగా సత్కరించారు.

పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,600

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు కాటన్ విడి పత్తి 938 క్వింటాళ్లు 87 వాహనాలలో శుక్రవారం రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు గరిష్టధర రూ.6,600, మోడల్ ధర 6,500, కనిష్ట ధర 6వేలు పలికిందని మార్కెట్ సెక్రటరీ గుగులోతు రెడ్డి తెలిపారు. అలాగే కాటన్ బ్యాగ్స్‌లలో 5 క్వింటాళ్లు ఐదుగురు రైతులు విక్రయానికి తీసుకురాగా గరిష్టధర రూ.5,650, మోడల్ ధర 5వేలు, కనిష్ట ధర 4,500 పలికింది. శని, ఆదివారాలు మార్కెట్‌కు సాధారణ సెలవులు కాగా తిరిగి ఈ నెల 5న మార్కెట్ పునః ప్రారంభమవుతుందని మార్కెట్ కార్యదర్శి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నకిలీ డాక్యుమెంట్ల తయారీలో మాజీ ఎంపీటీసీ అరెస్ట్

రిమాండ్‌కు తరలింపు

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం


రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి, భూకబ్జాకు పాల్పడిన నిందితుడు తీగలగుట్టపల్లి మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్యను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వివరాలలోకి వెళితే.. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రాగంపేట గ్రామానికి చెందిన దీటి మధు 2013 సంవత్సరంలో ఆరెపల్లి గ్రామ శివారులో సర్వే నెంబర్ 311, ఓపెన్ ప్లాట్ నెంబర్ 5లో 91 గజాల ఇంటి స్థలాన్ని కరీంనగర్‌కు చెందిన నల్లవెల్లి రాజు, తండ్రి మాంకాలయ్య నుంచి ఖరీదు చేశాడు. ఈ స్థలాన్ని ఇంటి నిర్మాణం కోసం తన భార్య అయిన ఎండల సరిత పేరున మార్చాడు. 2013 నుంచి ఈ స్థలం వారి ఆధీనంలోనే ఉంది. స్థలంలో మున్సిపాలిటీ ద్వారా అనుమతి తీసుకొని, ఇంటి నంబర్ 4-63/ఏ/ఏ/2/ఏ/1 నిర్మించుకున్నాడు. ఒకరోజు గుంజ లక్ష్మణ్ అనే వ్యక్తి అక్రమంగా, తన ఇంటిలో చొరబడి తనకున్న ఆ ఇంటిని కాజేయాలనే నేరపూరిత కుట్రతో, ఇంటి గేటుపై ఉన్న ఇంటి నెంబర్ ప్లేట్‌ని తొలగించి మరొక ఇంటి నెంబర్ 1-42/6/ఈ/4/ఏ/1 ప్లేటును తగిలించి, పైన తెలిపిన ఇంటి స్థలం తనదని, ఈ స్థలాన్ని తను తీగల గుట్టపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ అయిన కొమ్ము భూమయ్య వద్ద నుంచి కొనుగోలు చేశాడని వాగ్వివాదానికి దిగాడని, అంతేకాకుండా ఇంటిని వదిలి వెళ్లాలని, లేకపోతే చంపుతామని బెదిరింపులకు కూడా పాల్పడ్డారని గత నెల 31న దీటి మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కేసులో విచారణ జరిపిన కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ తీగలగుట్టపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్య, గుంజ లక్ష్మణ్ ఇద్దరు దీటి మధుకు చెందిన ఇంటిని కాజేయాలని దురుద్దేశంతో నేరపూరిత కుట్రను పన్ని సర్పంచ్, పంచాయతీ సెక్రెటరీ సంతకాలను ఫోర్జరీ చేసి అదే ఇంటి స్థలంపై నకిలీ ధ్రువపత్రాలు సృష్టించారని తేలింది. ఇంటిని కాజేయాలని నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి అక్రమంగా ఇంట్లో చొరబడి, దౌర్జన్యానికి పాల్పడి ఇంటి నెంబర్ తొలగించినందుకు, ఇంటి యజమానిని చంపుతానని బెదిరించినందుకు కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ముద్దాయిలను గౌరవ కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి (ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్) ముద్దాయిలకు 15 రోజుల రిమాండ్ విధించారు.

మెట్రో రైల్ ఉద్యోగులకు కనీస వేతనాలివ్వాలి

- సీఐటీయూ నాయకుల డిమాండ్
- సీఎం కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మెట్రో రైల్లో ఐదేండ్లుగా పనిచేస్తున్న టికెట్, క్యాష్ మేనేజ్‌మెంట్ ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. శుక్రవారం సీఐటీయూ నాయకత్వం ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయ అధికారికి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు, హైదరాబాద్ నగర అధ్యక్షులు జి.కుమారస్వామి మాట్లాడుతూ.. వేతనాలు పెంచాలని గత సంవత్సరం మెట్రో రైలు ఉద్యోగులు సమ్మెలోకి వెళ్తే కార్మికశాఖ అధికారులుగానీ.. గత ప్రభుత్వంగానీ ఉద్యోగులకు సహకరించకపోగా.. యాజమాన్యానికి సహకరించాయని చెప్పారు. కనీస వేతన చట్టం ప్రకారం మెట్రో రైల్లో పనిచేస్తున్న అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.19,526, సెమీస్కిల్డ్ కార్మికులకు రూ.21,632, స్కిల్డ్ కార్మికులకు రూ.23,730, హైస్కిల్డ్ కార్మికులకు రూ.25,792 వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెట్రో రైల్ యాజమాన్యమైన ఎల్అండ్‌టీ కంపెనీ వారు ఉద్యోగుల వ్యవహారాలను ఒక కంపెనీకి అప్పగిస్తే.. ఆ కంపెనీ ఒక్కొక్క తరగతి ఉద్యోగులను ఒక్కొక్క కంపెనీకి అవుట్‌సోర్సింగ్‌కి ఇచ్చిందని చెప్పారు. దీంతో ఉద్యోగులు తమ సమస్యలను ఎవరికి చెప్పాలనే గందరగోళంలో ఉన్నారని తెలిపారు. అదేవిధంగా అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలు కమీషన్లు తీసుకోగా.. మిగిలిన వాటిని ఉద్యోగులకు జీతభత్యాలుగా ఇస్తుండటంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అందువల్ల మెట్రో రైల్ యాజమాన్యమే నేరుగా ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ జమలో జరుగుతున్న అవకతవకలను సరిచేయాలని వినతిపత్రంలో వారు కోరారు.



బీజేపీ హఠావో..దేశ్‌కో బచావో

అధ్యక్ష తరహా పాలన కోసమే ఒకేదేశం... ఒకే ఎన్నికలు

- ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం
- దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి
- మోడీ ప్రభుత్వం నుంచి ప్రజలకు విముక్తి కావాలి : సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో 'బీజేపీ హఠావో... దేశ్‌కో బచావో'అన్న నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా అన్నారు. అధ్యక్ష తరహా పాలన కోసమే ఒకేదేశం ఒకే ఎన్నికలను బీజేపీ తెరపైకి తెచ్చిందని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో మోడీ ప్రభుత్వం నుంచి దేశానికి, ప్రజలకు విముక్తి కల్పించడమే లక్ష్యమని ప్రకటించారు. మూడు రోజులపాటు జరగనున్న సీపీఐ జాతీయ సమితి సమావేశాలు హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. రామకృష్ణ పండా, కూనంనేని సాంబశివరావు, నిషా సిద్దూ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రారంభోపన్యాసంలో డి రాజా మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అంతమొందించి, ఏకస్వామ్య, ఫాసిస్టు, నియంతృత్వ వ్యవస్థను తెచ్చేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో లౌకిక, ప్రజాస్వామ్య విలువలతో పనిచేసే పార్టీలు గెలవాలని ఆకాంక్షించారు. బీజేపీని గద్దెదించడమే ప్రజల ముందున్న కర్తవ్యమని అన్నారు. వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర పార్టీలు, ఇతర శక్తులు ఐక్యంగా పనిచేయాలని కోరారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

కార్పొరేట్ల బడ్జెట్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ పేదల కోసం కాదనీ, కార్పొరేట్లు, బడా పారిశ్రామికవేత్తల కోసమేనని డి రాజా విమర్శించారు. కార్పొరేట్ పన్నులను 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించారని చెప్పారు.

పన్నులు కట్టే సామాన్యులు, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి ఉపశమనం కలిగించలేదన్నారు. యువకులు, మహిళలు, రైతులు, పేదలపై దృష్టి పెట్టామంటూ కేంద్రం ప్రకటించిందనీ, ఆ వర్గాలకు మోడీ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ మోడీ హామీ ఇచ్చారనీ, ఈ పదేండ్లలో 20 కోట్ల ఉద్యోగాలిచ్చారా?అని ప్రశ్నించారు. నిరుద్యోగం తీవ్రంగా పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేశారా? మహిళలపై లైంగిక వేధింపులు, దాడులను అరికట్టారా? అని ఆయన నిలదీశారు. మోడీ హయాంలో భారతదేశం ప్రపంచంలో ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, మళ్లీ అధికారంలోకి వస్తే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని బీజేపీ నాయకులు చెప్తున్నారని వివరించారు. కానీ దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉందన్నారు. ఈ పదేండ్లలో పేదల జీవన ప్రమాణాలు ఏమాత్రం మారలేదని విమర్శించారు. పేద ప్రజలను పట్టించుకోని మోడీ ప్రభుత్వం, బడా పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్లకు దాసోహమైందని చెప్పారు. అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతున్నదనీ, వారి కోసమే పని చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని బీజేపీ నాయకులు చెప్తున్నారని అన్నారు. అంతర్జాతీయ ఆకలి సూచీలో 125 దేశాల్లో భారత్ 111వ స్థానంలో ఉందని చెప్పారు. రాముని పేరు చెప్పి రాజకీయం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. మోడీ చెప్పే రాముడు, గాంధీ చెప్పే రాముడికి తేడా ఉందన్నారు. ప్రభుత్వాలను ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలకు ఉందన్నారు. కానీ పార్లమెంటు సమావేశాల్లో ప్రశ్నించిన ఎంపీలను మోడీ ప్రభుత్వం సస్పెండ్ చేసిందని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ కబంధహస్తాల నుంచి దేశాన్ని, ప్రజలను విముక్తి చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఆ దిశగా పార్లమెంటు ఎన్నికల్లో పనిచేయాలని పార్టీ నాయకులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

గంజాయి దందాలో ఇద్దరు ఏపీ పోలీసులు

- 22 కిలోల గంజాయి పట్టివేత







నవతెలంగాణ-దుండిగల్

ఏపీలో విధులు నిర్వహించే పోలీసులు సెలవుల మీద హైదరాబాద్‌కు వచ్చి గంజాయి రవాణా చేస్తూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి పోలీసులకు చిక్కారు. వివరాల్లోకెళ్తే.. ఆంధ్రప్రదేశ్ మూడో బెటాలియన్‌కు చెందిన పోలీస్, మరొక కానిస్టేబుల్ రెండ్రోజులు విధులకు సెలవు పెట్టారు. హైదరాబాద్‌కు కారులో 22 కిలోల గంజాయి తీసుకొచ్చారు. బాచుపల్లిలో గంజాయిని అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా పక్కా సమాచారం తెలుసుకున్న బాలానగర్, బాచుపల్లి ఎస్ఓటీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. దాంతో పోలీసులే అక్రమ సంపాదనే మార్గంగా ఎంచుకొని గంజాయిని అమ్ముతున్నట్టు నిర్ధారించారు. గంజాయి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేశారు.

గిరిజనులకు నిరాశ మిగిల్చిన కేంద్ర బడ్జెట్

- తెలంగాణ గిరిజన సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్ గిరిజనులకు తీవ్ర నిరాశ మిగిల్చిందని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ధర్మనాయక్, ఆర్. శ్రీరాం నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత పదేండ్లలో గిరిజనుల అభివృద్ధికి నూతన పథకాలను ప్రవేశ పెట్టక పోగా ఉన్న పథకాలకు సైతం అరకొరా నిధులు కేటాయించారని విమర్శించారు. 2022-23 బడ్జెట్లో రూ.8,451 కోట్లు కేటాయించి, రూ.7,273 కోట్లు మాత్రమే ఖర్చు చేసి మిగిలిన రూ.1,178 కోట్లను కేంద్రం దారిమళ్లించిందని తెలిపారు. అలాగే గతేడాది బడ్జెట్లో రూ.12,461 కోట్లు కేటాయించి సవరించిన అంచనాలో రూ. 7,605 కోట్లకు తగ్గించి గిరిజనులను దగా చేసిందని విమర్శించారు. తాజా బడ్జెట్లో కేవలం రూ.13 వేల కోట్లు కేటాయించిన మోడీ సర్కార్... దేశంలో ఉన్న 15 కోట్ల మంది గిరిజనులను ఎలా అభివృద్ధి చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 275 ప్రకారం గిరిజనులకు కేటాయించాల్సిన నిధులను సైతం తగ్గించడం అన్యాయమని అన్నారు. గతంలో ప్రధానమంత్రి పీవీటీజీల అభివృద్ధి మిషన్ పేరుతో కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన రూ.15 వేల కోట్లు, షెడ్యూల్ ట్రై అభివద్ధి యాక్షన్ ప్లాన్ పేరిట రూ. లక్ష 17 వేల కోట్లు గత రెండు సంవత్సరాలుగా ఖర్చు చేయకపోవడం గిరిజనుల పట్ల కేంద్రానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని విమర్శించారు. గిరిజనుల్లో ఆకలి, దారిద్ర్యం గతం కంటే గణనీయంగా పెరుగుతోందని ఐక్యరాజ్యసమితి సైతం ఆందోళన వ్యక్తం చేసిందని గుర్తు చేశారు. వారి అభివృద్ధికి ఆటంకంగా మారిన బిజెపి ప్రభుత్వాన్ని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించడం ద్వారానే న్యాయం జరుగుతుందని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- హెచ్ఎండీఏ అసిస్టెంట్ సైట్ ఇన్‌చార్జి గౌతమ్
- మియాపూర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత



నవతెలంగాణ-మియాపూర్

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్ఎండీఏ అసిస్టెంట్ సైట్ ఇన్‌చార్జి గౌతమ్ హెచ్చరించారు. హైదరాబాద్ మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 ప్రభుత్వ భూముల్లో కొందరు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టగా.. శుక్రవారం హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు ఆ అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమించే ప్రయత్నం ఎవరు చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. అమాయక ప్రజలు కొంతమంది రియల్టర్ల మాటలు నమ్మి ప్రభుత్వ భూములు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఎవరూ మధ్యవర్తుల మాటలు నమ్మి ప్రభుత్వ భూములు కొనుగోలు చేయొద్దని సూచించారు. నిర్మాణాలు చేపట్టే ప్రయత్నం ఎవరు చేసినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సందర్శించిన వారిలో.. శేరిలింగంపల్లి ఆర్ఐ శ్రీనివాస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై సంతోష్‌రెడ్డి, రెవెన్యూ హెచ్ఎండీఏ సిబ్బంది ఉన్నారు.

16న ఆర్టీసీ కార్మికుల సమ్మె

- కేంద్రం వైఖరికి నిరసనగా...ఎమ్‌డీకి సమ్మె నోటీసు ఇచ్చిన ఆరు కార్మిక సంఘాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశంలోని ఆర్టీసీల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి మారాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో తాము భాగస్వాములం అవుతున్నట్టు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ)లోని ఆరు కార్మిక సంఘాలు ప్రకటించాయి. ఈ మేరకు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్‌కు సమ్మె నోటీసు అందచేశాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారత న్యాయ సంహితలోని సెక్షన్ 106 (హిట్ అండ్ రన్) రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్రం అమల్లోకి తెచ్చిన మోటార్ వాహన చట్టం-2019ని సవరించాలని కోరారు. టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్), ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ), స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ), బహుజన వర్కర్స్ యూనియన్ (బీడబ్ల్యూయూ), బహుజన కార్మిక యూనియన్ (బీకేయూ), కార్మిక పరిషత్ (కేపీ) సంఘాలు ఎమ్‌డీకి సమ్మె నోటీసు ఇచ్చాయి. సంస్థలోని కార్మిక సంఘాలు కూడా సమ్మె నిర్ణయం తీసుకొని, కార్మిక ఐక్యతను చాటాలని విజ్ఞప్తి చేశాయి. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, రవాణా రంగ ఫెడరేషన్లు ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. దానిలో భాగంగానే రవాణా రంగాన్ని, ఆర్టీసీలను రక్షించుకోవాలని, డ్రైవర్లను జైళ్లకు పంపే భారత న్యాయ సంహిత సెక్షన్ 106 (1,2) రద్దుచేయాలనే డిమాండ్లతో సమ్మెలోకి వెళ్తున్నామన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, కోశాధికారి గంగాధర్, ఈయూ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, బీడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్, బీకేయూ ప్రధాన కార్యదర్శి కత్తుల యాదయ్య, కేపీ ప్రధాన కార్యదర్శి బీ యాదగిరి సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా 22 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమ్మె నోటీసులకు జతచేశారు. మరికొన్ని సంఘాలు కూడా త్వరలో సమ్మె నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాయని వారు తెలిపారు. విద్యుత్ బస్సులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీలను ఆర్టీసీలకూ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

- రెండు నెలల్లో 15 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలి
- ప్రతి కుటుంబానికి నెలకు రూ. 10 వేల ఆర్థిక సాయం అందించాలి
- సీఎం రేవంత్ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. ప్రజాపాలన తెస్తామంటూ అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రజావ్యతిరేకిగా మారిపోయారని విమర్శలు గుప్పించారు. అనాలోచిత విధానాలతో, ఒక హామీ అమలుచేసే హడావుడిలో మరో వర్గాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్న తీరు ఆయన పాలనా వైఫల్యాన్ని కళ్లకు కడుతోందని దుయ్య పట్టారు. నిరుపేద బడుగు బలహీన వర్గాలకు చెందిన ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటోలకు గిరాకీ లేకపోవడంతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలో తెలియక ఇటీవలి కాలంలో 15 మంది డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. బతుకు బండి ఈడ్చలేక గురువారం బేగంపేటలోని ప్రజాభవన్ ముందు తనకు ఇంతకాలం బువ్వపెట్టిన ఆటోను ఒక డ్రైవర్ తగులబెట్టుకున్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న 6.50 లక్షల మంది ఆటోడ్రైవర్లకు ప్రతినెలా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించడంతో పాటు మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించకుంటే త్వరలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మన సైబర్ సెక్యూరిటీ దేశంలోనే నెంబర్ వన్

- సైబర్ నేరాలపట్ల అప్రమత్తత అవసరం : డీజీపీ రవిగుప్తా



నవతెలంగాణ- సిటీబ్యూరో

మన సైబర్ సెక్యూరిటీ సిస్టం దేశంలోనే నెంబర్ వన్‌గా ఉందని, సైబర్ నేరాలపట్ల అప్రమత్తత అవసరమని రాష్ట్ర డీజీపీ రవిగుప్తా అన్నారు. ఎంత చదువుకున్న వారైనా సైబర్ నేరాలబారిన పడుతున్నారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ భవనంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. దేశంలోనే టీ4సీని స్థాపించిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని, అలాగే దేశంలో ప్రత్యేక సైబర్ బ్యూరోను ఏర్పాటు చేసింది కూడా తెలంగాణ అన్నారు. రాష్ట్రంలో సైబర్ నేరాలను సమగ్ర పద్ధతిలో బ్యూరో పరిశీలిస్తుందని, నేరాల పోకడలను విశ్లేషిస్తుందని, సైబర్ పోలీస్ స్టేషన్‌లకు మార్గనిర్దేశం చేస్తుందని చెప్పారు. సైబర్ నేరస్థులు చెప్పే మాయమాటలతో వారికి చిక్కుతున్నామని తెలిపారు. తాను సైతం ఓసారి సైబర్ నేరస్థుల మాయమాటలతో వారికి చిక్కానని, కానీ, అప్రమత్తతో బయటపడ్డానని చెప్పారు. సైబర్ నేరస్థులను పట్టుకోవడంలో, రికవరీలో మనం దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నామన్నారు. బాధితుల నుంచి డబ్బులు కాజేసిన సమయంలో కూడా నేరస్థుల బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేసి సొమ్మును రికవరీ చేస్తున్నామన్నారు.

టీఎస్‌సీఎస్‌బీ డైరెక్టర్, శిఖా గోయెల్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలకు గురైన బాధితులు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ క్రైమ్‌లను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. టీ4సీకి ఇప్పటివరకు 90వేల ఫోన్లు వచ్చాయన్నారు. దాదాపు రూ.128 కోట్లకు పైగా అనుమానిత మొత్తాలను బ్యూరో స్తంభింపజేసిందని, బాధితులకు దాదాపు రూ.8 కోట్ల వరకు రీఫండ్ చేసిందని చెప్పారు. దేశవ్యాప్తంగా వివిధ కేసుల్లో 12,053 పీటీ వారెంట్లు జారీ చేయగా.. అందులో 2025 కేసులు తెలంగాణకు చెందినవి ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అన్ని లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లకు చెందిన 870 మంది పోలీసు సిబ్బందికి బ్యూరో ప్రత్యేక శిక్షణ అందించినట్టు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి నిందితుల సమాచారం, దేశవ్యాప్తంగా సంబంధిత పోలీసు అధికారులతో పంచుకున్న సమాచారాన్ని సేకరించడం ద్వారా బ్యూరోలో మొత్తం 66,726 ఇంటర్‌స్టేట్ క్రైమ్ లింక్‌లు స్థాపించారనిన్నారు. మొత్తం సైబర్ సెక్యూరిటీ వ్యూహంలో భాగంగా, బ్యూరో దాదాపు 19000 అనుమానాస్పద యూఆర్ఎల్‌లను పరిశీలించి మోసపూరితమైనదిగా భావించిన 4481 లింక్‌లను తీసేసిందని తెలిపారు. అలాంటి లింక్‌లను హోస్ట్ చేస్తున్న లేదా ఈ లింక్‌ల నుంచి ల్యాండింగ్ చేస్తున్న 1638 వెబ్‌సైట్‌లను కూడా తీసేసినట్టు చెప్పారు. 2023-24 సంవత్సరానికి వివిధ ప్రభుత్వ విభాగాలకు 13 కీలకమైన సైబర్ సేఫ్టీ అడ్వైజరీలు జారీ చేయడం జరిగిందని, సైబర్ నేరగాళ్లు ఉపయోగించే 27,600 సిమ్ కార్డులను బ్లాక్ చేసినట్టు తెలిపారు. గత నెల నుంచి, ఐఎంఈఐ బ్లాకింగ్ కూడా ప్రారంభమైందని చెప్పారు. వ్యక్తిగత వివరాలను, రహస్య నెంబర్లను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపించే లింక్‌లను క్లిక్ చేయొద్దన్నారు. కొరియర్, ఇంటర్‌నెట్, బ్యాంకింగ్ పేర్లతో సైబర్ నేరస్థులు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సీపీ కె.శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోపల ఎస్..బయట నో!

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహణ, నీటి వాటాల కేటాయింపు తదితర అధికారాలను కేఆర్ఎంబీకి కట్టబెట్టాలని కేంద్రం తెలుగు రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తున్నది. దీన్ని ఏపీ స్వాగతించగా, తెలంగాణ ఒక సారి ఖండించినట్టు, మరోసారి అంగీకరించనట్టుగా వార్తలొస్తున్నాయి. వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకుపోవడంలో ప్రభుత్వం చొరవచూపాలని సాగునీటిరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేఆర్ఎంబీకి అధికారాలను కట్టబెట్టడం అంటే ఏపీకి మేలు చేయడమేననే వ్యాఖ్యానాలు వస్తున్నాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతుతో ఏపీ నిబంధనలకు విరుద్ధంగా సొంత అవసరాలను నెరవేర్చుకుంటుందనే ఆరోపణలు, విమర్శలు వస్తున్నాయి. దీన్ని అడ్డుకోవాలనే డిమాండ్లు వస్తున్నాయి. అయితే తెలంగాణ సాగునీటి శాఖ తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజలు, మీడియాలో వస్తున్న విమర్శల నేపథ్యంలో తెలంగాణ సాగునీటి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇంజినీర్ ఇన్ ఛీఫ్ సి. మురళీధర్ శుక్రవారం స్పందించారు. రాహుల్ బొజ్జ మీడియాతో చిట్‌చాట్ చేసి పత్రికా ప్రకటన విడుదల చేయగా, మురళీధర్ విలేకర్లతో మాట్లాడారు. వివరాలు వారి మాటల్లోనే..

పత్రికల్లో వచ్చింది వాస్తవం కాదు ప్రజలు, పార్టీలు నిజాలు గ్రహించాలి : సాగునీటి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ



ప్రాజెక్టుల అప్పగింతపై ఢిల్లీలో జరిగిన సమావేశానికి కొనసాగింపుగానే హైదరాబాద్‌లో మరోసారి నిర్వహించారు. అప్పగింతకు కేఆర్ఎంబీ చైర్మెన్ ముందు అనేక షరతులు పెట్టాం. సమస్యలు పరిష్కరిస్తేనే ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించే విషయం ఆలోచిస్తాం. ఇరు రాష్ట్రాల మధ్య నీటి వాటా గతంలో 34:66 నిష్పత్తిలో ఉంది. అప్పుడు మనకు ప్రాజెక్టులు లేవు. ఇప్పుడు పెరిగిన దృష్ట్యా ఇప్పుడు దానిని 50:50 నిష్పత్తిలో చేయాలని డిమాండ్ పెట్టాం. ట్రిబ్యునల్-1 ప్రకారం స్థానిక అవసరాలకే తొలిప్రాధాన్యత ఇవ్వాలి. శ్రీశైలంకు విద్యుత్ ప్రాజెక్టుగానే ప్రణాళిక సంఘం తొలుత అనుమతి ఇచ్చింది. పోతిరెడ్డిపాడు ద్వారా కేవలం 34 టీఎంసీలను మాత్రమే తరలించడానికి ఏపీని కట్టడి చేయాలి. తాగునీటి కోసం వినియోగించే నీటిలో కేవలం 20 శాతాన్ని మాత్రమే లెక్కలోకి తీసుకోవాలి. ఒక నీటి సంవత్సరంలో దాచుకున్న నీటిని వచ్చే సంవత్సరంలో వాడుకునేలా అవకాశమివ్వాలి. కృష్ణా బేసిన్‌లో అవసరమైన దాని కంటే ఎక్కువ ప్రాజెక్టులను కడుతున్న ఏపీని అడ్డుకోవాలి. ఇరు రాష్ట్రాలకు చెందిన కామన్ ప్రాజెక్టులను మాత్రమే కేఆర్ఎంబీకి అనుమతిస్తామని అనాడు చెప్పాం. ఆర్థికపరమైన అవసరాలకోసం సీడ్ మనీగా రూ. 200 కోట్లను ఇచ్చేందుకు గత బడ్జెట్ ప్రతిపాదనల్లో పేర్కొన్నాం. శ్రీశైలం, సాగర్‌లోని 15 అవుట్‌లెట్లలో 10 అవుట్ లెట్ల అప్పగింతకు ప్రభుత్వ అనుమతి పొందాల్సిన అవసరం ఉందని గతంలోనే చెప్పాం. త్రిసభ్య కమిటీ నిర్ణయం మేరకు 10 అవుట్‌లెట్ల ద్వారా నీటి వాటాలు తేల్చాల్సి ఉంది. పత్రికల్లో తప్పుడు సమాచారం వస్తున్నది. ఇది సరికాదు. అప్పగింత జరగాలంటే సమస్యలు పరిష్కరించాల్సిందే. ఢిల్లీలో జరిగిన సమావేశంలో తెలంగాణ చెప్పిన అంశాలు నమోదు చేయలేదు. దీంతో గందరగోళం ఏర్పడింది. చర్చల వివరాలను ప్రభుత్వానికి చెప్పి, ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటామని చెప్పాం. సున్నితమైన అంశాల పట్ల మీడియా సమయమనం పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

సాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పగించలేదు నీటి వాటాలు తేల్చేది త్రిసభ్య కమిటీనే : రాష్ట్ర సాగునీటి శాఖ ఈఎన్సీ మురళీధర్



సాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పగించలేదు. నీటి వాటాలు తేల్చేది త్రిసభ్య కమిటీనే. గతంలో చెప్పినట్టు 50:50 నిష్పత్తి డిమాండ్‌ను వదులుకో లేదు. షరతులు అంగీకరిస్తేనే అప్పగించే విషయం ఆలోచిస్తాం. విద్యుత్ కేంద్రాల అప్పగింత మా చేతుల్లో లేదు. అది ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయం. గత జనవరి 17వ తేదీన దిల్లీ సమావేశంలో మేము అంగీకరించని అంశాలు కూడా కేంద్ర జలశక్తి శాఖ మినిట్స్‌లో పేర్కొన్నది. ఇది సరికాదు. ఈమేరకు ఈ విషయమై అభ్యంతరాలను తెలియజేస్తూ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ కేంద్రానికి రాశారు. షరతులు అంగీకరించకుండా ప్రాజెక్టులు అప్పగించబోమనీ, అపెక్స్ కౌన్సిల్‌కు నివేదించాలని గతంలోనే స్పష్టంగా చెప్పాం. సీఆర్పీఎఫ్‌ను ఉపసంహరించుకోవాలని కోరాం. నీటి నిర్వహణ కష్టా బోర్డు, రెండు రాష్ట్రాలు సంయుక్తంగా చేస్తాయి. కేటాయింపులు త్రిసభ్య కమిటీనే చేస్తుంది. గతంలో కూడా ఇదే విధానం ఉంది, కొత్తగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించారనడం దురదష్టకరం. సాగర్‌కు చెందిన పది ఔట్ లెట్లను కష్ణా బోర్డు నిర్వహిస్తుంది, రెండు రాష్ట్రాల ఇంజినీర్లు నిర్వహణలో ఉంటారు. ఇప్పుడు అప్పగింత, స్వాధీనం అంటూ ఏదీ లేదు. ఎంత మంది సిబ్బంది కావాలి, ఏం చేయాలన్న విషయమై ఇంకా కసరత్తు జరగాలి. స్పష్టత రావాలి. ఇప్పటికీ కొన్ని సమస్యలు వస్తున్నాయి, బోర్డుకు జవాబుదారీ తనం ఉండాలి. పోతిరెడ్డిపాడు నుంచి ఏపీ 34 టీఎంసీలకు మించి నీరు తీసుకోకుండా నియంత్రించాలి. ప్రాజెక్టుల అప్పగింతపై చర్చ జరుగుతోంది, ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

ప్రేమ వివాహం.. యువకుని ఇంటికి నిప్పు..

- సిలిండర్ పేలి ఇంట్లో వస్తువులన్నీ దగ్ధం
- ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రమాదం



నవతెలంగాణ-నర్సాపూర్

ఒకే గ్రామం.. ఒకే కులానికి చెందిన యువతీయువకులు ఒకరినొకరు ఇష్టపడి ప్రేమించుకుని కొద్దిరోజుల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. కాగా, వీరి పెండ్లి ఇష్టం లేని యువతి కుటుంబసభ్యులు, బంధువులు కోపోద్రిక్తులై యువకుని ఇంటికి నిప్పు పెట్టగా, ఇల్లు పూర్తిగా దగ్ధమైన సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో సంచలనంగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన సోమగారి ప్రశాంత్, పిట్ల జ్యోతి ప్రేమ వివాహం చేసుకున్నారు. పెండ్లి విషయం తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో కలిసి ప్రశాంత్ ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో డీజిల్ పోసి నిప్పు పెట్టారు. దాంతో ఇంట్లోని వస్తువులన్నీ పూర్తిగా కాలిపోవడంతో పాటు గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు తూప్రాన్ సీఐ కృష్ణ, ఎస్ఐ రవికాంతరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. యువకుని తల్లి సోమగారి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అతనిలో మార్పు వస్తోంది

ఈ మధ్య కాలంలో బంధాలకు విలువ లేకుండా పోతుంది. గతంలో కుటుంబాలు ఉమ్మడిగా ఉండేవి. ఏ చిన్న సమస్య వచ్చినా కుటుంబంలోని పెద్దలు దానిని సరిదిద్దేవారు. అలాగే కుటుంబంలో ప్రతి ఒక్కరు ఇంకొకరితో ఎలా మెలగాలో చెప్పేవారు. ఏ బంధానికి ఎంత విలువ ఇవ్వాలో తెలియజేసే వారు. ఎవరితో ఎలా మెలగాలో పిల్లలకు చిన్నతనం నుండే నేర్పేవారు. పెద్ద వాళ్ళను గౌరవించేవారు. ఏం చెప్పినా తమ మంచి కోసమే చెబుతున్నారని వినేవారు. వదినను సొంత తల్లిలా, అన్నను తండ్రిలా భావించేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దాంతో విచ్చలవిడితనం పెరిగిపోతోంది. ఫలితంగా అనేక సమస్యలు వస్తున్నాయి. అలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్...



ఐద్వా అదాలత్
సెల్ : 9490098024

నిరుపమకు 36 ఏండ్లు ఉంటాయి. తన స్నేహితురాలితో కలిసి ఐద్వా అదాలత్‌కు వచ్చింది. ఆమెకు పెండ్లి జరిగి సుమారు 15 ఏండ్లు అవుతుంది. ముగ్గురు పిల్లలున్నారు. భర్త ప్రయివేటు ఉద్యోగి. ఇంట్లో అత్తా, మామా కూడా ఉంటారు. ఆమెకు ఇద్దరు ఆడపడుచులున్నారు. వాళ్ళు వేరేగా ఉంటారు. తోటికోడలికి ఇద్దరు పిల్లలున్నారు. వాళ్ళు వీళ్ళ ఇంటికి కొంచెం దూరంలో ఉంటారు. వీళ్ళకు నాలుగు దుకాణాలున్నాయి. బావ ఎప్పుడూ బిజీగా ఉంటాడు. నిరుపమ కట్నం కింద ఇచ్చిన పది లక్షలు వడ్డీలకు ఇచ్చారు.

నిరుపమ భర్త రాజు, ఎప్పుడూ అన్న ఇంటికి వెళ్ళి అక్కడే ఉంటాడు. అన్న దుకాణానికి వెళ్ళిన వెంటనే వెళ్ళి మళ్ళీ ఆయన తిరిగి వచ్చే సమయానికి ఇంటికి వచ్చేస్తాడు. ఇంట్లో మాత్రం ఆఫీసుకు వెళు తున్నానని చెప్తాడు. అక్కడ వాళ్ళ వదినకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఇంట్లో పనులన్నీ చేసి పెడతాడు. పిల్లలను స్కూల్‌కి తీసుకెళ్ళడం, తీసుకురావడం, ఇంట్లో కావల్సిన వస్తువులు, కూరగాయలు తెచ్చిపెడతాడు. కరెంటు బిల్లు కట్టడం లాంటి చిన్న చిన్న పనుల నుండి ప్రతి ఒక్కటీ చేసి పెడతాడు. కానీ భార్యకు మాత్రం ఇంట్లో చిన్న సాయం కూడా చేయడు. కనీసం పిల్లల్ని స్కూల్లో వదడం, తీసుకురావడం కూడా చేయడు. మొత్తం ఆమెనే చూసుకునేది. స్కూల్‌కి సెలవులిస్తే తోటికోడలి పిల్లలు కూడా నిరుపమ దగ్గరే ఉండేవారు.

ఆమె అందరినీ చూసుకోలేక 'పిల్లలు మాత్రమే ఎందుకు, అక్కను కూడా రమ్మంటే బావ వచ్చే వరకు ఇక్కడే ఉంటుంది కదా!' అన్నా ఆమె మాత్రం ఇక్కడికి వచ్చేది కాదు. పిల్లలను మాత్రం పంపించేది. రాజు, ఆమె కలిసి ఇంట్లో ఉండేవారు. ఇద్దరి మధ్య సంబంధం ఉందని నిరుపమకు చాలా మంది చెప్పారు. కానీ ఆమె నమ్మలేదు. వాళ్ళిద్దరూ కాలేజీ రోజుల్లో స్నేహితులు. అందుకే సన్నిహితంగా ఉంటున్నారని అనుకునేది. వాళ్ళు కూడా నిరుపమకు అనుమానం రాకుండా నడుచుకునేవారు.

ఒకరోజు పిల్లలకు సెలవులని అందరూ నిరుపమ దగ్గరకు వచ్చారు. తల్లికి ఆరోగ్యం బాగోలేదని తన పిల్లలను కూడా తోటికోడలి ఇంటి దగ్గరకు పంపించి ఆమె ఆస్పత్రికి బయలుదేరింది.

పిల్లలు ఇంటికి వెళ్ళేసరికి రాజు తన వదిన నందినితో కలిసి బెడ్‌రూంలో ఉన్నాడు. నిరుపమ పిల్లలకు 14 ఏండ్లు ఉంటాయి. నందిని పిల్లలు ఇంకొంచెం పెద్దగా ఉంటారు. ఇంటర్ చదువుతున్నారు. వాళ్ళు తండ్రికి, పిన్నికి ఈ విషయం చెబుతామంటే వద్దని బెదిరించారు. ఈ విషయం ఇంట్లో తెలిస్తే గొడవలవుతాయని హెచ్చరించారు. పిల్లలు కూడా నిజమే అనుకుని ఆ విషయాన్ని వదిలేశారు.

నందిని వాళ్ళ పాప కాలేజీలో ఒక అబ్బాయిని ప్రేమిస్తుంది. ఆ అబ్బాయితో చాలా చనువుగా ఉండటం ఒక సారి రాజు చూశాడు. దాంతో ఆ పాపను ఇంటికి తీసుకొచ్చి కొట్టాడు. అప్పుడు ఆ అమ్మాయి 'మా అమ్మతో నువ్వు సంబంధం పెట్టుకోవచ్చు, నేను మాత్రం ప్రేమించిన అబ్బాయితో అలా చేస్తే తప్పేంటి. మేమిద్దరం పెండ్లి చేసుకోవాలని అనుకుంటున్నాం మీకేంటి సమస్య' అంటూ ఎదురు మాట్లాడింది.

అప్పుడు నిరుపమకు విషయం తెలిసింది. ఆమె పిల్లలు కూడా రెండు రోజుల తర్వాత తల్లికి విషయం చెప్పారు. పైగా 'నీకు మా మాట మీద నమ్మకం లేకపోతే మధ్యాహ్నం నువ్వే పెద్దమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళి చూడు డాడీ అక్కడే ఉంటాడు' అన్నారు. ఆమె వెళ్ళి చూస్తే రాజు బండి వాళ్ళ ఇంటి దగ్గరే ఉంది. లోపలికెళ్ళి చూసి ఆమె షాక్ అయ్యింది. ఇంటికి వచ్చి అత్తా, మామ, ఆడపడుచులకు విషయం చెప్పింది. అయితే అప్పటికే ఇంట్లో అందరికీ ఈ విషయం తెలుసు. పెండ్లి చేస్తే మారతాడని నిరుపమకిచ్చి పెండ్లి చేశారు. గతంలో కలిసి ఉండే వారు ఈ సమస్య వల్లనే వేరే ఉంటున్నారు.

పెండ్లి చేసినా రాజులో మార్పు రాలేదు. ఒకే ఇంట్లో ఉంటే కనీసం భార్యకు తెలుస్తుందనే భయం ఉండేది. ఇల్లు మారడం అతనికి మంచి అవకాశమయింది. పైగా అత్తమామలు 'పెండ్లి తర్వాత భర్తను కొంగుకు ముడేసుకోవాలి. అది నీకు చేతకాలేదు. అందుకే వాడు ఇలా చేస్తున్నాడు' అని నిరుపమనే అంటున్నారు. రాజు ఉద్యోగం కూడా చేయడం లేదు. వచ్చే వడ్డీ డబ్బుతోనే బతుకుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తనకు న్యాయం చేయమంటూ నిరుపమ ఐద్వా అదాలత్‌కు వచ్చింది. 'తల్లిగా భావించాల్సిన వదినతో సంబంధం పెట్టుకున్న వ్యక్తితో నేను ఎలా బతకాలి' అంటూ కన్నీరు పెట్టుకుంది.

మేము రాజును పిలిపించి అడిగితే 'అవును మేడం నిరుపమ చెప్పింది నిజమే. కానీ మా సంబంధం పవిత్రమైనది. మేమిద్దరం కాలేజీ రోజుల నుండే ప్రేమించుకుంటున్నాం. అనుకోని పరిస్థితుల్లో ఆమె మా అన్నయ్యను పెండ్లి చేసుకుంది. మా ఇంట్లో వాళ్ళు బలవంతం చేస్తే నేను నిరుపమను పెండ్లి చేసుకున్నాను. ఇప్పటి వరకు ఆమెకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసుకున్నాను. భార్యకు ఇవ్వాల్సిన గౌరవం ఇస్తూనే ఉన్నాను. ఎవరు ఎన్ని చెప్పినా నేను నందినిని వదిలి పెట్టి ఉండలేను. ఆమె అంటే నాకు ఇష్టం' అన్నాడు.

భర్త మాటలు విని 'ఇలాంటి వ్యక్తితో నేను ఉండలేను. ఇతన్ని చూస్తూ పెరుగుతున్న నా పిల్లలు రేపు ఎలా తయారవుతారో అని నాకు భయంగా ఉంది' అంటూ బోరున ఏడ్చింది. దాతో మేము అతనితో 'నువ్వు ఏం మాట్లాడుతున్నావో నీకు అర్థమవుతుందా? అసలు మీ సంబంధాన్ని సమాజం ఎలా చూస్తుందో తెలుసా? ఇప్పటికే నందిని కూతురు ఎలా ప్రవర్తించిందో చూశావుగా? నిన్నే ఎదిరించి మాట్లాడింది. రేపు నీ పిల్లలు కూడా ఇలాగే చేస్తారు. అప్పుడు ఏం చేస్తావు? ఎవరు ఎటు పోతే నా కేంటి నేను సుఖంగా ఉంటే చాలు అనుకుంటున్నావా? నీ లాంటి వ్యక్తిని ఎవ్వరూ గౌరవించరు. చివరకు నీ పిల్లలే నిన్ను అసహ్యించుకునే రోజు వస్తుంది. తర్వాత నీ బతుకు ఎలా ఉంటుందో ఒక్క సారి ఊహించుకో' అని హెచ్చరించాము.



> నువ్వు ఏం మాట్లాడుతున్నావో నీకు అర్థమవుతుందా? అసలు మీ సంబంధాన్ని సమాజం ఎలా చూస్తుందో తెలుసా? ఇప్పటికే నందిని కూతురు ఎలా ప్రవర్తించిందో చూశావుగా? నిన్నే ఎదిరించి మాట్లాడింది. రేపు నీ పిల్లలు కూడా ఇలాగే చేస్తారు. అప్పుడు ఏం చేస్తావు? ఎవరు ఎటు పోతే నా కేంటి నేను సుఖంగా ఉంటే చాలు అనుకుంటున్నావా? నీ లాంటి వ్యక్తిని ఎవ్వరూ గౌరవించరు. చివరకు నీ పిల్లలే నిన్ను అసహ్యించుకునే రోజు వస్తుంది. తర్వాత నీ బతుకు ఎలా ఉంటుందో ఒక్క సారి ఊహించుకో

దాంతో అతను నందిని కూతురిలా రేపు తన పిల్లలు కూడా ఇలాగే చేస్తే ఎలా అనే ఆలోచనలో పడ్డాడు. కానీ 'ఆలోచించుకోవడానికి నాకు కాస్త సమయం కావాలి' అని చెప్పి వెళ్ళిపోయాడు. రెండు వారాల తర్వాత నిరుపమ మాకు ఫోన్ చేసి 'మేడం ఇప్పుడు ఆయనలో కాస్త మార్పు వచ్చింది. అంతకు ముందులా వాళ్ళ అన్నయ్య ఇంటికి వెళ్ళడం లేదు. మా పిల్లలతో గడపుతున్నాడు. త్వరలో ఉద్యోగం కూడా చూసుకుంటా అంటున్నాడు. మీరు ఆయనతో మాట్లాడడం వల్ల కాస్త మార్పు వచ్చింది. ఈయన ఇలాగే ఉంటే నా జీవితం, నా పిల్లల భవిష్యత్తు చక్కగా ఉంటుంది' అని చెప్పి సంతోషంగా ఫోన్ పెట్టేసింది.

- వై. వరలక్ష్మి 9948794051

ఫేషియల్ తర్వాత ఏం చేయాలో తెలుసా?

పింపుల్స్, మచ్చలు తొలగిపోయి చర్మం ప్రకాశవంతంగా మారడానికి రకరకాల ఫేషియల్స్ చేయించుకుంటుంటారు. ఫేషియల్ వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఫేషియల్ చేయించుకున్న తర్వాత తెలియక చేసే కొన్ని పొరపాట్ల వల్ల చర్మం తిరిగి కాంతిహీనంగా మారుతుంది. అందుకే ఫేషియల్ చేయించుకున్న తర్వాత ఏం చేయాలో, ఏం చేయకూడదో ఇప్పుడు తెలుసుకుందాం.

ఫేషియల్స్ ముఖంపై చర్మాన్ని రిలాక్స్‌గా, రిఫ్రెష్‌గా, మెరిసేలా చేస్తాయి. చర్మానికి రక్త ప్రసరణను, శోషరస ప్రసరణను మెరుగుపరుస్తాయి. రక్త ప్రవాహాన్ని ప్రసరింపజేయడం ద్వారా చర్మ కణాలను పునరుజ్జీవింపజేయడంలో సహాయపడతాయి. మెరుగైన రక్త ప్రసరణ వల్ల చర్మం నుండి టాక్సిన్స్ తొలగిపోతాయి. అలాగే పోషకాలు, ప్రోటీన్లు, ఆక్సిజన్ అందిస్తాయి. చర్మంలోకి పోషకాలు చొప్పించి చర్మ ఆరోగ్యాన్ని కాపాడతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చర్మంపై పేరుకుపోయిన దుమ్ము ధూళిని, మృతకణాలను తొలగించడానికి సున్నితమైన క్లెన్సర్ వాడాలి. ఏదైనా క్లెన్సర్ వాడే ముందు పరీక్షించుకోవాలి.
- ఫేషియల్ తర్వాత చర్మం పొడిబారినట్లుగా, సున్నితంగా మారవచ్చు. తేమను తిరిగి పొందడానికి మాయిశ్చరైజర్ రాసుకోవాలి.
- శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచాలి. అందుకోసం పుష్కలంగా నీరు తాగాలి. దీని వల్ల చర్మం తేమగా ఉంటుంది. మృదువుగా ఉంచడంలోనూ సహాయపడుతుంది. నాణ్యమైన యాంటీ ఆక్సిడెంట్లు తీసుకోవాలి. ఫేషియల్ చేయించుకున్న తర్వాత ముఖం ఎర్రగా మారినా, దురద, మొటిమలు వంటి అలెర్జీలు వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- సన్‌స్క్రీన్ రాసుకోవడం మర్చిపోకూడదు. సన్‌స్క్రీన్ రాసుకోవడం వల్ల సూర్యుడి నుండి వెలువడే హానికరమైన యూవీ కిరణాల నుండి చర్మానికి రక్షణ లభిస్తుంది. కనీసం SPF-30 ఉన్న సన్‌స్క్రీన్ ఎంచుకోవడం మర్చిపోవద్దు.

చేయకూడని పనులు

- ఫేషియల్ చేయడం ద్వారా చర్మం లోతుగా ఎక్స్‌ఫోలియేట్ అవుతుంది. అందుకే వెంటనే మేకప్ వేయడం, కాస్మోటిక్స్ వాడటం వల్ల అవి చర్మ రంధ్రాల్లోకి వెళ్తాయి. దీని వల్ల చికాకు కలుగుతుంది. మొటిమలు రావడానికి కారణమవుతుంది.
- ముఖంపై ఉన్న వెంట్రుకలను తొలగించడానికి వాక్సింగ్ చేయాలనుకుంటే ఫేషియల్ చేయించుకోవడానికి రెండు, మూడు రోజుల ముందు వాక్సింగ్ చేయించుకోవడం మంచిది. ఫేషియల్ ద్వారా చర్మం లోతుగా ఎక్స్‌ఫోలియేట్ అవుతుంది. ఇలాంటప్పుడు వాక్సింగ్ చేస్తే చర్మ రంధ్రాల్లోకి బ్యాక్టీరియా చేరుతుంది.
- అధిక వేడి లేదా చెమట కలిగించేలా వేడి ప్రాంతాల్లో ఉండకూడదు. స్టీమ్ బాత్, హాట్ వాటర్, ఎండలోకి వెళ్లడం లాంటివి చేయకూడదు. ఇలా చేయడం వల్ల చర్మం ఎర్రగా మారుతుంది. చికాకు కలిగిస్తుంది.
- చాలా మంది ముఖాన్ని తాకుతుంటారు. ఎక్కడెక్కడో ముట్టుకున్న తర్వాత అవే చేతులతో ముఖాన్ని తాకడం ద్వారా చేతులకు ఉండే మురికి, బ్యాక్టీరియా ముఖంపైకి చేరతాయి. దీని వల్ల చర్మంపై మచ్చల్లాంటివి ఏర్పడతాయి.



- కెమికల్ పీల్స్ వాడటం ఎట్టిపరిస్థితుల్లోనూ మంచిది కాదు. దీని వల్ల చర్మ సమస్యలు రావొచ్చు.

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి

(మొదటిపేజి తరువాయి)

ఏపీ ప్రత్యేక హోదా కోసం కాంగ్రెస్ చేస్తున్న పోరాటానికి మద్దతివ్వాలని సీతారాం ఏచూరిని కోరారు. దీనికి స్పందించిన ఏచూరి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. అనంతరం సీతారాం ఏచూరి మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేక హోదా విభజన హామీల అమలు కోసం కాంగ్రెస్ చేసే పోరాటానికి సీపీఐ(ఎం) మద్దతు ఉంటుందని అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం సీపీఐ(ఎం) మొదటి నుంచీ పోరాడుతున్నదని తెలిపారు. రాష్ట్రానికి బీజేపీ ద్రోహం చేసిందనీ, విభజన హామీలను కేంద్రం అమలు చేయడం లేదని విమర్శించారు. ఏపీకి పదేండ్ల పాటు ప్రత్యేక హోదా కావాలని బీజేపీ నేతలు అడిగారని, ఇప్పుడు వాళ్లే ప్రభుత్వంలో వున్నా ఇవ్వడం లేదని విమర్శించారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక హోదా విభజన హామీల అమలు కోసం సీపీఐ(ఎం) మద్దతు కోరామని అన్నారు. ఏపీ ప్రజలను బీజేపీ మోసం చేసిందని విమర్శించారు. విభజన హామీలు అమలు చేయని బీజేపీకి వైసీపీ, టీడీపీ గులాం గిరి చేస్తున్నాయని విమర్శించారు. ప్రత్యేక హోదా విభజన హామీల అమలు సాధనకు చివరి వరకు పోరాటం చేస్తామని అన్నారు.

అంతకు ముందు శరద్ పవార్‌ను ఆయన నివాసంలో, డీఎంకే రాజ్యసభ పక్షనేత తిరుచ్చి శివను ఆయన నివాసంలో, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేని షర్మిలా రెడ్డి, ఇతర నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోదా ఉద్యమానికి మద్దతు కోరారు.

జార్ఖండ్ సీఎంగా చంపాయ్ ప్రమాణం

(మొదటిపేజి తరువాయి)

43 మంది ఎమ్మెల్యేల మద్దతుంది. వీరిలో చంపాయ్‌తో పాటు ఇద్దరు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. తనకు 43 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందనీ, ఈ సంఖ్య 46-48కు చేరుకోవచ్చని చంపాయ్ తెలిపారు. తమ కూటమి బలంగా ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. కాగా, బలపరీక్ష కోసం ఈ నెల 9న అసెంబ్లీ సమావేశం కానున్నట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో తమ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు సంకీర్ణ కూటమి సిద్ధమైంది.

హైదరాబాద్‌కు ఎమ్మెల్యేలు

చంపాయ్ సోరెన్ ప్రమాణ స్వీకారం చేసిన కొద్దిసేపటికే కీలక పరిణామం చోటుచేసుకుంది. అధికార జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణ ఎమ్మెల్యేలు శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. రెండు ప్రత్యేక విమానాల్లో దాదాపు 43 మంది ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కు తరలివచ్చారు. వీరిని బేగంపేట విమానాశ్రయం నుంచి నేరుగా శామీర్‌పేట్‌లోని ఓ రిసార్ట్‌కు తరలించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఏర్పాట్లు చేసింది. జార్ఖండ్ అసెంబ్లీ బలపరీక్ష తేదీ ఖరారయ్యే వరకూ వీరంతా హైదరాబాద్ క్యాంపులోనే ఉండనున్నట్టు సమాచారం. ఆపరేషన్ జార్ఖండ్ బాధ్యతలను తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ దీపా దాస్ మున్షి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్‌కు టీపీసీసీ అప్పగించింది.

హేమంత్ సోరెన్ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్‌ను సవాలు చేస్తూ జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. 'మేం జోక్యం చేసుకోలేం. హైకోర్టుకు వెళ్లండి' అని సుప్రీంకోర్టు పేర్కొంది. హేమంత్ సోరెన్‌ను బుధవారం అర్థరాత్రి అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అయితే పది రోజుల పాటు కస్టడీకి అప్పగించాలన్న ఈడీ అభ్యర్థనపై రాంచీలోని పీఎంఎల్‌ఏ కోర్టు గురువారం తీర్పును రిజర్వ్ చేసింది.

8 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు..?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈనెల 8 నుంచి ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. తొలిరోజు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ డాక్టర్ తమిళి సై ప్రసంగించనున్నారు. తొమ్మిదిన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ కొనసాగనుంది. ఈనెల 10న ప్రభుత్వం శాసనసభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుందని సమాచారం. ఆ మరుసటి రోజు ఆదివారం. అందువల్ల ఆ రోజు కాకుండా సోమవారం (12) నుంచి బడ్జెట్‌పై చర్చను ప్రారంభించనున్నారు. అప్పటి నుంచి ఓ ఐదారు రోజులపాటు సభ కొనసాగే అవకాశాలున్నాయని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి. అయితే సమావేశాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

రైల్వే బడ్జెట్ కేటాయింపుల్లో భారీ వ్యత్యాసం

(మొదటిపేజి తరువాయి)

సమావేశంలో చెప్పుకొచ్చారు. దక్షిణ మధ్య రైల్వేకు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.13,786.19 కోట్లు కేటాయించగా, 2024-25లో రూ.14,232.84 కోట్ల బడ్జెట్ కేటాయింపులు జరిగాయని తెలిపారు. తెలంగాణ కనెక్టివిటీకి సంబంధించి రూ.770.12 కోట్ల అంచనా వ్యయంతో భద్రాచలం రోడ్డు - డోర్నకల్ మధ్య 54.65 కిలోమీటర్ల మేర డబ్లింగ్ ప్రాజెక్ట్ మంజూరైందని పేర్కొన్నారు. మనోహరాబాద్-కొత్తపల్లి కొత్త లైన్ ప్రాజెక్టు కోసం రూ.350 కోట్లు కేటాయించారనీ, 151 కి.మీ., ఈ ప్రాజెక్టు 2006-07 సంవత్సరంలో రూ. 1,160 కోట్లతో మంజూరు చేశారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాగ స్వామ్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్ట్‌లో 1/3వ వంతు నిధులు, అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాల్సి ఉందనీ, దానిలో భాగంగా మనోహరాబాద్ - సిద్దిపేట మధ్య 76 కిలోమీటర్ల సెక్షన్‌ను పూర్తి చేసి ప్రారంభించామనీ, మిగిలిన పనులు జరుగుతున్నాయని వివరించారు. కాజీపేట-విజయవాడ మూడవ లైన్ ప్రాజెక్ట్ కోసం రూ.310 కోట్లు కేటాయించారనీ, 220 కి.మీ., పొడవుగల మూడవ రైల్వే లైన్ ప్రాజెక్ట్ పనులు 2012-13 సంవత్సరంలో రూ. 1,953 కోట్ల వ్యయంతో మంజూరు అయ్యాయని తెలిపారు. విజయవాడ- ఎర్రుపాలెం మధ్య 33 కిలోమీటర్లు, వరంగల్-నెక్కొండ సెక్షన్ల మధ్య 32 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయనీ, మిగిలిన సెక్షన్లలో పనులు జరుగుతున్నాయని చెప్పారు.ముదేడ్ మరియు సికింద్రాబాద్ మీదుగా అకోలా- డోన్ (పూర్ణ - ముదేడ్ మరియు బొల్లారం - మహబూబ్‌నగర్ మినహా) డబ్లింగ్ ప్రాజెక్ట్ కోసం రూ. 220 కోట్లు కేటాయించారని చెప్పారు. రైల్వే బోర్డు సూచనల మేరకు బొల్లారం - మహబూబ్‌నగర్ మధ్య ఇప్పటికే పూర్తయిన భాగాన్ని మినహాయించి ముదేడ్ - డోన్ మధ్య ప్రాజెక్ట్‌ను చేపడుతున్నామన్నారు. గుంటూరు- బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టు కోసం రూ.200 కోట్లు కేటాయించారన్నారు. ఈ ప్రాజెక్ట్ 2023-24లో 248 కి.మీ.ల మేర రూ. 2,480 కోట్ల వ్యయంతో మంజూరు చేయబడిందని తెలిపారు. భద్రాచలం రోడ్డు - డోర్నకల్ డబ్లింగ్ ప్రాజెక్టుకు రూ.100 కోట్లు కేటాయించారన్నారు. ఎమ్ఎమ్‌టీఎస్ రెండవ దశ ప్రాజెక్ట్ కోసం వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించారని తెలిపారు. రూ.817 కోట్ల వ్యయంతో మంజూరైన ఈ ప్రాజెక్ట్‌లో ఇప్పటి వరకు మల్కాజిగిరి-బొల్లారం మధ్య 14 కి.మీ., డబుల్ లైన్ విద్యుదీకరణ, తేలాపూర్ - రామచంద్రపురం మధ్య 6 కిలోమీటర్లు , మేడ్చల్ - బోలారం మధ్య డబ్లింగ్ 14 కిలోమీటర్లు, మౌలాలీ - ఘట్‌కేసర్ మధ్య 12.2 కిలోమీటర్లు నాలుగు లైన్లు, మరియు ఫలక్‌నుమా-ఉందానగర్ మధ్య 13.5 కి.మీ మేర డబ్లింగ్ పనులు పూర్తయ్యాయని చెప్పారు. ప్రస్తుతం ఈ సెక్షన్‌లోని సనత్‌నగర్ నుంచి మౌలాలీ వరకు విద్యుదీకరణ డబ్లింగ్ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఎమ్ఎమ్‌టీఎస్ రెండవ దశ యాదాద్రి వరకు విస్తరణ ప్రాజెక్ట్ కోసం రూ. 10 కోట్లు కేటాయించారని చెప్పారు. 2016-17లో 33 కిలోమీటర్ల మేర దూరానికి రూ.330 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేయబడిందనీ, ఆ తర్వాత ఈ వ్యయం రూ. 430 కోట్లకు పెరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలను కవర్ చేస్తున్న విజయవాడ (19.5 కి.మీ), కాజీపేట (10.65 కి.మీ), రేణిగుంట (9.6 కి.మీ) మరియు వాడి (7.6 కి.మీ) వద్ద బై-పాస్ లైన్ల నిర్మాణానికి రూ.209.8 కోట్లు కేటాయించారన్నారు. తెలంగాణ-మహారాష్ట్ర రాష్ట్రాలకు సంబంధించి పర్లి వైద్యనాథ్ (1.9 కిమీ), వికారాబాద్ (2.8 కిమీ), విష్ణుపురం (4.9 కిమీ), లాతూర్, ముదేడ్, పూర్ణ, అంకోలా బై-పాస్ లైన్ల నిర్మాణానికి రూ. 172.27 కోట్లు కేటాయించారని చెప్పారు. కాజీపేటలో రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ కోసం రూ.150 కోట్లు, చర్లపల్లిస్టేషన్‌లో శాటిలైట్ టెర్మినల్ అభివృద్ధి కోసం రూ.46 కోట్లు కేటాయించారు. వందే భారత్ రైళ్ల నిర్వహణ సౌకర్యాల అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించారు. సమావేశంలో ఏజీఎమ్ ఆర్ ధనుంజయ్, సీపీఆర్వో సీహెచ్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయ్ రాజకీయ ప్రవేశం

(మొదటిపేజి తరువాయి)

తమ పార్టీని రిజిస్టర్ చేయాలని ఎన్నికల కమిషన్‌కు దరఖాస్తు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం తమిళనాడులో అవినీతి పాలన కొనసాగుతోందని, దానికి వ్యతిరేకంగా పోరాడేందుకే రాజకీయాల్లోకి వచ్చామని తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేయదని, 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దిగుతామని ప్రకటించారు.

పార్టీ జెండా, ఎజెండాను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. గత గురువారం చెన్నైలో జరిగిన అభిమాన సంఘం విజయ్ మక్కల్ ఇయకం సాధారణ సమావేశం కొత్తగా పార్టీని నమోదు చేయాలని, అధ్యక్షుడిగా విజయ్ పార్టీ నియమావళిని సిద్ధం చేయాలని నిర్ణయించింది. 2018లో తూత్తుకుడి పోలీసు కాల్పుల్లో మరణించిన వారి కుటుంబ సభ్యులను విజయ్ పరామర్శించారు. విజయ్ మక్కల్ ఇయకం ఇప్పటికే తమిళనాడు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసింది. ఈ సంఘం ఆధ్వర్యాన రాష్ట్రంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

దద్దరిల్లిన పార్లమెంట్

(మొదటిపేజి తరువాయి)

స్వతంత్ర సంస్థలు అధికారంలో ఉన్నవారిపై ఆధారపడితే,, అది దేశ ప్రయోజనాలకే కాదు, దాని స్వతంత్రతకే వ్యతిరేకం" అని శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది అన్నారు.

కాంగ్రెస్ ఎంపీ వ్యాఖ్యలపై దుమారం

బడ్జెట్ కేటాయింపుల్లో తమకు అన్యాయం జరుగుతున్నదనీ, ఇదే కొనసాగితే.. దక్షిణాది రాష్ట్రాలలో ప్రత్యేక దేశం ఏర్పాటుచేయాలనే డిమాండ్ రావొచ్చని కాంగ్రెస్ ఎంపీ డికె సురేష్ వ్యాఖ్యానించారు. దీనిపై ఉభయ సభల్లోనూ తీవ్ర దుమారం చెలరేగింది. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్ క్షమాపణలు చెప్పాలని రాజ్యసభలో పీయూష్ గోయల్ డిమాండ్ చేశారు. దేశాన్ని ఒక్కటిగా ఉంచాలనేదే కాంగ్రెస్ సిద్ధాంతమని, విభజన కోరే వారికి పార్టీ ఎప్పటికీ మద్దతు తెలపదని ఖర్గే స్పష్టం చేశారు. డీకే సురేష్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత సోనియా గాంధీ క్షమాపణలు చెప్పాలనీ, ఆయనపై పార్టీ తక్షణం చర్యలు తీసుకోవాలని లోక్‌సభలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి డిమాండ్ చేశారు.

అసోం సీఎం వ్యాఖ్యలపై ఖర్గే మండిపాటు

వర్ణ వ్యవస్థనుద్దేశించి అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ సోషల్ మీడియా పోస్ట్‌పై దుమారం చెలరేగింది. ఓ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ తరహా భాషను వాడటం సిగ్గుచేటని, తక్షణమే ఆయనను తొలగించాలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్‌లో ఉన్న ఆ సీఎం ప్రస్తుతం బీజేపీ పంచన చేరారని, ఆయన పేరును కూడా తాను ప్రస్తావించనని ఖర్గే చెబుతూ శర్మ వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేశారు. "వ్యవసాయం, వ్యాపారం వైశ్యుల సహజ కర్తవ్యాలని, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులకు సేవలు చేసే విధి శూద్రులది" అని బీజేపీ సీఎం ట్విట్టర్‌లో రాసుకొచ్చారు. తీవ్ర వ్యతిరేకత రావడంతో ఈ పోస్ట్‌ను తరువాత డిలీట్ చేశారు. ఓ సీఎం ఇలా మాట్లాడతారా? ఇలాంటి ఆలోచనలు కలిగిన ఆయన పేదల కోసం ఏం పనిచేస్తారని ఖర్గే నిలదీశారు. ఇలాంటి వ్యక్తులను పార్టీలో ఎలా కొనసాగిస్తున్నారని తాను ప్రధానిని అడుగుతున్నానని ప్రశ్నించారు. సామాజిక న్యాయం తీసుకువస్తానని ప్రధాని చెబుతుంటారని, మరోవైపు వారి నేతల మనస్తత్వం ఇలా ఉందని ఖర్గే ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్న నేతలు ఇలా మాట్లాడటం తనను బాధించిందని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు.

మరోవైపు ఉభయ సభల్లో ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు పార్లమెంట్‌లోని తన ఛాంబర్లో కేంద్ర మంత్రులతో ప్రధాని మోడీ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. దీనికి హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సహా మంత్రులు ప్రహ్లాద్ జోషి, అనురాగ్ ఠాకూర్, నితిన్ గడ్కరీ, అర్జున్ రామ్ మేఘ్వాల్ హాజరయ్యారు. అలాగే మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో ఇండియా ఫోరం నేతల సమావేశం కూడా జరిగింది. పార్లమెంట్ ఉభయ సభల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు.

సీబీఐ సోదాలు...

(మొదటిపేజి తరువాయి)

వసంత్ కుంజ్‌లో గల ఆయన ఇల్లు, అధిచినిలోని ఆయన కార్యాలయంలో సీబీఐ దాడులు జరిపింది. దాదాపు మూడు గంటలు సోదాలు జరిపిన సీబీఐ బృందం దాదాపు 11 గంటల ప్రాంతంలో ఆయన ఇల్లు, కార్యాలయాల నుంచి బయటకు వచ్చింది. అనంతరం హర్ష మందర్ స్పందించారు. " నా జీవితం, నా పని మాత్రమే నా ప్రతిస్పందన" అన్నారు. గతంలో 2021, సెప్టెంబర్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హర్షమందర్ ఇల్లు, కార్యాలయంతో పాటు ఆయన పిల్లలకు చెందిన సెంటర్ ఫర్ ఈక్విటీ స్టడీస్ (సీఈఎస్)లో కూడా సోదాలు నిర్వహించింది.

భవిష్యత్ మనదే..

కార్యకర్తలు అధైర్యపడొద్దు

(మొదటిపేజి తరువాయి)

చేస్తున్నారని, పార్లమెంట్‌లో తెలంగాణ కోసం మాట్లాడే వారు బీఆర్ఎస్ ఎంపీలు మాత్రమే అన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ పని అయిపోయిందని విమర్శించారు. భువనగిరిలో పైళ్ల శేఖర్ రెడ్డి ఓడిపోలేదని కొంతమంది మోసం చేశారని చెప్పారు.

సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు నిజాం వారసులైతే.. తాము చాకలి ఐలమ్మ వారసులమని, జైల్లో వేస్తామంటే భయపడేవారు ఎవరూ లేరన్నారు. కోమటిరెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. అధికారంతో విర్రవీగడం మంచిది కాదని, నల్లగొండకు ఏం చేశారని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా తోడుగా ఉంటానన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, జిట్టా బాలకృష్ణారెడ్డి మాట్లాడారు. జిల్లా పరిషత్ చైర్మెన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో లోపాలను సరిదిద్దుకుని.. అధిక ఎంపీ సీట్లు గెలిచేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, నాయకులు కొలుపుల అమరేందర్, జడల అమరేందర్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, జనగాం పాండు, ఓం ప్రకాష్, జడ్పిటిసి బీరు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

(మొదటిపేజి తరువాయి)

తీసుకోనుంది. దీంతోపాటు ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే రెండింటిని (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిధిని రూ.10 లక్షలకు పెంపు) అమలు చేసిన క్రమంలో మిగిలిన వాటిలో ముఖ్యమైన రెండు అంశాల(200 యూనిట్లలోపు కరెంటు వాడే వారికి ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్)పై కూడా సీఎం తన మంత్రివర్గ సహచరులతో సమాలోచనలు చేయనున్నారు. ఆ రెండు హామీల కోసం వచ్చిన దరఖాస్తులెన్ని? లబ్దిదారుల సంఖ్య ఎంత? ఇప్పటి వరకూ ఎన్ని అప్లికేషన్లను పరిశీలించి, పరిష్కరించారనే విషయాలపై ముఖ్యమంత్రి వివరాలను తెలుసుకోనున్నారు. వాటి అమలుకు ఎన్ని నిధులను కేటాయించాలి..? ఆ సొమ్మును ఏ రూపంలో సమకూర్చుకోవాలనే విషయాలపై కూడా క్యాబినెట్ చర్చించనుంది. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, కొత్త పాలక మండలిని నియమించిన నేపథ్యంలో ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఎలా ముందుకెళ్లాలనే దానిపై కూడా మంత్రివర్గం చర్చించనుందని ఉన్నతాధికారులు వివరించారు. అత్యంత కీలకమైన ఈ క్యాబినెట్ సమావేశానికి విధిగా హాజరు కావాలంటూ అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతీసారి బడ్జెట్ ప్రతిపాదనకు ఒక రోజు ముందు క్యాబినెట్ సమావేశమై... పద్దుకు ఆమోదముద్ర వేయటం ఆనవాయితీ. ఈనెల రెండో వారంలో అసెంబ్లీ సమావేశాలను నిర్వహించేందుకు సర్కార్ సమాయత్తమవుతున్న క్రమంలో... ఆదివారం నిర్వహించబోయే క్యాబినెట్ కాకుండా మరో వారం రోజుల్లో ఇంకోసారి మంత్రివర్గం సమావేశమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పుడు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను సర్కారు ఆమోదిస్తుందని సమాచారం.

విశాఖ తీరంలో భారత్, ఇంగ్లాండ్ రెండో టెస్టు. తొలి రోజు టీమ్ ఇండియా 336 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ ఆరు వికెట్లు పడగొట్టింది. దీంతో తొలి రోజు ఆటలో పైచేయి ఎవరదనే సందేహం కలుగుతుంది. కానీ విశాఖలో ఇటు భారత్, అటు ఇంగ్లాండ్ కాకుండా.. తొలి రోజు యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (179 నాటౌట్) జైత్రయాత్ర సాగించాడు. 336 పరుగులు చేసినా బ్యాటింగ్ లైనప్‌ను కోల్పోయిన నిరాశలో భారత్ ఉండగా.. ఆరు వికెట్లు కూల్చినా జైస్వాల్ దూకుడుకు అడ్డుకట్ట వేయలేదనే నైరాశ్యం ఇంగ్లాండ్ శిబిరంలో మిగిలింది.

22 ఏండ్ల యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ ఇంగ్లాండ్ బౌలర్లను ఉతికారేశాడు. 257 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్సర్లతో విశ్వరూపం చూపించాడు. సహచర బ్యాటర్లు నిరాశపరిచినా మరో ఎండ్ నుంచి జైస్వాల్ దంచికొట్టాడు. ద్వి శతకం దిశగా దూసుకెళ్తున్న యశస్వి జైస్వాల్ సూపర్ ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ బౌలర్లకు ఎటువంటి అవకాశం ఇవ్వలేదు. నేడు ఉదయం సెషన్లో ఆతిథ్య భారత్ 400 ప్లస్ స్కోరు ఆశిస్తుండగా.. ఇంగ్లాండ్ చివరి నాలుగు వికెట్లే లక్ష్యంగా చేసుకోనుంది.

జయహో జైస్వాల్

- అజేయ శతకంతో చెలరేగిన యశస్వి
- రాణించిన శుభ్‌మన్, రజత్
- భారత్ తొలి ఇన్నింగ్స్ 336/6

ఇంగ్లాండ్‌తో రెండో టెస్టు తొలి రోజు



సెషన్ల వారీగా..

తొలి సెషన్	
పరుగులు	:103
ఓవర్లు	:31
వికెట్లు	:02
రెండో సెషన్	
పరుగులు	:122
ఓవర్లు	:32
వికెట్లు	:01
మూడో సెషన్	
పరుగులు	:111
ఓవర్లు	:30
వికెట్లు	:03

నవతెలంగాణ-విశాఖపట్నం

యశస్వి జైస్వాల్ (179 బ్యాటింగ్, 257 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. విశాఖలో ఇంగ్లాండ్ బౌలర్లను దంచికొట్టిన యువ ఓపెనర్ టెస్టుల్లో కెరీర్ అత్యుత్తమ ఇన్నింగ్స్ నమోదు చేశాడు. ఇంగ్లాండ్ ఆల్ స్పిన్ ఎదురుదాడిలో టీమ్ ఇండియా ఇతర బ్యాటర్లు నిరాశపరిచినా.. వన్‌మ్యాన్ షోతో యశస్వి జైస్వాల్ భారత్‌ను భారీ స్కోరు దిశగా నడిపిస్తున్నాడు. శుభ్‌మన్ గిల్ (34, 46 బంతుల్లో 5 ఫోర్లు), రజత్ పటీదార్ (32, 72 బంతుల్లో 3 ఫోర్లు) రాణించారు. యశస్వి జైస్వాల్ వీరవిహారంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 336/6 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ బౌలర్లలో అరంగ్రేట స్పిన్నర్ షోయబ్ బషీర్ (2/100), రెహాన్ అహ్మద్ (2/61) రెండేసి వికెట్లు పడగొట్టారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి యశస్వి జైస్వాల్‌తో పాటు రవిచంద్రన్ అశ్విన్ (5 బ్యాటింగ్) అజేయంగా నిలిచాడు. తొలి రోజు ఆటలో 93 ఓవర్లలో 3.61 రన్‌రేట్‌తో భారత్ 336 పరుగులు చేయగా, ఇంగ్లాండ్ ఆరు వికెట్లు పడగొట్టింది.

ఆరంభం అదిరింది : భారత్ 103/2

విశాఖ టెస్టులో కీలక టాస్ నెగ్గిన టీమ్ ఇండియా తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ (14) మరోసారి శుభారంభం అందించారు. జైస్వాల్ సహజశైలిలో దూకుడుగా ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టగా.. కెప్టెన్ రోహిత్ శర్మ ఆచితూచి ఆడాడు. తొలి వికెట్‌కు రోహిత్, జైస్వాల్ 105 బంతుల్లో 40 పరుగులు జోడించారు. అరంగ్రేట స్పిన్నర్ బషీర్ లెగ్ స్లిప్స్‌లో రోహిత్ శర్మకు వల విసిరాడు. దీంతో ఓపెనింగ్ వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. నం.3 బ్యాటర్ శుభ్‌మన్ గిల్ (34)తో జట్టుకట్టిన జైస్వాల్.. మరో కీలక భాగస్వామ్యం నిర్మించాడు. గిల్ క్రీజులోకి వచ్చాక స్కోరు బోర్డును అతడే ముందుకు నడిపించాడు. ఐదు ఫోర్లతో ఆకట్టుకున్నాడు. కానీ అండర్సన్ ఓవర్లో వికెట్ కీపర్‌కు చిక్కటంతో మెరుపు ఇన్నింగ్స్‌కు తొలి సెషన్లోనే తెరపడింది. మరో ఎండ్‌లో యశస్వి జైస్వాల్ ఆరు ఫోర్లు, ఓ సిక్సర్తో 89 బంతుల్లో అర్థ సెంచరీ నమోదు చేశాడు. శ్రేయస్ అయ్యర్‌తో కలిసి లంచ్ విరామ సమయానికి మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డాడు. తొలి సెషన్లో భారత్ 31 ఓవర్లలో 2 వికెట్లకు 103 పరుగులు చేసింది.



యశస్వి శతక విహారం : భారత్ 225/3

లంచ్ విరామం అనంతరం యశస్వి జైస్వాల్ దంచికొట్టాడు. ఇంగ్లాండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. శ్రేయస్ అయ్యర్ (27, 59 బంతుల్లో 3 ఫోర్లు)తో కలిసి మూడో వికెట్‌కు జైస్వాల్ 131 బంతుల్లోనే 90 పరుగులు జోడించాడు. ఇందులో జైస్వాల్ 72 బంతుల్లో 63 పరుగులు చేయగా.. అయ్యర్ 59 బంతుల్లో 27 పరుగులు సాధించాడు. క్రీజులో కుదురుకున్నట్టే కనిపించిన అయ్యర్.. హార్ట్‌లీ బౌలింగ్‌లో వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో కీలక మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. 94 పరుగుల వద్ద ఉండగా.. హార్ట్‌లీ ఓవర్లో క్రీజు వదిలి ముందుకొచ్చి భారీ సిక్సర్‌తో శతకం విన్యాసం చేశాడు. 11 ఫోర్లు, 3 సిక్సర్లతో 151 బంతుల్లోనే జైస్వాల్ సెంచరీ సాధించాడు. సర్ఫరాజ్‌తో పోటీపడి తుది జట్టులో నిలిచిన రజత్ పటీదార్ విశాఖ టెస్టులో అరంగ్రేటం చేశాడు. టీ విరామ సమయానికి యశస్వితో కలిసి పటీదార్ అజేయంగా నిలిచాడు. ఈ సెషన్లో భారత్ ధారాళంగా పరుగులు పిండుకుంది. 31 ఓవర్లలోనే ఏకంగా 122 పరుగులు సాధించింది. ఇంగ్లాండ్‌కు మాత్రం ఒక్క వికెటే దక్కింది.

ఎదురులేని జైస్వాల్ : భారత్ 336/6

చివరి సెషన్‌ను ఇరు జట్లు సమంగా పంచుకున్నాయి. భారత్ 30 ఓవర్లలో 111 పరుగులు చేయగా.. ఇంగ్లాండ్ మూడు వికెట్లు పడగొట్టి మ్యాచ్ రేసులో నిలిచింది. యశస్వి, పటీదార్ 70 పరుగుల నాల్గో వికెట్ భాగస్వామ్యానికి రెహాన్ అహ్మద్ తెరదించాడు. రెహాన్ బంతిని డిఫెన్స్ ఆడబోయిన పటీదార్.. వికెట్‌ను కోల్పోయాడు. అక్షర్ పటేల్ (27, 51 బంతుల్లో 4 ఫోర్లు) తోడుగా యశస్వి జోరు పెంచాడు. అక్షర్ నాలుగు ఫోర్లతో మెరువగా.. యశస్వి 16 ఫోర్లు, 4 సిక్సర్లతో 224 బంతుల్లో 150 పరుగుల మైలురాయి చేరుకున్నాడు. అక్షర్ పటేల్ నిష్క్రమణతో క్రీజులోకి వచ్చిన తెలుగు తేజం శ్రీకర్ భరత్ (17) నిరాశపరిచాడు. 23 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్సర్‌తో సరిపెట్టాడు. సొంత మైదానంలో అభిమానుల నడుమ భావోద్వేగాలకు గురైన భరత్ ధనాధన్‌కు వెళ్లాడు. ఆ క్రమంలో రెహాన్ అహ్మద్‌కు వికెట్ కోల్పోయాడు. ఓ ఎండ్‌లో వికెట్లు పడుతున్నా.. మరో ఎండ్‌లో యశస్వి వెనక్కి తగ్గలేదు. అజేయంగా 179 పరుగులు సాధించాడు. రవిచంద్రన్ అశ్విన్ (5 బ్యాటింగ్)తో కలిసి మరో భాగస్వామ్యానికి తెరతీశాడు. మూడు 50 ప్లస్, రెండు 40 ప్లస్ భాగస్వామ్యాలు నిర్మించిన యశస్వి జైస్వాల్.. భారత ఇన్నింగ్స్‌ను ఒంటిచేత్తో నిలబెట్టాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ నాటౌట్ 179, రోహిత్ శర్మ (సి) పోప్ (బి) బషీర్ 14, శుభ్‌మన్ గిల్ (సి) ఫోక్స్ (బి) అండర్సన్ 34, శ్రేయస్ అయ్యర్ (సి) ఫోక్స్ (బి) హార్ట్‌లీ 27, రజత్ పటీదార్ (బి) రెహాన్ అహ్మద్ 32, అక్షర్ పటేల్ (సి) రెహాన్ అహ్మద్ (బి) బషీర్ 27, శ్రీకర్ భరత్ (సి) బషీర్ (బి) రెహాన్ అహ్మద్ 17, రవిచంద్రన్ అశ్విన్ నాటౌట్ 5, ఎక్స్‌ట్రాలు : 1, **మొత్తం : (93 ఓవర్లలో 6 వికెట్లకు) 336.**

వికెట్ల పతనం : 1-40, 2-89, 3-179, 4-249, 5-301, 6-330.

బౌలింగ్ : జేమ్స్ అండర్సన్ 17-3-30-1, జో రూట్ 14-0-71-0, టామ్ హార్ట్‌లీ 18-2-74-1, షోయబ్ బషీర్ 28-0-100-2, రెహాన్ అహ్మద్ 16-2-61-2.

సెమీస్‌లో అష్మిత

- ట్రెసా, గాయత్రిలకు నిరాశ
- థాయ్‌లాండ్ మాస్టర్స్



బ్యాంకాక్ : థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్ 300 టోర్నీలో వర్థమాన షట్లర్ అష్మిత చాలిహ మెప్పించింది. మహిళల సింగిల్స్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ఇండోనేషియా అమ్మాయి నురుమిపై 21-14, 19-21, 21-13తో మూడు గేముల మ్యాచ్‌లో విజయం సాధించింది. 57 నిమిషాల మ్యాచ్‌లో క్వాలిఫయర్ అష్మిత ఆకట్టుకుంది. తొలి గేమ్‌ను సులువుగా సొంతం చేసుకున్న అష్మితకు రెండో గేమ్‌లో గట్టి పోటీ ఎదురైంది. 19-15తో అష్మిత ఆధిక్యంలో నిలిచినా నురుమి వరుస పాయింట్లతో పుంజుకుంది. 21-19తో మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. డిసైడర్‌లో అష్మిత రెచ్చిపోయింది. ఆరంభం నుంచీ ఆధిక్యంలో కొనసాగింది. 11-3తో విరామ సమయానికి ఎదురులేని ఆధిక్యం సాధించింది. 21-13తో అలవోకగా మూడో గేమ్ గెలిచి సెమీఫైనల్ బెర్త్‌ను సొంతం చేసుకుంది. నేడు సెమీస్‌లో నాల్గో సీడ్ సుపనిద (థాయ్‌లాండ్)తో అష్మిత తలపడనుంది. మహిళల డబుల్స్‌లో ట్రెసా జాలి, పుల్లెల గాయత్రి జంట ఓటమి పాలైంది. 12-21, 21-17, 21-23తో నాల్గో సీడ్ ఇండోనేషియా జోడీ చేతిలో పోరాడి ఓడింది. మెన్స్ సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో మిథున్ మంజునాథ్ సైతం 19-21, 15-21తో ఓటమి చెంది టోర్నీ నుంచి నిష్క్రమించాడు.


మిజోరం 199/10

హైదరాబాద్‌తో రంజీ పోరు



హైదరాబాద్ : ఆఫ్ స్పిన్నర్ రోహిత్ రాయుడు (4/20) నాలుగు వికెట్ల మాయజాలంతో మిజోరం 199 పరుగులకే కుప్పకూలింది. రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్‌లో గ్రూప్ దశ మ్యాచ్‌లో హైదరాబాద్ బౌలర్ల ముందు మిజోరం తేలిపోయింది. 56 ఓవర్లలో 199 పరుగులకే తొలి ఇన్నింగ్స్‌లో కుప్పకూలింది. అగ్ని చోప్ర (43), కరియప్ప (45) రాణించటంతో మిజోరం మెరుగైన స్కోరు సాధించింది. హైదరాబాద్ బౌలర్లలో కార్తికేయ కక్ (2/34) రెండు వికెట్లు కూల్చగా.. రవితేజ, సాంకెత్, తనయ్ త్యాగరాజన్ తలా ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 120/1తో ఆడుతోంది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (6) నిరాశపరిచినా.. రాహుల్ సింగ్ (81 నాటౌట్), రోహిత్ రాయుడు (25 నాటౌట్) అజేయంగా ఆడుతున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 79 పరుగుల వెనుకంజలో నిలిచింది.

నవచిత్రం



విజయ దేవరకొండ

సమ్మర్ స్పెషల్‌గా ఫ్యామిలీ స్టార్

హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. ఈ సినిమా రిలీజ్ డేట్‌ను శుక్రవారం మూవీ టీమ్ అనౌన్స్ చేసింది. ఏప్రిల్ 5వ తేదీన ఈ సినిమాను గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నట్టు అఫీషియల్‌గా వెల్లడించారు.

ఈ సినిమాను ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు.

పరశురామ్ పెట్ల దర్శకుడు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వాసు వర్మ వ్యవహరిస్తున్నారు.

ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ మ్యాన్‌లా కనిపిస్తున్నారు. లుంగీ కట్టుకుని గన్నీ బ్యాగ్, ఆధార్ కార్డ్‌తో విజయ్ హడావుడిగా వస్తున్న పోస్టర్ చూడగానే ఆకట్టుకుంటోంది. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన టైటిల్ టీజర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమాని థియేటర్స్‌లో ఎంజాయ్ చేసేందుకు అన్ని వర్గాల ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. అలాగే ఈ సినిమాపై అందరూ పెట్టుకున్న అంచనాలకు మించి ఉంటుంది అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ : కేయూ మోహనన్, సంగీతం : గోపీసుందర్, ఆర్ట్ డైరెక్టర్ : ఏ ఎస్ ప్రకాష్, ఎడిటర్ : మార్తాండ్ కె వెంకటేష్, క్రియేటివ్ ప్రొడ్యూసర్ : వాసు వర్మ నిర్మాతలు : రాజు - శిరీష్, రచన, దర్శకత్వం - పరశురామ్ పెట్ల.

తిరగబడర సామీ రిలీజ్‌కి రెడీ



రాజ్‌తరుణ్, మాల్వి మల్హోత్రా

రాజ్ తరుణ్ హీరోగా, ఎ ఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తిరగబడరసామీ'. మాల్వి మల్హోత్రా కథానాయిక. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానర్ పై మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది.

తాజాగా ఈ చిత్రం నుంచి సెలబ్రేషన్ సాంగ్‌ని విడుదల చేశారు. కంపోజర్ జేబీ ఈ పాటని పర్ఫెక్ట్ సెలబ్రేషన్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. లిప్సికా భాష్యం, అదితి బావరాజు, చైతు సత్సంగి వీనుల విందుగా ఆలపించారు. సుద్దాల అశోక్ తేజ లిరిక్స్ మరింత ఆకర్షణగా నిలిచాయి. ఈ పాటలో విజువల్స్ కన్నుల పండగలా ఉన్నాయి. యువతని ఆకట్టుకునే రోమాన్స్‌తో పాటు ఫ్యామిలీని ఆకర్షించే సెంటిమెంట్, మాస్‌ని అలరించే హై వోల్టేజ్ యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించారు. హిందీ బిగ్ బాస్‌తో యావత్ భారతాన్ని అలరించిన మన్నారా చోప్రా ఈ చిత్రంలో ఓ విభిన్న పాత్రతో పాటు ప్రత్యేక గీతంతో అలరించనుంది. ఈనెల 23న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది. మకరంద్ దేశ్‌పాండే, రఘు బాబు, జాన్ విజయ్, అంకిత ఠాకూర్, పృథ్వి, ప్రగతి, రాజా రవీంద్ర, బిత్తిరి సత్తి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జెబి, డీవోపీ: జవహర్ రెడ్డి యం.ఎస్, ఎడిటర్: బస్వా పైడిరెడ్డి, ఆర్ట్: రవికుమార్ గుర్రం, ఫైట్స్ - పృధ్వీ, కార్తీక్, లిరిక్స్: సుద్దాల అశోక్ తేజ, శ్రీమణి.

హను-మాన్ సంచలన విజయం

ప్రశాంత్ వర్మ, హీరో తేజ సజ్జా కాంబోలో రూపొందిన సినిమా 'హను-మాన్. 92 సంవత్సరాల టాలీవుడ్ చరిత్రలో ఆల్ టైమ్ సంక్రాంతి బ్లాక్ బస్టర్‌గా ఈ సినిమా నిలవడం విశేషం. ఈ ఫాంటసీ అడ్వెంచర్ ప్రపంచవ్యాప్తంగా 300 కోట్ల గ్రాస్ మార్క్ దిశగా దూసుకుపోతోంది. ఓవర్సీస్‌లో 5 మిలియన్ల మార్క్‌ను అధిగమించింది. ఈ చిత్రం పాన్ ఇండియాగా విడుదలైంది. హిందీతో సహా అన్ని భాషలలో అద్భుతమైన వసూళ్లను సాధించింది. ముఖ్యంగా నార్త్ రీజియన్‌లో స్ట్రయిట్ హిందీ సినిమాలా అలరించింది. రిజనబుల్ టిక్కెట్ ధరలు ఉన్నప్పటికీ, ఈ సినిమా అనేక బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టింది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా మూడు వారాల రన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుని, ఇప్పుడు నాలుగో వారంలోకి ఎంటరైంది. ప్రస్తుత ట్రెండ్ ప్రకారం మరికొన్ని వారాల పాటు ఈ సినిమా కొనసాగుతుందని మేకర్స్ వ్యక్తం చేశారు.

భిన్న కాన్సెప్ట్‌తో ది గోట్ లైఫ్



పృథ్వీరాజ్ సుకుమారన్

మలయాళ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్న సినిమా 'ది గోట్ లైఫ్' (ఆడు జీవితం). హాలీవుడ్ యాక్టర్ జిమ్మీ జీన్ లూయిస్, అమలాపాల్, కేఆర్ గోకుల్, అరబ్ ఫేమస్ యాక్టర్స్ తాలిబ్ అల్ బలూషి, రిక్ ఆబే ఇతర కీలక పాత్రల్లో నటిస్తు న్నారు. బెన్యామిన్ రాసిన 'గోట్ డేస్' నవల ఆధారంగా ఈ సినిమాను డైరెక్టర్ బ్లెస్సీ రూపొందించారు. విజువల్ రొమాన్స్ బ్యానర్ ఈ సినిమాను మలయాళ చిత్ర పరిశ్రమలో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా భారీ బడ్జెట్‌తో నిర్మించింది. లేటెస్ట్‌గా ఈ సినిమా నుంచి ది బిగినింగ్ పోస్టర్‌ను హీరో దుల్కర్ సల్మాన్ సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో తన సుదీర్ఘ ప్రయాణానికి ముందు సంతోషంగా ఉన్న నజీబ్ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపిస్తున్నారు. 90వ దశకంలో జీవనోపాధి వెతుక్కుంటూ కేరళను వదిలి విదేశాలకు వలస వెళ్లిన నజీబ్ అనే యువకుడి జీవిత కథను వాస్తవ ఘటనల ఆధారంగా ఇందులో చూపించబోతున్నారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.